www.ninadam.co.in
తెలుగు దినపత్రిక
# నినాదం
గురువారం 1 - 5 - 2025 | సంపుటి : 21 | సంచిక : 224 | పేజీలు : 12 + 8 | వెల : రూ. 7/-
నిఖార్సైన జర్నలిజం
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## సింగిల్ బెంచ్ ఉత్తర్వులు రద్దుచేయం
### టిజిపిఎస్సీ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ




2వ పేజీలో..

## ఎక్స్‌ప్లోజివ్ ఘటనలో కోటి పరిహారం
2లో.

## దేశానికి దిక్సూచి నాడు బెంగాల్... నేడు తెలంగాణే
### సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం
### తెలంగాణ ప్రభుత్వ చర్యల ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకారం
### ఒక బీసీ బిడ్డగా... మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్న..
### కేంద్ర క్యాబినెట్ నిర్ణయంపై మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,(నినాదం):** మన దేశానికి దిక్సూచిగా నాడు బెంగాల్ ఉంటే... నేడు తెలంగాణే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సామాజిక దృక్పథం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకారం తెలిపిందని ఆమె అన్నారు. ఇది తమ నాయకుడు రాహుల్ గాంధీ ఆశ, ఆశయమని... తమ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కృషి అని సురేఖ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అంటూ సురేఖ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల పట్ల ఒక బీసీ బిడ్డగా... బీసీ మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్నట్టు ఆమె వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయంపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ సంపూర్ణ విజయమని మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. తమ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు, కుల రుగ్మతలు తొలగించడానికి దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సురేఖ గుర్తు చేశారు. రాష్ట్రంలో తమ మా ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగా బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన ఆధారంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని పేర్కొనడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఒక్క విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా సామాజిక రుగ్మతలు తొలగి అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్టు మంత్రి సురేఖ చెప్పారు.

## బంకర్‌లో దాక్కున్న ఉగ్రవాది హాఫీద్ సయీద్
### భారీగా భద్రత కల్పించిన పాక్ ప్రభుత్వం

**అమరావతి, (నినాదం):** భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్, ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కి పాకస్తాన్ భారీ ఎత్తున భద్రత కల్పిస్తోంది. తన ఇంట్లోనే ఉన్న బంకర్లో అతను దాక్కున్నాడు. అతనికి ప్రభుత్వం కూడా భారీ గా భద్రత కల్పించింది. పహ ల్గామ్ ఉగ్రదాడికి పాల్పడింది లష్కరే ప్రాక్సీ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాదులే అని తేలింది. . పహల్గామ్ దాడి తర్వాత భారత టార్గెట్‌లో ఖచ్చితంగా హాఫీజ్ సయీద్ ఉన్నాడని తెలిసి పాకిస్తాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ అతడికి హై లెవల్ సెక్యూరిటీని కల్పించినట్లు తెలుస్తోంది.


02

## యాదాద్రి జిల్లాలో పేలుడు ఘటన..
### మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం


02

**హైదరాబాద్,(నినాదం):** యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న జరిగిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. దీంతో మృతుల కుటుంబాలకు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

## పది ఫలితాలు విడుదల


2

- 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఫలితాల్లో 94.26 శాతంతో బాలికలే పైచేయి
- మహబూబాబాద్ ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్
- ఫలితాలు విడుదల చేసిన సిఎం రేవంత్

## కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు



02

## తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్
### మళ్లీ మమ్మేలనే విలన్ అంటావా..
### ఏం చేస్తున్ఆమో.. చేస్తలేమో సభకు వస్తే కదా తెలిసేది
### కెసిఆర్ విమర్శలను తిప్పికొట్టిన సిఎం రేవంత్

**హైదరాబాద్,(నినాదం):**

భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ఇలా ఎప్పుడూ చేయలేదన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై సీఎం దీటుగా స్పందించారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు కేసీఆర్ చెబుతున్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రజాపాలన ఆగిందా? అని ప్రశ్నించారు.

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని మండిపడ్డారు. విప్లవకారుడు అంటే తుపాకీ పట్టుకోవాల్సిన అవసరం లేదని, విప్లవాత్మక మార్పు తెచ్చే ఎవరైనా విప్లవకారుడని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ పై బసవేశ్వరుడు ప్రభావం ఎక్కువని సీఎం అన్నారు. ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దేలా ప్రతిపక్ష వ్యవస్థ ఏర్పాటు- చేసుకున్నామని అలాగే, ప్రజల అభివృద్ధి జీవన ప్రమాణాలు పెంచేలా రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్నట్లు- ఆయన తెలిపారు. శాసన సభలో సభ నాయకుడిగా నేను, మంత్రులం అంతా పాల్గొన్నామని తెలిపారు. అయితే, నిన్నగాక మొన్న ఒకాయన వరంగల్ లో సభ పెట్టిండని, అయితే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఇక సభకు ఎన్ని వందల బస్సులు అడిగితే అన్ని ఇవ్వండి అని మంత్రి పొన్నంకి చెప్పానని, అధికార పక్షమే కాదు.. ప్రతిపక్ష పార్టీ కూడా ఉండాలని అందుకు సహకరించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే, సభలో ప్రజల సమస్యలు ఏదైనా ప్రస్తావించారా..? మా లోపాలు చెప్పినవా..? మంచిని అభినందించావా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి జీత భత్యాలు తీసుకుంటు-న్నారు.. ఏ చట్టంలో ఉన్నది, జీతాలు తీసుకుని పని చేయడం అని అంటూనే.. అన్ని వసతులు అనుభవిస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే ఎలా అంటూ మండి పడ్డారు. అసెంబ్లీకి తాను రాను.. పిల్లల్ని పంపిస్తా అంటాడని సీఎం పేర్కొన్నారు.


02

## సింహాచలం ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి
- మృతులు కుటుంబాలకు సానుభూతి
- 2లక్షల పరిహారం
- ప్రకటించిన ప్రధాని మోడీ
- ఘటన విచారకరమన్న కిషన్‌రెడ్డి, సిఎం రేవంత్



## ఇంట్లోకి దూసుకెళ్లిన కారు..
### ఐదుగురు వైద్య విద్యార్థులు సహా ఆరుగురి మృతి

**కోవూరు, (నినాదం:)** నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ముంబయి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చిరెడ్డి పాలెంలో తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. మృతులను అభిషేక్ రాజ్ (అనంతపురం జిల్లా), జీవన్ చంద్రారెడ్డి (నెల్లూరు), యజ్ఞేశ్ (ప్రకాశం),నరేష్ నాయక్ (అనంతపురం), అభిశశి పురుషోత్తం( తిరుపతి), మరో విద్యార్థి నవనీత్ శంకర్ (కడప) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం.



## 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వండి..
- సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి
- ఘటనపై మంత్రులు.. అధికారులతో టెలికాన్ఫరెన్స్
- సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం

05




## పుష్కర మహోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలి
### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


02

## సింహాచలం ఘటనపై విచారం
### ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్న లోకేశ్

సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెందినట్లు- తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో జనసేన పార్టీ పోస్ట్ చేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.


05






# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

**92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత**

**ఫితాల్లో 94.26 శాతంతో బాలికల పైచేయి**

**మహబూబాబాద్ ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్**

**ఫలితాలు విడుదల చేసిని సిఎం రేవంత్**

**హైదరాబాద్, (నినాదం):** తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. టెన్త్ ఫలితాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం రవీంద్రభారతిలో విడుదల చేశారు. 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే 1.47 శాతం అధికంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరిగిన పది పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు- పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది.పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది రెండు ప్రైవేటు- పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతిలో ఈసారి కొత్తగా సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు గ్రేడింగ్ కూడా ఇచ్చారు. ఈ విధనంగా మార్కుల మెమోలు జారీ చేయనున్నారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడ్ పొందుపరిచారు విద్యార్థి పాసయ్యారా..? ఫెయిల్ అయ్యారా...? అనేది మాత్రమే ఫలితాలలో కనిపిస్తుంది. ఇంకా బోధనేతర కార్యక్రమాల (కో కరిక్యులర్ యాక్టివిటీ-స్)లో విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తారు. ప్రస్తుతం సిబిఎస్ఇలో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లను ముద్రిస్తున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ-స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రించారు.

# బంకర్‌లో దాక్కున్న ఉగ్రవాది హాఫీద్ సయీద్

## భారీగా భద్రత కల్పించిన పాక్ ప్రభుత్వం

**అమరావతి, (నినాదం):** భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్, ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కి పాకిస్తాన్ భారీ ఎత్తున భద్రత కల్పిస్తోంది. తన ఇంట్లోనే ఉన్న బంకర్లో అతను దాక్కున్నాడు. అతనికి ప్రభుత్వం కూడా భారీగా భద్రత కల్పించింది. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడింది లష్కరే ప్రాక్సీ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాదులే అని తేలింది. . పహల్గామ్ దాడి తర్వాత భారత టార్గెట్‌లో ఖచ్చితంగా హాఫీజ్ సయీద్ ఉన్నాడని తెలిసి పాకిస్తాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ అతడికి హై లెవల్ సెక్యూరిటీని కల్పించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ పంజాబ్ రాజధాని లాహోర్‌లోని జన సాంద్రత ఎక్కువగా ఉండే ఒక ఏరియాలో హాఫీజ్ సయీద్ నివసిస్తున్నాడు. సాధారణంగా, ఉగ్రవాదులు మారుమూల ప్రాంతాల్లో ఉంటారు. అయితే, హాఫీజ్ సయీద్ మాత్రం బిజీ ఏరియాలో నివసిస్తున్నాడు. అతడి నివాసంలో మసీదు, మదర్సా ఉన్నాయి. అతడి కోసం ఒక ప్రైవేట్ పార్కు కూడా ఉన్నట్లు- నిఘా వర్గాలు గుర్తించాయి. పాకిస్తాన్ ప్రభుత్వ భద్రతలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. హాఫీస్ సయీద్ ఉంటున్న భవనం కింద బంకర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు హాఫీజ్ సయీద్ జైలు ఉన్నాడని పాకిస్తాన్ బుకాయిస్తూ వస్తోంది. కానీ, అతను మాత్రం దర్జాగా అతడి నివాసం నుంచే ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. గత నెలలో, హాఫీజ్ సయీద్ సన్నిహితుడు అబూ ఖతల్ హత్య తర్వాత పాకిస్తాన్ హాఫీజ్ సయీద్‌కి భద్రతను కట్టు-దిట్టం చేసింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ఈ భద్రతను మరింత పెంచినట్లు- తెలుస్తోంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అతడి నివాసాన్నే సబ్ జైలుగా మార్చింది. సయీద్ బాహ్య ప్రాంతాలకు వెళ్లకుండా ఐఎస్ఐ అతడిని నిరోధిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

# కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు సమస్యలు రాకుండా చూడాలి

**కామారెడ్డి, (నినాదం):** ఎన్నో కష్టాలు పడి పంట పండించిన రైతుకు గిట్టుబాటు, మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మార్కెట్‌కు సరుకు తెచ్చే రైతుకు ఏలాంటి కష్టం కలుగకుండా చూడాలని, కొనుగోళ్లలో జాప్యం లేకుండా, హమాలీల సమస్య రాకుండా చూడాలని అన్నారు. రైతు నుంచి సరుకులు కొనుగోలు చేసిన 24గంటల్లో బస్తాలను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంటలకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. మార్కెట్ యార్డుకు వచ్చే ఏ ఒక్క రైతుకూ నష్టం వాటిల్లకుండా మద్దతు ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. తద్వారా రైతులకు ప్రభుత్వ మద్దతు, గిట్టుబాటు అందుతుందన్నారు.తేమ సాకుతో కొనుగోలు నిరాకరించవద్దని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు రైతులకు తప్పనిసరి తక్‌పట్టీలు ఇచ్చే విధంగా చూడాలని, ప్రతీ కొనుగోలు నిబంధనల ప్రకారం జరగకుంటే కమీషన్ ఏజెంట్లకు నోటీసులు ఇవ్వాలని అన్నారు.

# సింహాచలం ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**మృతులు కుటుంబాలకు సానుభూతి**

**2లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని మోడీ**


**ఘటన విచారకరమన్న కిషన్‌రెడ్డి, సిఎం రేవంత్**

**న్యూఢిల్లీ, (నినాదం):** సింహాచలం అప్పన్న చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన ఘటనపై రాష్ట్రపతి ద్రౌది ముర్ము,ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనుకోని ఘటనలో ఏడుగురు మృత్యువాత పడడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలుపుతూ వారికుంబాలకు సానుభూతి ప్రకటించారు.. ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోడీ రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు. సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలి.. పలువురు మృతిచెందిన ఘటనపై పార్లమెంట్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. పలువురు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికిగురిచేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేసినట్లు సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ఆయన పేర్కొన్నారు. సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన ఘటనలో పలువురు మృతి చెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన అక్షయతృతీయ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు రావడం, ఈ సందర్భంలో గోడ కూలి ప్రాణనష్టం జరగడం విచారకరమని అన్నారు. మృతుల కుటు-ంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదో దురదృష్టకర ఘటన అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢసానుభూతి తెలియచేశారు.

## వైభవంగా దేవినేని

# కుమారుడి వివాహం

**వధూవరులను ఆశీర్వదించిన రేవంత్**



**విజయవాడ, (నినాదం):** తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు- తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.

# యాదాద్రి జిల్లాలో పేలుడు ఘటన..

అలాగే, బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో శాశ్వత ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా కంపెనీ అంగీకరించింది.యాదాద్రి జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసరకును ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఘటన సమయంలో భవనంలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు ఉండగా.. ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్

అయితే, మీరెందుకు మరి ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం..? మీకు ఎక్కడిది మమ్మల్ని అడిగే హక్కు.. ప్రతిపక్ష హోదా నీకు ఎందుకు? ఫార్మ్ హౌస్ లో పడుకుని ఏం సందేశం ఇస్తున్నారు? అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. లేదంటే అసెంబ్లీకే రాను అంటే ఎట్లా? మేము ఇచ్చినవి అగినయి అంటున్నావు.. ఏమి అగినయని సీఎం ప్రశ్నించారు .మీరు సభకు రారు... కాబట్టి మేం ఏం చేస్తున్నామో ఎట్లా తెలుస్తుంది? మీరు ఏ మత్తులో జోగుతున్నారో తెలియదు.. విద్వేష పూరిత ప్రసంగం చేసి.. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని సీఎం రేవంత్ ఆగ్రహించారు. పదేళ్లు మేమే అధికారంలో ఉంటాము.. అదే పదేళ్లు ఫార్మ్ హౌస్ లోనే ఉంటావు.. తర్వాత నీ చరిత్ర ఫార్మ్ హౌస్ లోనే పరిసమాప్తం అంటూ ఎద్దేవా చేసారు. మీ కుటుంబం పదేళ్లు దోచుకోలేదా..? దేని మీద చర్చ చేద్దామో చెప్పు, సభ పెడదాం రా.. ప్రతిపక్ష నాయకుడిగా నిర్ణయాల్లో తప్పులు ఉంటే చెప్పండి సరిదిద్దుకుం టామని సీఎం మాట్లాడారు. అలాగే విషం చిమ్మే మాటలు వద్దు, ఆయన మాటల్లో, కండ్లల్లో విషం.. విచక్షణ ఉండాలి కదా... ఏం మాట్లాడుతున్నామో అని అన్నారు. మేము తెలంగాణ ఇస్తే.. పదేళ్లు దోచుకుని మమల్ని విలన్ అంటున్నావని ఫైర్ అయ్యారు. ప్రజలు అనాలి.. మీరు తెలంగాణ ఇస్తే... ఆయన ఆగం చేశారని మమ్మల్ని అనాలి, నువ్వు కాదని సీఎం అన్నారు.

# కులగణనపై తెలంగాణ మాట చెల్లింది

## కేంద్ర నిర్ణయంతో రాహుల్ విజన్ సాకారం.. కేంద్రానికి సిఎం రేవంత్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, (నినాదం):** కుల గణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్యాబినెట్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం నిర్ణయంతో రాహుల్ గాంధీ విజన్ సాకారం కాబోతోందని పేర్కొన్నారు. రాహుల్ విపక్షంలో ఉండి కూడా కేంద్ర విధానాన్ని ప్రభావితం చేశారు. దేశంలో కులగణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే. రాహుల్ విజన్‌తో రాష్ట్రంలో కులగనణ చేపట్టాం. కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాడింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోనూ ఆందోళన చేశారు. తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోందని మరోసారి రుజువైందని అన్నారు.కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయం పై తాజాగా స్పందించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా కులగలను చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని, భారత్ జోడో యాత్రలో చెప్పిన మాట ప్రకారం కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం అసెంబ్లీ తీర్మానం చేశామని, ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ గాంధీ విజన్ అమలులోకి వచ్చిందని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ నిర్ణయాన్ని దేశం అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందని, కులగణన చేయాలని కేంద్ర నిర్ణయించడానికి స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. ఈ విషయమై సీఎం ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జాతీయ జనగణన లో కుల గణన చేర్చడం తెలంగాణ ప్రభుత్వ విజయం అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల గణన రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిగి చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి పంపింది. కేంద్ర ప్రభుత్వం బీసీ లకు తెలంగాణ లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశామని పొన్నం తెలిపారు. కులగణన చేసి తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందని, ఇప్పుడే కేంద్ర ప్రభుత్వ జన గణన ద్వారా జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని ప్రకటించింది. ఇది తెలంగాణ ప్రభుత్వ, ప్రజల విజయమని ఆయన అన్నారు. 1931లో బ్రిటిష్ కాలంలో జాతీయ స్థాయిలో కుల గణన జరిగిందని.., ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయం సహకరించిన ముఖ్యమంత్రికి ,ఉప ముఖ్యమంత్రికి సహచర మంత్రులకు, పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయం ఆలస్యమైన చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలని, రాబోయే జనగణనలో కుల గణన చేస్తామని చెప్పడం బలహీన వర్గాల మంత్రిగా మీకు అభినందనలు కృతజ్ఞతలు అంటూ వ్యాఖ్యానించారు.

# కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు

అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ మంజూరు చేయండి
సానుకూలంగా స్పందించిన మన్సూక్ మాండవీయ
ప్రధానమంత్రి ఆమోదం అనంతరం ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని హామీ
కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్

**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం రోజున కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సూక్ మాండవీయకు మరో మారు విజప్తి చేశారు. దీంతోపాటు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని కోరారు. అట్లాగే శాతవాహన వర్శిటీలో ఖేలో ఇండియా కింద మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజప్తి చేశారు. న్యూఢిల్లీలో కొద్దిసేపటి క్రితం మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్ పై మూడు అంశాలకు సంబంధించి చర్చించారు. కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుపై గతంలోనే కేంద్ర కార్మిక మంత్రిని బండి సంజయ్ కలిసిన విషయం తెలిసిందే. ఈరోజు మరోసారి ఈ అంశంపై చర్చించారు. కరీంనగర్ లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ హబ్ గా మారిందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి అత్యధిక మంది



ప్రజలు వైద్యం కోసం కరీంనగర్ కు విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికులు, నేత కార్మికులుసహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంవల్ల తమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు. ప్రస్తుతం ఈ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది కార్మికులు వైద్య చికిత్సకు నోచుకోకుండా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని కోరారు. నిత్యం అంబేద్కర్ స్టేడియంకు వేలాది మంది వస్తుంటారని, వారి సౌకర్యార్థం సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని విజప్తి చేశారు. "ఖేలో ఇండియా" పథకం కింద కరీంనగర్ లోని శాతవాహన వర్శిటీలో రూ.16 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ హాల్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి పంపారని చెప్పారు. దీనిపై స్పందించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియ అధికారులు ఇటీవల శాతవాహన వర్శిటీని సందర్శించి మల్టీపర్పస్ హాలు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదికను రూపొందించి కేంద్రానికి పంపిన విషయాన్ని కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. బండి సంజయ్ విజప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ కరీంనగర్ లో ఈఎస్ఐ ఏర్పాటు ప్రతిపాదనలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపామని, ఆమోదం లభించిన వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, శాతవాహన వర్శిటీలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు అంశాలను త్వరితగతిన పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయ ఆదేశించారు.

# పుష్కర మహోత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మే నెలలో పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర క్షేత్రంలో నిర్వహించే పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన కాళేశ్వరంలో వివిఐపి ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం, వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదని అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు.



పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై విమర్శలు మానండి

# నిరుపయోగ ప్రాజెక్టుగా చిత్రీకరణ తగదు

## ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి



**నిజామాబాద్, (నినాదం):** తెలంగాణ అంటేనే ఒక గొప్ప చరిత్ర.. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యాక రాష్ట్రానికి మరో చరిత్ర సృష్టించిందని, కానీ కాంగ్రెస్ పాలకులు దీనిని విఫల ప్రాజెక్టుగా చూపాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కాళేశ్వరం ద్వారా మన సత్తా ఏమిటో కేసిఆర్ రుజువు చేశారని అన్నారు. రాష్ట్రంలో ఒక అద్భుతం కాళేశ్వరంతో సాక్షాత్కరించిందని, ఎండా కాలంలోనూ చెరువుల్లో నీటిని నింపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. రాష్ట్ర ప్రజలను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్న కేసిఆర్ ఆకాంక్షకు ప్రతిరూపంగా ప్రాజెక్టు నిర్మాణం సాగిందని అన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుతోనే 70 ఏళ్ల దరిద్రం వదలిందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఉత్తర తెలంగాణలో 37 లక్షల ఎకరాలకు సాగునీరు నిరంతరం అందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కడుతుంటే కాంగ్రెస్ వాళ్లు అప్పులు చేసి కట్టడం కూడా గొప్పేనా అంటూ హేళన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు నీటిని చూసి కళ్లు కుడుతున్నాయని అన్నారు. భవిష్యత్ తరాలు కేసీఆర్‌ను అపర భగీరథుడిగా చెప్పుకుంటాయని అన్నారు. అన్నారం, మేడిగడ్డ, కన్నెపల్లి, సుందిళ్ల ఈ మారుమూల గ్రామాలు నిన్నటి వరకు బాహ్య ప్రపంచానికి తెలియదని, ఈరోజు ఆ పల్లెల గురించి ప్రపంచం చెప్పుకుంటుందంటే ఆ గొప్పతనమంతా కేసీఆర్‌దే అన్నారు. 70 ఏళ్లుగా ఈ ప్రాంతాల మీదుగా గోదావరి జలాలు వృథాగా వెళ్లి సముద్ర గర్భంలో కలుస్తుంటే చూసుకుంటూ కూర్చున్న కాంగ్రెసోళ్లు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు కడితే.. విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఇప్పుడు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ప్రాంతాలు ఎలా ఉన్నాయో అంతకంటే ఎక్కువ రెట్టింపు కాళేశ్వరంతో రూపురేఖలు మారుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని కుల వృత్తులకూ ఆర్థిక వనరులను సమకూర్చాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే రూ. 5 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారన్నారు. ఎండాకాలంలో గొర్రెలు వాతావరణాన్ని తట్టుకునేలా ఈ దాణా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విమర్శకు పదను పెట్టిందని అన్నారు. కాళేశ్వరంపై విమర్శలు మాని ఆ నీటిని ఉపయోగించాలని అన్నారు. ఏవైనా రిపేర్లు ఉంటే చేయాలని అన్నారు. అంతేగాని దానిని నిరుపయోగం చేసి నీటి సమస్యకు కారణం కారాదని అన్నారు.

# అసెంబ్లీ సీట్ల పెంపు

## విబజన చట్టం ప్రకారం పెంచాలన్న పిటిషనర్

## విచారణ చేసి తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, (నినాదం):** తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది.డాక్టర్ పురుషోత్తమ్ రెడ్డి తన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సెక్షన్ 26ను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ విషయంపై గతంలో కూడా సుప్రీంకోర్టులో చర్చలు జరిగినప్పటికీ, తాజా విచారణ అంశం చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విస్తృతంగా వాదనలు చేసింది. పిటిషనర్ తరపున వాదిస్తూ, రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు-, తెలంగాణలో 119 సీట్లు- ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు విన్న ఎన్నికల సంఘం తమ స్థానాన్ని సమర్థించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం, 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని వారు వాదించారు. అంతకుముందు సీట్ల పెంపు కోసం రాజ్యాంగ సవరణ అవసరమని, ఇది సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

**నీడ లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు... మంత్రి శ్రీధర్‌బాబు**

నిలువ నీడ లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మహాదేవపూర్ మండలం ఎల్కేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇండ్లు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలోని పేదవర్గాలకు గౌరవ ప్రదమైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ద్వారా నివాస అవసరాలను తీర్చడమే కాకుండా మెరుగైన మౌలిక వసతులు కూడా కల్పించనున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో నాణ్యత, సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు

# సింగిల్ బెంచ్ ఉత్తర్వులు రద్దుచేయం

**టిజిపిఎస్సీ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ**

**హైదరాబాద్, (నినాదం):** తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపి వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. గ్రూప్ 1 వ్యవహారంపై టీజీపీఎస్సీ అప్పీల్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు సీజే ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ బెంచ్‌లో విచారణ దృష్ట్యా జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణను గురువారానికి వాయిదా వేసింది. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై ఇటీ-వల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు మాత్రం అవకాశం కల్పించింది. అయితే, ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ సీజే ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేసింది.

# ఎక్స్‌ప్లోజివ్ ఘటనలో కోటి పరిహారం

**కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న కంపెనీ**

**హైదరాబాద్, (నినాదం):** యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న జరిగిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. దీంతో మృతుల కుటుంబాలకు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అలాగే, బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో శాశ్వత ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా కంపెనీ అంగీకరించింది. యాదాద్రి జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసరకును ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఘటన సమయంలో భవనంలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు ఉండగా.. ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# సింహాచలం ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

భక్తులు భయపడాల్సిన అవసరం లేదని, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పెద్ద ఎత్తున సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయన్నారు. సింహాచలంలో గోడకూలిన ఘటన స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నామని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూ లైన్‌పై సిమెంట్ గోడ కూలిందన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖ సిబ్బంది నేతృత్వంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని హోం మంత్రి తెలిపారు.

## ట్రస్ట్ చైర్మన్ అర్జున్ సేవలు అభినందనీయం




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆయన పేరు మీద ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ అర్జున్ ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ అభినందించారు. బుధవారం చందానగర్ డివిజన్ అన్నపూర్ణ ఎన్ క్లా కమాన్ వద్ద స్వర్గీయ అలిగేరి వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అర్జున్ ఆధ్వర్యంలో తన తండ్రి వెంకటేష్ పుట్టినరోజును పురస్కరించుకొని బాటసారుల దప్పికను తీర్చడానికి, చలివేంద్రం, పేదవారికి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించి, చీరలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది చలివేంద్రాలు ఏర్పాటుతోపాటు, పేద ప్రజలకు బట్టలు పంపిణీ చేయడం అర్జున్ సేవకు నిదర్శనమని అన్నారు. వేసవిలో ప్రయాణికులు, ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ప్రయాణికులు ప్రజలు, వ్యాపారస్తులకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్లేష్, మల్లేష్ గౌడ్, విజయ్, అఖిల్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ గాయత్రి పాఠశాల విద్యార్థులు

**కొడంగల్, ఏప్రిల్ ,30 (నినాదం న్యూస్):** కొడంగల్ పట్టణంలోని శ్రీగాయత్రీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించింది. 100% ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించి విజయ దుందుబి మోగించారు. బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పదవ తరగతి విద్యార్థులు అస్మిత 546 /600మార్కులు సాధించి పాఠశాల టాపర్ గా నిలిచింది. కారుణ్య 530/600 మార్కులు, అవినాష్ 523/600, కార్తీక్ 514, మార్కులు సాధించారు. పాఠశాల లో 100% రిజల్ట్స్ తో కొడంగల్ లో ఉత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాము విద్యార్థులను అభినందించారు. తమ




పాఠశాలలో 100% ఉత్తీర్ణత రావడం హర్షనియమన్నారు. విద్యార్థుల కృషి వల్లే ఉత్తమ ఫలితాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ రంజిత, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, రమేష్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

## చేవెళ్లలో పదోతరగతి 85.55 ఉత్తీర్ణత శాతం

• ఎంఈఓ పురన్ దాస్





**చేవెళ్ల,ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో 85.55శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు ఎంఈఓ పురన్ దాస్ తెలిపారు. తెలుగు మాధ్యమంలో 105 మంది పరీక్షకు హాజరవగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆంగ్ల మాధ్యమంలో 395 మంది పరీక్ష రాయగా 313 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు గాను 86 మంది ఉత్తీర్ణత సాధించారు. 17 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. సంజన 553, దీక్షిత 546, సాహితీ 543 మహీన్ సుల్తానా 535, నిహారిక 533, సహస్ర 527, అల్లి నిహారిక 526, మద్దెల మనస్విని 501 మార్కులు సాధించారు. అంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వడ్డె వైష్ణవి 541 మార్కులు సాధించింది.

BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
PEBBAIR
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 31.07.2025 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Ground Floor, House No: 18-24,
Wanaparthy Road, Near Police station,
Pebbair (Village & Mandal),
Wanaparthy District, Telangana State,
Pin – 509104.
Phone No - 09188903102, 08138912475.
Email id - mgpeb3904@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".
మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

## పులిచింతల విద్యుత్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**హుజూర్ నగర్ (చింతలపాలెం), ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** చింతలపాలెం మండలం వజీనేపల్లి వద్ద ఉన్న పులించింతల విద్యుత్ తయారీ కేంద్రాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించారు.ఈ సందర్భంగా పులిచింతల పవర్ ప్లాంట్ ఎస్ ఈ జెశ్య నాయక్ కలెక్టర్ కి టర్బన్స్ ద్వారా విద్యుత్ తయారీ విధానం, విద్యుత్ సరఫరా విధానాన్ని క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎడి ఎస్ ఎల్ ఆర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపిడిఓ భూపాలరెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

Chola
Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్ : చోళ క్రెస్ట్, సి54 & సి55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై - 600 032, టి.ఎన్.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (అమ్మకము ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద జారీ చేయబడిన స్థిర సెక్యూర్డు ఆస్తుల అమ్మకపు ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా కాలమ్-(ఎ)లోని రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ చార్జ్ చేయబడిన కాలమ్-(సి)లో వివరించిన స్థిరాస్తి (ఆస్తులు)లను సెక్యూర్డ్ క్రెడిటార్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, హౌసింగ్ యొక్క అధీకృత అధికారిచే కాలమ్-(డి)లో వివరించిన విధముగా నిర్మాణాత్మకముగా స్వాధీనములోకి చేసుకోబడినవి, వాటిని దిగువ తెలిపిన వివరాల ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే" ప్రాతిపదికపై విక్రయించబడును.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) క్రింద కాలమ్-(ఎ)లో సూచించిన విధంగా రుణగ్రహీత/తనఖాదారులు/ సందర్భాన్ని బట్టి సంబంధిత రుణగ్రహీత/ తనఖాదారులు/ (మరణించినందున) యొక్క న్యాయవారసులు, న్యాయప్రతినిధులు (తెలిసిన లేదా తెలియనివారు), ఎగ్జిక్యూటర్(లు), అడ్మినిస్ట్రేటర్(లు), వారసుడు(లు) మరియు అస్సైని(లు)కు ఇందుమూలముగా పైన తెలిపిన విధంగా తెలియజేయడమైనది. అమ్మకము యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా https://www.cholamandalam.com & www.auctionfocus.inలో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయగలరు.

| [A] రుణ ఖాతా నెం./ రుణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(ల) పేర్లు | [B] రాబట్టుకోవలసిన మిగిలిన బకాయి మొత్తాలు (సెక్యూర్డ్ రుణాలు) | [C] స్థిరాస్తి/ సెక్యూర్డ్ ఆస్తి వివరణ | [D] స్వాధీనతా రకము | [E & F] రిజర్వు ధర (రూ.లలో) / బయానా (రూ.లలో) | [G] వేలం తేది & సమయం |
|---|---|---|---|---|---|
| రుణ ఖాతా నెం (లు): HL22HBD000084153 శ్రీ/శ్రీమతి మహ్మద్ ఆసిఫ్ శ్రీ/శ్రీమతి జరీనా బేగం ఇరువురి నివాసం: ఇ.నెం. 6-173, రామ్‌నగర్ కాలనీ, షాద్‌నగర్, చేతన్‌పల్లి ఫరూక్ నగర్ మండలం, చేతన్‌పల్లి రైల్వే గేట్, షాద్‌నగర్, తెలంగాణ - 509216 మరియు ప్లాట్ నెం. 111, సర్వే నెం. 692, గణేష్ నగర్ కాలనీ, రెసిడెన్షియల్, చేతన్‌పల్లి శివార్ గ్రామం, ఫరూక్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-509216. | తేది. 29.04.2025 నాటికి రూ. 37,86,578/- (రూపాయలు ముప్పై ఏడు లక్షల ఎనభై ఆరు వేల ఐదు వందల డెబ్బై ఎనిమిది మాత్రమే) | తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూక్‌నగర్ మండలం, షాద్‌నగర్ మున్సిపాలిటీ చేతన్‌పల్లి గ్రామం, గణేష్ కాలనీ వద్ద సర్వే నెంబర్ 692 లో 125.0 చ.గజాల విస్తీర్ణముతో ప్లాట్ నెంబర్ 111 లో ప్లింత్ ఏరియాతో కలిగి ఆర్‌సిసి స్లాబ్ తో గ్రౌండ్ ఫ్లోర్ లో గల గృహము యావదాస్తి. ప్లాట్ సరిహద్దులు ఉత్తరం: 110, దక్షిణం: 112, తూర్పు: 15 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెంబర్ 97. | [illegible] | రూ. 38,45,880/- (రూపాయలు ముప్పై ఎనిమిది లక్షల నలభై ఐదు వేల ఎనిమిది వందల ఎనభై మాత్రమే) / రూ. 3,84,588/- (రూపాయలు మూడు లక్షల నలభై ఐదు వేల ఐదు వందల ఎనభై ఎనిమిది మాత్రమే) | 19.05.2025న మ. 02.00 గం॥ల నుండి సా.04.00 గం॥ల వరకు (బిడ్డరు డాక్యుమెంటు నిబంధనల ప్రకారం ప్రతి 5 ని॥లకు ఒకసారి ఆటోమెటిక్ పొడిగింపులతో) |
| తనిఖీ తేది & సమయం : 15.05.2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు | | | కనీస బిడ్డు పెంపుదల మొత్తం: రూ. 10,000/- | | |
| పాల్గొనుటకు బిడ్/ బయానా/ అభ్యర్థన పత్రము దాఖలుకు ఆఖరి తేది: 16.05.2025న సా॥ 05.00 గం॥ల వరకు | | | | | |

* చెల్లింపు తేది మరియు/ లేదా అది వసూలు అయ్యే తేదీ వరకు లెక్కించే విధంగా రుణ ఒప్పందం నిబంధనల ప్రకారం వర్తించు విధంగా తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥గు॥నవి అదనము.
ఆస్తి తనిఖీకి సంబంధించి ఏదేని సహాయం కొరకు లేదా బిడ్డు డాక్యుమెంట్ పొందుటకు మరియు ఏవేని ఇతర విచారణల కొరకు శ్రీ మల్యాల రవికిరణ్ వారిని మొబైల్ నెం. 9550507572, శ్రీ విక్రమ్ రెడ్డి వారిని మొబైల్ నెం. 9291506151, ఇ-మెయిల్ ఐడి: ravikiranmg@chola.murugappa.com / శ్రీ మహ్మద్ అబ్దుల్ ఖవి, సంప్రదించు నెం.7305990872, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిని సంప్రదించవలెను. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి తెలిసినంత వరకు లేదా సమాచారం మేరకు పైన తెలిపిన స్థిరాస్తులు/ సెక్యూర్డ్ ఆస్తులపై తాకట్టు రుణ భారములు ఏమీ లేవు.

తేది : 29.04.2025
ప్రదేశం : రంగారెడ్డి, తెలంగాణ

సం/- అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు

• ఘనంగా సత్కరించిన రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్30(నినాదం న్యూస్):** రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ సిఏఆర్ అంబర్ పేట రిజర్వ్ ఇన్స్పెక్టర్ యండి గౌస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సాదిక్ అలీ, వాలంటరీ పదవి విరమణ పొందారు. వారితో పాటు ఉప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ మనోహర్ రావు, ఎల్ బి నగర్ ఎస్సై జంగయ్య, కుషాయిగూడ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఖాజా జహీర్‌ఉద్దీన్ లకు ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ పొందే అధికారులు మరియు సిబ్బంది సంక్షేమం కోసం తాను ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా త్వరగా పెన్షన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిసిపి అడ్మిన్ శ్రీమతి ఇందిర , అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివ కుమార్, ఎసిపి స్పెషల్ బ్రాంచ్ రవీందర్ రెడ్డి, సిఎ ఓ అకౌంట్స్ శుగుణ, అడ్మిన్ పుష్పరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సి హెచ్. భద్రా రెడ్డి, కృష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మీద జిల్లా రిజిష్టర్ కార్యాలయం



• ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
• మార్చాలని మంత్రులను కోరిన జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు

**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్30,(నినాదం న్యూస్):** మేడ్చల్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం హైవే రోడ్ పై ఉండడం వల్ల ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మంత్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గమేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ నాయకులు రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి వర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు వినతి పత్రం అందజేశారు. వారు తక్షణమే స్పందించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పోత్రూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడం సంతోషకరమణి మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్రికా సమావేశం నిర్వహించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్,మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారామణ,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పెంజర్ల స్వామి యాదవ్,కౌడే మహేష్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్,సింగరేణి పోచయ్య,మురళీ గౌడ్,సద్ది సుదర్శన్ రెడ్డి,గుండ శ్రీధర్ కురుమ,టైలర్ రాజు గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

## పదోతరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించిన నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు

**కొడంగల్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** 10వ తరగతి ఫలితాలలో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు మహీన్ ఫాతిమ 557 స్కూల్ టాపర్ మరియు టౌన్' సెకండ్ టాపర్ నిలిచింది. సాయి మరియు సాయిశ్రీ 547, 520, వి 520, బిందు 518, బిలాల్ 506, -అక్షిత 503, శరత్ 492, రివశంకర్ 490, స్కూల్ టాపర్ గా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డివి నరేష్ రాజ్ తెలిపారు.ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృంధం విద్యార్థుల కు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియజేశారు.పాఠశాల ఫౌండర్ డి. లక్ష్మీ, వెంకటయ్య మాట్లాడుతు విద్యార్థులు, ఉపాధ్యాయ బృందానికి విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



## పదిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు



**కోదాడ(అనంతగిరి),ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** విద్యార్థుల జీవితాల్లో తొలి అడుగు పదోతరగతి చాల కీలకపాత్ర వహిస్తుంది. మొదటి మెట్టే సరిగా పడితే భవిష్యత్లో శుభారంభం చేసినట్టే. ఇందుకు తగ్గట్లుగా శనివారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్కు దీటుగా పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి మన్నలు అందుకున్నారు. కోదాడ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 485 మంది గాను 441 మంది పాసయ్యారు. 90.9,3% ఉత్తీర్ణత సాధించారు. కోదాడ పీఎంశ్రీ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థిని రేఖ శ్రీ 571, కోదాడ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని పి వర్షిత 570 మార్కులు, కోదాడ మండలంలో మొదటి రెండవ స్థానంలో నిలిచారు. 571 మార్కులతో రేఖ శ్రీ ప్రభుత్వ పాఠశాల విభాగంలో సూర్యాపేట జిల్లా టాపర్ గా నిలిచింది. అనంతగిరి మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 249 మంది విద్యార్థులకు గాను 236 మంది పాసయ్యారు. 94.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. బిసి గురుకుల వెల్ఫేర్ పాఠశాలకు చెందిన సిహెచ్ శ్రావ్య 571, రోహిణి 561,శాంతినగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కావ్య 551, మార్కులు సాధించారు.

## పదవ తరగతిలో సత్తా చాటిన పినాకిల్ విద్యార్థులు






**నేరేడుచర్ల ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** తెలంగాణ లో విడుదలైన పదవతరగతి పరీక్ష ఫలితాల్లో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణానికి చెందిన పినాకిల్ పాఠశాల మణిదీపాలు విజయ దుందుభి మోగించారు. పొట్ట బత్తిని అంజన 570/600,దాసరి ప్రవీణ్ 561/600,కట్టబోయిన జశ్వంత్ 560/600 సాధించారు.42 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 28 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించారు.ఈ సందర్భంగా పినాకిల్ విద్యాసంస్థ అధినేత మదార్ మాట్లాడుతూ... మా పాఠశాలలో నిరంతరం పఠనం,లేఖనం ఉంటాయి.తెల్ల కాగితాలకు అనంత శక్తి నిచ్చే సృజనాత్మకత కలిగిన విద్యను అందిస్తామని అన్నారు.తొమ్మిది సంవత్సరాలుగా కలను మెలకువ లోనే కంటూ అక్షరాల్లో వెలిగిస్తూ వివిధ రంగాల్లో సామాజిక,కళా వెలుగు తారలై నిలుస్తున్నారు అని అన్నారు.సామాజిక ఆదర్శాలు, విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా ఈ ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు.

# బెంబేలిస్తున్న గ్రామ సింహాలు.. కనిపిస్తే అంతే సంగతులు


• గ్రామ సింహాలే ప్రజల పాలిట మృత్యుసింహాలు
• పట్టించుకోని అధికారులు
• ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు



**కోదాడ,(అనంతగిరి),ఏప్రిల్ 28(నినాదం న్యూస్):** గ్రామాన్ని రక్షించే గ్రామ సింహాలే ఇప్పుడు ప్రజల పాలిట మృత్యు సింహాలు గా మారుతున్నాయి విశ్వాసానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచే కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. అనంతగిరి మండల వ్యాప్తంగా 20 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామంలో సుమారు 50 పైగా వీధి కుక్కలు ఉన్నాయి గ్రామాలలో స్వేచ్ఛగా స్వైర విహారం చేస్తూ కనబడిన వారిపై దాడి చేస్తుండడంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా పోయింది. వీధికుక్కల దాడిలో రోజురోజుకు పెరుగుతూ ఉండడంతో చిన్న పిల్లలు ,పెద్దలు రోడ్డు వెంబడి నడవాలంటే జంకుతున్నారు.

**ఒకేరోజు రెండు మండలాలలో..**

ఒకే రోజు రెండు మండలాలలో కోదాడ అనంతగిరిలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఇంటి లోపల వరండాలో ఆడుకుంటున్న మూడు సంవత్సరాల బాలుడు పై కుక్క దాడి చేసికరిచింది. ఈ సంఘటన సోమవారం కోదాడ పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్ లో చోటు చేసుకుంది. ఖమ్మం క్రాస్ రోడ్ లో 18 వ వార్డులో నివాసముంటున్న కొండపల్లి రవి కుమారుడు కొండపల్లి వర్షిత్ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. అకస్మాత్తుగా గేటు కింద నుండి వచ్చిన కుక్క బాలుడు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో తల్లిదండ్రులలో హుటాహుటిన కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కొరకు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి చిన్నారులను తీసుకెళ్లారు. కుక్క అడుగు మందులు లేక నల్లగొండ ఏరియా హాస్పిటల్ కి చికిత్స చేయిస్తున్నారు. ఇదే కుక్క గణేష్ నగర్ తిలక్ నగర్ ఖమ్మం క్రాస్ రోడ్ లోని సుమారు 17 మందిపై ఒకేరోజు దాడి చేసినట్లుగా సమాచారం. కుక్కలు విపరీతంగా రోడ్లపై తిరుగుతున్న మున్సిపాలిటీ అధికారులు వాటినీ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇటీవల కుక్క దాడిలో రాష్ట్రవ్యాప్తంగా అనేక మరణాలు నమోదు అవుతున్నాయి. అయినా అధికారులు మొద్దు నిద్ర వేయడం లేదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.




**అనంతగిరి మండలంలో...**

అలాగే అనంతగిరి మండల పరిధిలోని త్రిపురారం గ్రామంలో బయట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు రాయబారపు క్రిష్, రాయబారపు తనుశ్రీ లపై కుక్కలు దాడి చేశాయి. వీరికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రి తరలించారు. కుక్క కాటుకు మందులు లేక నల్లగొండ ఏరియా చికిత్స పొందుతున్న చిన్నారులు. ఇంత జరుగుతున్న అటు మున్సిపల్ అధికారులు కానీ గ్రామపంచాయతీ సిబ్బంది గానీ. పట్టించుకున్న దాఖలాలు లేవు. స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ కర్రీ శివ సుబ్బారావు వార్డు సభ్యులు స్పందించి ఆ కుక్కను పట్టుకొని నిర్బంధించినట్లు తెలిపారు. మంగళవారం సైతం కూడా ఉదయం సమయంలో మరో ముగ్గురిపై కుక్క తీవ్రంగా గాయపరిచింది.గత ఏడాది అమీనాబాద్ గ్రామంలో పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వడ్డెర రామయ్య మనవడు సాయి పై పిచ్చి కుక్క తీవ్రంగా దాడి చేసింది. అదే గ్రామానికి చెందిన గోపతి సత్యం అనే రైతు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. సత్యం పై దాడిచేసి అతని నోరు పెదాలకు తీవ్రంగా గాయపరచడం తో హుటాహుటిన ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పట్లో ఈ దాడితో అమీనాబాద్ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఇప్పటికీ ఆ దాడి చేసిన దృశ్యాలు కళ్ల వెంబడి మెధులాడుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో కొలిచలం మణిచరణ్ అనే బాలుడిపై కుక్క దాడి చేయడంతో వారి కుటుంబం ఆస్పత్రిలో 20 వేల రూపాయలు ఖర్చు పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక మంది ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. అంతేకాకుండా ఖానాపురం గ్రామంలో కుక్కల దాడితో భయపడుతున్న ప్రజలు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ కి కార్యదర్శికి మొరపెట్టుకున్న ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇండ్లలో సాదుతున్న కుక్కలు, జాగ్రత్తలు ఎక్కడ?**

మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో మంది తమ ఇండ్లలో రక్షణ కోసం కుక్కలను పెంచుకుంటున్నారు. కానీ నీ కుక్కలను పెంచుతున్న క్రమంలో తప్పనిసరిగా సరైన పద్దతులు ఇంజెక్షన్లు చూపించాల్సి ఉండగా అవి ఏమీ పట్టకుండా వాటిని పెంచడంతో, రోడ్లపై నడిచే వారి పై దాడులు చేయడంతో చాలామంది గాయాలపాలు తున్నారు.

**భయపడుతున్న జనం...చిన్నారులు...**

కుక్కల స్వైర విహారం తో ప్రజలు ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జంకుతున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో వీధిదీపాలు సరిగ్గా లేకపోవడంతో గుంపులు గుంపులుగా కుక్కలు ఉన్నాయి. ప్రస్తుతం వేసవికాలం సెలవులు ఇవ్వడంతో చిన్నారులు అందరు ఇంటి వద్దనే ఉన్నారు. బయట ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడులకు తెగ పడుతున్నాయి.

**పట్టించుకోని అధికార యంత్రాంగం...**

కుక్కల సంఖ్య పెరగకుండా పి హెచ్ ఎస్ పరిధిలో జంతు సంతాన నిరోధక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. మరి కొంతమంది జంతు ప్రేమికులు కుక్కలను నియంత్రించడం నేరమంటూ, కోర్టులకు ఎక్కుతున్నారు. కానీ అవే కుక్కలు మనిషి ప్రాణాలు తీస్తున్నప్పుడు మరి ఏం చేయాలి అంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో కుక్కల బెడద నుండి రక్షించాలని ప్రజలు మొరపెట్టుకున్నారు.వీధి కుక్కలకు ఇది ఎండాకాలం సంకట సమయం. పట్టణాలు, నగరాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంటుంది. ఒకవైపు నీళ్లు దొరక్క మరోవైపు ఎండ వేడితో వీధి కుక్కలు అల్లాడిపోతుంటాయి. వాటి ప్రవర్తనలో మార్పులు చోటుచేసుకుంటుంటాయి. ఈ సమయంలో వాటి దగ్గరకు వెళ్లినా లేదా కవ్వించినా దాడి చేస్తుంటాయి అని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



# ఆయారే.. మేడే.. ఆయుధమై నేడే...



- చిందిన నెత్తుటికి139 ఏళ్లు
- పోరాటాల స్ఫూర్తి పతాక
- మే1న 'ప్రపంచ కార్మిక దినోత్సవం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** పెట్టుబడిదారీ వ్యవస్థపై కార్మికవర్గం తిరుగు బాటుతో సాధించిన విజయానికి నేటితో 139ఏళ్ళు నిండాయి. చికాగోలో చిందిన రక్తం కార్మిక వర్గాన్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. కార్మిక వర్గాల హక్కుల కోసం నినదించేలా చేసింది. 1886 మే1న చికాగో నగరంలో కార్మికులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ కార్మికులను ఏకం చేశారు. ఆనాటి నేటి ప్రపంచ వ్యాప్త ఉత్సవాలకు చిరునామా అయ్యాయి. చికాగో నగరంలో కార్మికుల హక్కుల కోసం శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సాగిన సమరంలో నేలకొరిగిన వారి రక్తంతో తడిసిన ఎర్రజెండా ప్రపంచ వ్యాప్తమైంది. ఆ ఎర్రజెండా వారసత్వమే మాన దేశంలో కమ్యూనిస్టు పోరాట జెండా అయింది.దేశంలోని కమ్యూనిస్టులు చీలికలు, పేలికలై చివరకు బ్యాలెట్, బుల్లెట్ మార్గాలుగా విడిపోయాయి. ఇక్కడి కమ్యూనిస్టులు మార్కిస్టు, లెనినిస్టు పంథాలో ఏర్పడిన గ్రూపులకు చికాగోలో పురుడుపోసుకున్న ఎర్ర జెండా అండగా నిలిచింది. నక్సల్బరి నుంచి శ్రీకాకుళం అక్కడి నుంచి జగిత్యాల వరకు రైతులు, కూలీలు తిరుగుబాటు చేసినా.. బొగ్గుగని కార్మికులు యాజమాన్యాన్ని ఎదిరించిన అందరికీ చికాగో ఎర్రజెండాయే స్ఫూర్తి. 1886 మే 1న చికాగో నగరంలో 18 గంటల శ్రమదోపిడిపై కార్మికులు తలపెట్టిన మహా పోరాటంలో పెట్టుబడిదారీ వ్యవస్థ దిగి వచ్చింది. ఆనాటి కాల్పుల్లో కార్మికులు మరికొందరిని సంఘ వ్యతిరేకులుగా చిత్రీకరించి ఉరి తీశారు. చెరసాలలు, ఉరికొయ్యలు కార్మికుల చైతన్యాన్ని అడ్డుకోలేవని నిరూపించిన పోరాట పథమే చికాగో తిరుగుబాటు. అయితే సాయుధ పోరాటం నడిపే మావోయిస్టు పార్టీ, ఎన్నికల పంథాలో పయనించే కమ్యూనిస్టులందరికి సుత్తి, కొడవలి గుర్తున్న ఎర్రజెండా గుండె ధైర్యానిస్తూ ముందుకు నడుపుతోంది. 133 ఏళ్ల క్రితం పుట్టిన ఎర్రజెండాకు ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గం జరుపుకుంటోంది. ఒక ప్రపంచవ్యాప్త సెలవు దినంగా ఆయా దేశాలు, ప్రభుత్వాలు ప్రకటించడం విశేషం. ఆనాటి నుంచి నేటి వరకు మే డే ఉత్సవాలు ప్రదర్శనలు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. 133ఏళ్లుగా హక్కుల కోసం నినదించిన శ్రమజీవులకు 'మేడే' అనగానే చేతి ఐదు వేళ్ళు ఒక్కటిగా మారి కార్మిక దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కార్మికలోకం సమాయత్తమైంది.

### శ్రామికులపై గర్జించిన తుపాకులు..!

ఉద్ధృతంగా వ్యాపిస్తున్న కార్మికుల పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, పెట్టుబడిదారులు శ్రామిక వర్గంపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. 'హే మార్కెట్' చౌక్లో కార్మికులు శాంతియుతంగా చేస్తున్న ప్రదర్శనలో బాంబు పేలిన కారణంగా చికాగో పోలీసులు కార్మికులపై విచక్షణా రహితంగా దహనకాండకు దిగారు. బాంబుపేలుడుతో సంబంధముందని రుజువుకాకపోయినా కార్మిక నాయకులైన ఆల్బర్ట్, ఆగస్ట్స్, ఎజెల్, ఫిషర్లకు1987 నవంబర్ 11న మరణశిక్ష విధించారు.

### మేడే విశేషాలు..!

- చికాగో మేడేను స్మరిస్తూ మనదేశంలో 1923 మే 1న మొదటి సారిగా కార్మిక దినోత్సవంగా సింగరవేణి శెట్టియార్ పాటించారు.
- 1924 వరకు దేశంలో 167 ట్రేడ్ యూనియన్ లు ఏర్పడ్డాయి. 1920లో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పడి 1938 కల్లా 188 సంఘాలతో 3,63,450 కార్మికులతో బలంగా ఏర్పడింది.
- కార్మిక సంఘం పెట్టుకునే హక్కు 1926 నాటి ట్రేడ్ యూనియన్ల చట్టం గుర్తించింది. 1970లో రూపొందించిన కాంట్రాక్ట్ లేబర్ చట్టం 1971 ఫిబ్రవరి 10 నుంచి అమలులోకి వచ్చింది. కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితులను క్రమబద్ధీకరించడం వారికి కనీస సదుపాయాలు కల్పించడమే దీని ఉద్దేశం.
- బీడీ కార్మికుల కోసం 1966లో పార్లమెంటు చట్టం చేసింది. మన రాష్ట్రంలో 1968 ఏప్రిల్ 1న ఆ చట్టం అమలులోకి వచ్చింది.

అనంతరం చోటు చేసుకున్న పరిణామాలు కార్మికులంతా 8గంటల పని పరిమితం చేయాలనే డిమాండ్తో ప్రతి దేశం, పట్టణం, కార్మిక వాడల్లో ఒకే రోజు ఒకేసారి ఖచ్చితమైన సమయంలో ఏటా అంతర్జాతీయ ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఆ మేరకు 1889లో రెండో అంతర్జాతీయ ప్రథమ మహాసభ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఆనాటి నుంచి నేటి వరకు ఈ మే డే ఉత్సవాలు ప్రదర్శనలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.



# కార్మికుల స్వేదానికి వెలకట్టని చట్టాలు!

మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. వారు లేనిదే పరిశ్రమలు లేవు..జీవనం లేదు.. అయినా ఏటా మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం చిత్తశుద్ధి కానరావడం లేదు. వారిని నేటికి బానిసలు గానే చూస్తున్న తీరు దారుణం. కార్మిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చట్టాలు పరిశ్రమల యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. కనీస వేతనాలు, అమలు కావడం లేదు. పనిదినాలు, పనిగంటలు అన్నవి లేకుండా పోతున్నాయి. దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్న కారణంగా, కార్మికసంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారింది.



కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టినా...నిత్యం వారికే అన్యాయం జరుగుతోంది. వారినే యాజమాన్యాలు చులకన చేస్తున్నాయి. ఏటా మేడేలు జరుపుకుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా కార్పోరేట్ రంగం విస్తరించిన తరవాత కార్మికుల జీవితాలకు, జీతాలకు విలువ లేకుండా పోయింది. ప్రధానంగా పనిదినాలు, పనిగంటలు అన్నవి మృగ్యం అయ్యాయి. నిబంధనల మేరకు అనే పద్దతి పోయింది. కంపెనీల నిబంధనల మేరకు పనిచేయాల్సి వస్తోంది.

కార్మికచట్టాలు అన్నీ చూడడానికి ఉన్నా, అమలు మాత్రం కావు. ఏవైనా ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు. ఇకపోతే శ్వేదం చిందిస్తూ మిద్దెలు,మేడెలు కడుతున్నా..వారికి కనీసం గూడు ఉండడం లేదు. వారి పిల్లలకు చదువుసంధ్యా దక్కడం లేదు. వ్యవసాయం నుంచి అన్నిరంగాల్లో వారి చెమట లేకుండా ఏ పనీ జరగడం లేదు. సర్వసంపదలు సృష్టించే శ్రామికవర్గం అన్నది గుర్తింపు లేకుండా పోయింది. శ్రమజీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు.కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగస్తున్నారు. ఉద్యోగాలు తొలగించినా... నోటీసులు ఇవ్వకున్నా కార్మిక సంక్షేమ శాఖ చూసీచూడనట్లుగా ఉంటోంది. ఇకపోతే మరీముఖ్యంగా ఆడవాళ్లు వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమపై అధికారులు వారిని సెక్స్ బానిసలుగా చూస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం దీని ఇంకా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే కార్మికుల పిల్లలకు విద్యా,ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారికి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్ధాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసేసి కార్మికలు నోట్లో మట్టికొడుతున్నా కార్మిక చట్టాలు పనిచేయడం లేదు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు. మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు.

కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్నాయి. యాజమాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్థకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్న యాజామన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే సాధ్యం అయ్యాయి. కానీ ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల మోచేతి నీళ్లు తాగుతూ..కార్మికులకు ద్రోహం చేస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న ఈ ప్రపంచం, అభివృద్ధి అంతా కూడా కార్మికుల శ్వేదం చిందిస్తేనే సాధ్యం అయ్యిందన్న విషయం మరచిపోతున్నాం. కార్మికవర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు. పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో కార్మికులను బానిసల వలే పని చేయించారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని వుండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురవుతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్థం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభ మైంది. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలడెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. 1886 చికాగో కార్మికుల పోరాటం,884 అక్టోబర్లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుండి 8 గంటల పని చట్టబద్ధమైన పనిదినంగా వుంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు. ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలని తీర్మానాన్ని రూపొందించింది. అప్పటి నుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపుకుంటోంది. ఆతరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. ఈ అనుభవాను గుర్తించినా రానురాను ఈ ఆధునిక యుగంలో కార్పోరేట్ కంపెనీలన్నీ ప్రభుత్వాలతో కుమ్మక్కయి కార్మికులను అణచి వేస్తున్నారు. ఈ క్రమంలో మరో కార్మికోద్యమానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మేల్కొని అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

# ఊరువదిలి..ఉపాధికోసం పరుగు

## పట్టణాల్లో భవన కార్మికులుగా జీవనం - హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో వెట్టిచాకిరీ



విజయనగరం జిల్లా పేరు చెప్పగానే కార్మికులు, వలసలు గుర్తుకు వస్తాయి. జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా వలస బాధితుల దయనీయ గాథలు వినిపిస్తారు. ఊరిలో పనిలేక ఉపాధి దొరక్క వలస పోతున్నారని, అక్కడ ఆరేడు మాసాలు మట్టి పనులు చేసి, కొద్దిగా డబ్బులు కూడబెట్టుకొని ఊరికి తిరిగి రావడం గ్రామంలో ఆనవాయితీ. ఉపాధిహామీ పథకం ద్వారా ఒక కుటుంబానికి ఏడాదికి కూడా కనీస వేతనం అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో రోజురోజుకీ వలసలు పెరుగుతున్నాయి. ఎక్కువమంది గ్రామంలో పనిదొరక్క వలస పోతున్నారని అనేక కుటుంబాల వారు చెబుతున్నారు. జిల్లాలో వలసల నివారణకు తగిన చర్యలు తీసుకోక పోవడంతో ఉపాధి కోసం అనేక కుటుంబాలు ఊరొదిలి వెళ్లారు. ఇల్లు గడవక అనేక కుటుంబాలు పొట్టచేత పట్టుకుని పట్టణాలకు వలస పోయాయి. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలను ఇళ్లకు కాపలా పెట్టి, ఉపాధి కోసం ఊరి వదిలిపోతున్న కుటుంబాలు కనిపిస్తాయి. ఉపాధిహామీ పథకం అమల్లో ఉన్నా తగిన ఆదరణ లేక జిల్లాకు వలసల బెడద పట్టుకుంది. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి పట్టణాల్లో పనుల కోసం వెళ్లి, అక్కడ భవన నిర్మాణ కార్మికులుగానో, ఇటుకల తయారీ బట్టీల్లోనో, ఇతర పనుల్లో కూలీలుగా పనిచేస్తున్నవారు అధికం. ఇలా జిల్లాలో ఏ మూలకు వెళ్లినా వలస బాధితులు తారసపడుతూనే ఉంటారు. వర్షపాతం బాగానే ఉన్నా, సాగునీటి ప్రాజెక్టులు లేక జిల్లాలో వ్యవసాయ పనులు రోజురోజుకు కనుమరుగవుతున్నాయి. మరోవైపు వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, పంట భూములన్నీ రియల్ఎస్టేట్గా మారిపోవడంతో వ్యవసాయాధారిత జిల్లాగా పేరొందిన విజయనగరం ప్రస్తుతం వలసల జిల్లాగా మారి పోయింది. దీనికి తోడు జిల్లాలో జ్యూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతబడి వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ నేపథ్యం లోనే జిల్లాలో గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బాడంగి, తెర్లాం మండలాల్లో అత్యధిక కుటుంబాలు ఏటా వలస పోతున్నాయి. ఏడాదిలో ఆరేడు నెలలు పనులు చేసి, నాలుగు రూపాయలు పోగేసుకుని సొంత ఊళ్లకు రావడం పరిపాటిగా మారింది. కొంతమంది అక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్క మైదాన ప్రాంతాలే కాదు. ఇటీవల ఉపాధి లేక ఏజెన్సీలోనూ వలసలు పెరిగాయి. డిగ్రీలు, పీజీలు చేసిన గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు లేకపోవడంతో పట్టణాలకు వలసపోయి హోటళ్లలో వెయిటర్లు గానూ, క్లీనింగ్ బారులగానూ పనులు చేసేవారు. కొన్నిసార్లు అక్కడ జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి కన్నవారికి అనాథలుగా మార్చేస్తున్న ఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితులు మారాల్సి ఉంది. స్వగ్రామంలోనే ఉపాధి దక్కేలా చూడాలని కోరకుంటున్నారు.

## ఎండల్లో ఉపాధి కార్మికులు అవస్థ...


### కూలీలకు కనీస సౌకర్యాలు సున్నా.. కూలీ గిట్టకున్నా తప్పని పని

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్లోనూ ఎండలు తారెత్తిస్తున్నాయి. వడగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. వేసవి తీవ్రత, వడగాల్పులతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇళ్లకే పరిమితమైన ప్రజలు ఇప్పుడు ఎండలతో ఇంటినుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ఉపాధి హామీ కార్మికులు ఎండలోనే పనులు చేస్తూ శ్రమను స్వేదంగా చిందిస్తున్నారు. వ్యవసాయ కార్మికుల వలసలను నివారించేందుకు వీలుగా ఈ ఏడాది వారికి కనీస పనిదినాలను కల్పించాలన్న లక్ష్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నా ప్రత్యేక వసతులేమీ కల్పించడం లేదు. కూలీల రక్షణ చర్యలు తగిన రీతిలో లేవు. ప్రధానంగా మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. ఎవరైనా ప్రమాదానికి గురైనా, వేసవి తీవ్రతకు పడిపోయినా ప్రథమ చికిత్స చేసేందుకు తగిన జాగ్రత్తల్లేవు. పంట కాల్వల పనులు ఎక్కువగా చేయిస్తున్నారు. మళ్లీ ఎండలో వెళ్లి ఎండలో పనులకు రావడం కష్టంగా ఉందని కూడా కూలీలు వాపోతున్నారు. అధికారులు ఇచ్చే కొలతల ప్రకారం పనులు చేయడం కష్టంగా ఉంది. పలుగులతో కాల్వలను తవ్వేందుకు ప్రయత్నించగా చాలా మంది మహిళా కూలీలు చేతులు బొబ్బలు ఎక్కుతున్నాయి. ఎండ తీవ్రతకు పలుగులు కూడా కాలిపోతున్నాయని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వీటిని పట్టుకుని తవ్వకాలు నిర్వహించలేకపోతున్నామని మహిళా కూలీలు వాపోతున్నారు. మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ అంతంత మాత్రంగానే ఉంది. తాగునీటిని కార్మికులు వారి ఇళ్ల నుంచే తీసుకువెళు తున్నారు. వేతనాలు ప్రతి రెండు వారాలకు ఒకసారి చెల్లించాల్సి ఉండగా ఆరేడు వారాలకు కూడా కొన్ని ప్రాంతాల్లో వేతనాలు రావడం లేదని కార్మికులు చెబుతున్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో విశ్రాంతి కోసం టెంట్లు వేయాలన్న నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వడదెబ్బ తగిలి ఉపాధి కూలి మృతి చెందినా కనీస సౌకర్యాల కల్పనలో జిల్లా యంత్రాంగం పట్టించు కోవడం లేదు. ఉపాధి కూలీల రక్షణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# సింగరేణి కార్మికుల శ్రమదోపిడీ

## కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుకు డిమాండ్

**కొత్తగూడెం, ఏప్రిల్ 30 :** మేడే అనగానే తెలంగాణలో సింగరేణి, ఆర్టీసీ కార్మికులే గుర్తుకు వస్తారు. అనేక సంస్థలు ఉన్నా ఈ రెండు సంస్థల్లో కార్మికులకు ఇంకా న్యాయం జగాల్సి ఉంది. శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి ఆ వ్యవస్థనే రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేసి వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలి. శ్రమదోపిడీకి గురవుతున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులను ఆదుకుని వారికి ఉద్యోగ భరోసా కల్పించాలి. కేంద్ర ప్రభుత్వంతో సమానంగా ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు కనుక కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయాల్సి ఉంది. ప్రధానంగా సింగరేణి కార్మికుల వల్లనే ఇవాళ బొగ్గు ఉత్పత్తి జరిగి విద్యుత్ రంగానికి కీలక భూమికను నిర్వహిస్తున్నారు. వీరు లేకుంటే థర్మల్ పవర్ లేదన్నది గుర్తించాలి. వృత్తిగతంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో ఆరోగ్య సమస్య అతి ప్రధానమైనది. బొగ్గుబావుల్లో దిగి తమ ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికి తీస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారి పోరాటం మరువలేనిది. ప్రపంచ కార్మిక



దినోత్సవం స్ఫూర్తితో కార్మికులు మరింతగా ఉత్పత్తి క్షేత్రంలో పనిచేసేలా ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. సింగరేణి యాజమాన్యం వేతన ఒప్పందాలను, కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మిక హక్కులను కాలరాస్తుందన్న విమర్శలు ఉన్నాయి. అలాంటివి లేకుండా ఆదాయ వనరుగా ఉన్న కార్మికులను ఆదుకోవాల్సి ఉంది. కోల్ బెల్ట్లో గెలిచిన ఎంపీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముందు నిలబడాలి. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది. సింగరేణిలో కొత్త బావులు విస్తరస్తామని, ఉపాధి పెంచుతామని, కార్మిక హక్కుల కాపాడుతామని ఇచ్చిన హామీలు అమలు కావాల్సి ఉంది.అలాగే వారసత్వ ఉద్యోగాలు ఇంకా అందని ద్రాక్షగా మిగిలింది. సింగరేణిలో పనిచేసి బయటకు వచ్చిన కార్మికులు మళ్లీ ఏ పనీ చేయలేని స్థాయిలో నిసత్తువ కలిగి ఉంటారు. వారిని ఉత్పాదక శక్తిగా గుర్తించి ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరించి ఆదుకోవాలి. కొత్త బొగ్గుబావుల విస్తరణతోనే



ఉద్యోగాలు సృష్టించ బడతాయి. అప్పుడే సింగరేణి మనుగడ కొనసాగుతుంది. కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టిసారించాలి. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఉత్పత్తి పెరుగుతుందని గుర్తించాలి. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పాలకులు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు కోరుకుంటున్నారు. కోల్ ఇండియా ఒప్పందాలను అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# వ్యసనం అనర్థ హేతువు



**తిరుమల, ఏప్రిల్ 30 :** సోమరిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. కష్టపడే తత్వం లేని వారిని దేవుడు కూడా ఆదుకోలేడు. ఎవరో వస్తారని ఏదో చేస్తాని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించు కొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసన పరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా చేయగలిగిందేమీ ఉండదు.

# అప్పన్న సన్నిధిలో అపశృతి

- గోడకూలి ఏడుగురు భక్తుల మృతి
- నిజరూప దర్శనం కోసం వచ్చి మృత్యువాత
- భారీ వర్షంతో తడిసిన గోడ కూలడంతో ప్రమాదం
- సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రులు
- మృతదేహాలు కెజిహెచ్‌కు తరలింపు
- క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స





**విశాఖపట్నం, ఏప్రిల్30:** సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో అపశృతి చోటుచేసుకుంది. రూ. 300 టికెట్ కౌంటర్ దగ్గర గాలి, వానకు గోడ కూలిపోయింది.ఈ ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. సంఘటన ప్రదేశానికి చేరుకున్న సహాయకసిబ్బంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించారు. వెంటనే మృతదేహాలను కేజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. సింహాచలం చందనోత్సవం వేళ భారీ వర్షం కురియడంతో గోడ కూలింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. ప్రసాదం స్కీం కింద అక్కడ గోడ నిర్మించారు. అక్కడ అభివృద్ధి పనులు చేస్తున్నారు. అందులో భాగంగా గోడ కట్టారు. ఆ గోడ పక్కనుంచే రూ. 3 వందల టిక్కెట్ లైన్ ఉంది. బుధవారం తెల్లవారుజాము 2:30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గోడ కూలింది. ఆ ప్రక్క నుంచి క్యూ లైన్ నుంచి వెళుతున్న భక్తులపై గోడ పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందినట్లు- సమాచారం. క్షతగాత్రుల తరలింపుకు 17 అంబులెన్సులు ఏర్పాటు చేశారు. సహాయక చర్యలు కొనసాగు తున్నాయి. వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శన మిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువ జామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రోటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిల్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందిన వారు. మృతుల వివరాలు.. ఇలా వున్నాయి. పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా, ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం, కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పు గోదావరి జిల్లా, గుజ్జరి మహాలక్ష్మి (65), హెబీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం, పిల్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం, పిల్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం.


## అందాల పోటీలను అంతా వ్యతిరేకించాలి

### స్త్రీ జన్మను అపవిత్రం చేయొద్దన్న నారాయణ

**తిరుపతి,ఏప్రిల్30:** హైదరాబాద్‌లోఅందాల పోటీలతో స్త్రీలను అవమానించరాదని, ఈ పోటీలను అందరూ వ్యతిరేకిం చాలని సీపీఐ కార్యదర్శి నారాయణ అన్నారు. పవిత్రమైన స్త్రీ జన్మను అపవిత్రం చేయొద్దని అన్నారు. తిరుపతి జిల్లా గూడూరులో మేన కోడలకు చెందిన కావేరి ఫుడ్ ప్రొడెక్ట్ షాపును నారాయణ ప్రారంభించి మాట్లాడారు. తన మేనకోడలు పావని అందాల పోటీలో పాల్గొంటే ఫస్ట్ వస్తుందని ఛలోక్తులు విసిరారు. కానీ అలా చేయడం తప్పని.. పవిత్రమైన స్త్రీ జన్మను అపవిత్రం చేయొద్దని కోరారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీలు నిర్వహించడం అత్యంత బాధాకరం అన్నారు. ఈ పోటీలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తన మేన కోడలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి పది మందికి సేవ చేయాలన్న సంకల్పంతో స్వయం ఉపాధిని ఎంచుకుందని గుర్తుచేశారు. పది మందికి జీవనాధారం కల్పించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అందాల పోటీ- అంటే ఏంటి? స్త్రీ జాతిని నడిరోడ్డులో పెట్టి వేలం వేయడం కాదా? ఇది పద్ధతి కాదు.. స్వయం శక్తితో బతికేందుకు స్త్రీలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరారు. అందాల పోటీలు నిర్వహించే రేవంత్‌రెడ్డికి బుద్ధిలేదన్నారు. రూ. 25కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పుకోవడం అత్యంత పవిత్రమైన స్త్రీ జాతిని అవమానించడమేనన్నారు.

## రాత్రి గస్తీల్లో డ్రోన్

### - పోలీసుల అదుపులో పది మందికి కౌన్సెలింగ్




**తిరుపతి:** ఇప్పటి వరకు రాత్రి గస్తీల కోసం కేవలం బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు మాత్రమే రోడ్లపై తిరిగేవారు. అన్ని వీధులు, సందులు, గొందుల్లోకి వెళ్ళడానికి వీరికి సాధ్యపడే పని కాకుండా పోయింది. ఈ క్రమంలో రాత్రి గస్తీకి డ్రోన్ వినియోగించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు భావించారు. దీనికిగాను అత్యంత శక్తిమంతమైన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా వినియోగించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి తిరుపతి, శివారు ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి రాత్రి పహారా కాశారు.

**అర్ధరాత్రి పోలీసుస్టేషన్‌లోకి చొరబడిన చిరుత..**

తద్వారా అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న అకతాయిలు, కొందరు మందుబాబులను గుర్తించారు. అలా 10 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా రాత్రి గస్తీల్లో డ్రోన్‌నూ భాగస్వామిని చేయనున్నారు. దీనికోసం తిరుపతినగరాన్ని మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో ఒక్కో రాత్రి డ్రోన్ నిఘా ఉంచుతారు. ఇది అరకిలోమీటరుకు పైగా నింగిలోకి వెళ్లి.. మూడు కిలోమీటర్ల వ్యవధిలో కవర్ చేస్తుంది.

## జనసేన పార్టీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 30:** తనతో ఉన్న కొంత మంది నాయకులు తాను చనిపోవాలని కోరుకుంటున్నారంటూ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ఎన్డీఏ ఎమ్మెల్యేని.. తాను చనిపోతే ఉప ఎన్నిక వస్తే కొంత మంది ఎమ్మెల్యే అయిపోవాలని చూస్తున్నారంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు త్యాగాల వల్ల తనకు ఎమ్మెల్యే సీటు రాలేదన్నారు.

మూడు పార్టీలు కలిసి తనకు మ్యాండేట్ ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. తాను గెలిచిన తర్వాత తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తున్నానన్నారు. అధికారులను ఇబ్బంది పెట్టి.. వారిని బెదిరిస్తే సహించేది లేదని వారిని కాపాడుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తాను చనిపోయిన తర్వాత మీరు ఎమ్మెల్యే అవ్వాలని కోరుకుంటున్నానన్నారు.తనకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మండేట్ ఇస్తే తాడేపల్లిగూడెం ప్రజల వల్ల ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. ఎవరి దయ దక్షిణ్యాల వలన తాను గెలవలేదని తెలిపారు. మరో పిఠాపురం చేసేస్తానంటున్నారని.. తానేమీ చేతికి గాజులు తొడుక్కోలేదన్నారు.తాను స్థలాలు, పొలాలు పూడ్చ లేదని.. కానీ తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల కోసం తాను పని చేస్తున్నానంటూ ఆయన కుండ బద్దలు కొట్టారు. తెలుగుదేశం పార్టీలో ఏ కార్యకర్తను తాను ఇబ్బంది పెట్టలేదన్నారు. కానీ శాసన సభ్యుడిగా మాత్రం గౌరవం ఇవ్వండంటూ కూటమిలోని మిత్ర పక్ష పార్టీ నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## సింహాచలం ఘటనపై పవన్ తదితరుల విచారం

### ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్న లోకేశ్



**అమరావతి,ఏప్రిల్30:** సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెందినట్లు- తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో జనసేన పార్టీ పోస్ట్ చేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించానని పవన్ పేర్కొన్నారు. సింహాచలం ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటు-ంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. సింహాచలం దుర్ఘటనపై భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్యూలైన్‌లో ఉన్న ఏడుగురు మృతిచెందడం బాధాకరమన్నారు. చందనోత్సవ సమయాన ఘటన జరగడం దురదృష్టకరమంటూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సింహాచలం ప్రమాదంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, సంధ్యారాణి, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వండి

- సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి
- ఘటనపై మంత్రులు ,అధికారులతో టెలికాన్ఫరెన్స్
- సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ప్రకటన
- ప్రమాదంపై విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ
- 78 గంటల్లో నివేదిక ఇవ్వాలని సిఎం ఆదేశం




**అమరావతి, (నినాదం):** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడినట్లు చెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించామన్నారు. సహాయకచర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి కేజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు పోలీసులు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మరోవైపు సింహాచలం ఘటన పై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ. 25లక్షలు, గాయపడిన వారికి రూ. 3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవస్థాన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయంపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆయన ఆదేశించారు. మరోవైపు గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ-లో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.


## క్షతగాత్రులకు మంత్రి అనిత పరామర్శ

### మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



**విశాఖపట్టణం,ఏప్రిల్30:** సింహాచలం అప్పన్న సన్నిధిలో గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఇక కేజీహెచ్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాలను హోంమంత్రి అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.కోటి పరిహారం ప్రకటించాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబాలు రూ.కో టి నష్టపరిహారం అడుగుతున్నారని తెలి పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చం ద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా జిల్లాల్లోని ఎమ్మెల్యేలమంతా బాధ్యత తీసు కుంటామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభు త్వం రూ. 25 లక్షల పరిహారం.. కుటుం బంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పిం దని తెలిపారు. అంతేకాకుండా పిల్లల్ని ప్రభు త్వపరంగా చదవిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబాలకు అప్పగిస్తామని తెలి పారు. గోడ కూలిన ఘటనలో రాష్ట్ర ప్రభు త్వం కమిటీ-వేసిందని.. 72 గంటల్లో నివే దిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అనిత హెచ్చరించారు.

## ఏపీసీసీ కార్యాలయం వద్ద హైటెన్షన్



**విజయవాడ, ఏప్రిల్ 30:** ఏపీసీసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏపీసీసీ కార్యాలయానికి బీజేపీ నేతలు దూసుకురావడంతో హైటెన్షన్ నెలకొంది. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాన మంత్రి మోదీపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. షర్మిల వ్యాఖ్యలు కమలం పార్టీ నేతలు తప్పుబట్టారు. ఈ క్రమంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బైఠాయించి ధర్నా చేస్తున్నట్లు తెలుసుకున్న బీజేపీ నేతలు అక్కడకు చేరుకున్నారు. కొంతమంది బీజేపీ నేతలు, కార్యకర్తలు ఏపీసీసీ కార్యాలయానికి చేరుకుని షర్మిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మోదీపై చేసిన వ్యాఖ్యలకు షర్మిల క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు నినాదాలు చేయడంతో కాంగ్రెస్ నేతలు నేతలు ప్రతినినాదాలు చేశారు. బీజేపీ , కాంగ్రెస్ పార్టీ నేతల పోటీపోటీ నినాదాలు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. తీవ్ర ఆగ్రహంతో ఉన్న బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయంపై కోడిగుడ్లతో దాడి చేశారు. పరిస్థితి అదుపు తప్పుతున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే వారిని అడ్డుకున్నారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు వర్గాలను కలువకుండా పోలీసులు అడ్డుపడ్డారు. కాంగ్రెస్ కార్యాలయంలోకి వెళ్లబోయిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## దేశం గర్వించేలా అమరావతి నిర్మాణం


- అత్యుత్తమ రాజధానిగా నిలిచేలా అమరావతి
- మోడీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలి
- పార్టీ శ్రేణులతో టెలి కాన్ఫరెన్స్‌లో బాబు

**అమరావతి,ఏప్రిల్30 :** రాష్ట్ర ప్రజలు గర్వంగా చెప్పుకొనేలా, దేశం గర్వించేలా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి నిర్మాణం కానుందని అన్నారు. ప్రధాని మోడీ సమక్షంలో 2న జరిగే అమరావతి పనుల పునఃప్రారంభానికి పెద్ద సంఖ్యలో తరలిరావాని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బూత్‌స్థాయి నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలతో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మే 2న అమరావతి పనుల పునః ప్రారంభానికి ప్రధాని మోదీ వస్తున్నారు. రూ.49,040 కోట్ల పనులకు ఆయన శంకుస్థాపనలు చేస్తారు. వీటితో పాటు- వర్చువల్ విధానం ద్వారా రాష్ట్రంలో డీఆర్‌డీవో, డీపీఐఐటీ, నాయ్, రైల్వే ప్రాజెక్టులకు మరో రూ.57,962 కోట్ల మేర శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయి. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల ప్రజలు, యువత ఆకాంక్షలు నెరవేర్చేలా రాజధాని నిర్మాణం ఉంటుందని అన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అమరావతి నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు.. రాజధాని స్వయం ఆధారిత ప్రాజెక్టు. వచ్చే మూడేళ్లలో అమరావతిలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత పాలకులు మూడు రాజధానుల ముసుగులో అమరావతిని నిర్వీర్యం చేశారు. రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించింది. ఆర్థిక కష్టాలు ఎన్ని ఉన్నా.. పది నెలల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యం పాటిస్తూ ముందుకు సాగుతాం. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తాం. అభివృద్ధి అమరావతికే పరిమితం కాదు.. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి జరుగుతుంది. విశాఖలో టీసీఎస్ రాకతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. భోగాపురం విమానాశ్రయాన్ని శరవేగంగా నిర్మిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్జీ కంపెనీ రూ.5వేల కోట్లు- పెట్టబడులు పెట్టనుంది. దేశంలో అత్యధిక పెట్టుబడులు మన రాష్ట్రానికే వస్తున్నాయని కూడా చంద్రబాబు నేతలకు తెలిపారు. సింహాచలంలో గోడకూలి ఏడుగురు భక్తులు చనిపోవడం పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి వెళ్దామనుకుంటే.. భక్తుల దర్శనాలకు అంతరాయం ఏర్పడు తుందనే అమరావతి నుంచి సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఉదయం నుంచి ఇతర కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని కేవలం ఈ ఘటనకు సంబంధించిన అంశాలను పర్యవేక్షిస్తున్నట్లు చంద్రబాబు నేతలతో అన్నారు. అలాగే, క్యాడర్‌ని నిర్లక్ష్యం చేయొద్దని పార్టీ నేతలకు సూచించారు. ప్రభుత్వానికి సంబంధించి ఏ కార్యక్రమం జరిగినా మూడు పార్టీల నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. వచ్చే నెలలోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు ప్రారంభించనున్నట్లు- సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కష్టపడే కార్యకర్తలను గుర్తించేందుకు నామినే-టెడ్ పదవులు భర్తీ చేసుకున్నామన్నారు. మహానాడు కడపలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఏ ఎన్నిక జరిగినా ఎన్డీయే గెలవాలని నేతలకు సూచించారు. సాక్షి మీడియాలో వస్తోన్న కథనాలపై సీఎం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైకాపా నేతలు చేసేవన్నీ తప్పులేనని.. ఆ పార్టీ చేసినన్ని తప్పులు మరెవరూ చేయలేదని మండిపడ్డారు. ఆ పత్రికలో ప్రచారం చేసినవన్నీ అసత్యాలేనని అసహనం వ్యక్తం చేశారు.య ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయడంలో పార్టీ క్యాడర్ కృషి చేయాలన్నారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి..

### ఆ రెండే కీలకమన్న మంత్రి

**అమరావతి, ఏప్రిల్ 30:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏపీలో పర్యటించనున్నారు. మే 2న అమరావతి పునర్నిర్మాణ పనులకు పీఎం శంకుస్థాపన చేయనున్నారు. రోడ్ షోతో పాటు బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన ప్రధాని బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లను ఈరోజు (బుధవారం) పురపాలక శాఖ మంత్రి నారా యణ , అధికారులు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రధాని పర్యటన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయన్నారు. ఈ సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లు పూర్తవుతాయని తెలిపారు.



రవాణా, పార్కింగ్ ఎంతో కీలకమని చెప్పుకొచ్చారు. వర్షం వస్తే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం చూడాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. 3000 బస్సులు, 1000 కార్లకు పార్కింగ్ ఏర్పాట్లు ముందుగా చేశారన్నారు. ఈ సభకు 5 లక్షల పైగా జనాభా వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌కు మరిన్ని ప్రాంతాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. 6500 - 7000 బస్సులు, 3000 కార్లకు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రోటోకాల్‌ప్రకారంఅందరికీఆహ్వానంపలుకు తున్నామన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్తున్నాయనిమంత్రినారాయణ పేర్కొన్నారు.

**సింహాచలం ఘటనపై సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా నోడల్ అఫిసర్ వీర పాండ్యన్ ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆహారం..మంచినీరు అన్ని బస్సు ల్లో అందిస్తామని తెలిపారు. సభా ప్రాంగణం లోకి వాటర్ బాటిల్ అనుమతించరని.. కేవలం సెల్ ఫోన్ ఒక్కటే అనుమతిస్తారని చెప్పారు. సభ జరిగే ప్రాంతంలో మంచి నీరు అందిస్తారని.. బాటిళ్లు తీసుకు రాకూడదని తెలిపారు. పార్కింగ్‌కు సంబంధించి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయని వీర పాండ్యన్ వెల్లడించారు.

కాగా.. ప్రధాని మోదీ అమరావతి సభకు వచ్చేవారి కోసం ఇప్పటికే అధికారులు రూట్ మ్యాప్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సభకు చేరుకునేందుకు ఆరు మార్గాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా- గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల నుంచి సభకు వచ్చేవారి కోసం 2400 బస్సుల ఏర్పాటు చేశారు. ఆరు చోట్ల ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కరకట్ట మీదగా సభా ప్రాంగణం వరకు వీఐపీ మార్గం కల్పించారు.వెస్ట్ బైపాస్ నుంచి కూడా సభా స్థలికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. సభకు హాజరయ్యే వారికి, వీఐపీల కోసం వేరువేరుగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వేధింపులు

### వారి సమస్యలు తీర్చాలి

**గుంటూరు,ఏప్రిల్30:** గ్రామ పంచాయతీల్లో అనేక ఏళ్ల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో రోడ్లు శుభ్రం చేయటం, మలినాలు తొలగించటం, మంచి నీటి సరఫరా, వీధి దీపాల రిపేర్లు తదితర విభాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న వర్కర్లను ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని యూనియన్ నాయకులు అన్నారు. ఏనాటికైనా తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ అవుతాయని ఆశగా ఉన్న వారికి ప్రతి ఏటా నిరాశే ఎదురవుతుందన్నారు. మేడే రోజు ఘనంగా ఉపన్యాసాలు ఇస్తున్న నాయకులు కార్మికులను మాత్రంపట్టించుకోవడం లేదన్నారు. పాలక పార్టీలు ఎన్నికల్లో రెగ్యులరైజ్ చేస్తామని వాగ్ధానం చేసి ఎన్నికల తర్వాత హామీలు గాలికొది లేస్తున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, కరెంటు బిల్లులు పెరుగుతున్నాయని, కానీ వర్కర్ల వేతనాలు మాత్రం పెరగట్లేదన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ పంచాయతీ కార్మికులకు అభద్రత లేకుండా చర్యలు తీసుకోవాలనిజిల్లాల కలెక్టర్లు, డిపిఓలకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకూ అవి ఆచరణ రూపం దాల్చలేదన్నారు. జిల్లాలో బకాయి వేతనాలు ఒకేసారి ఇవ్వట్లేద న్నారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని యోడల పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.

## అనంతపురంలో ఘరానా మోసం

- సిఐని అంటూ కిరాణా షాపు యజమానికి బెదరింపు
- సరుకులు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా ఉడాయింపు

**అనంతపురం,ఏప్రిల్30:** అనంతపురంలో కొత్తరకం మోసం వెలుగు చూసింది.. కారులో సీఐ సార్ ఉన్నారంటూ చెప్పి కిరాణా షాపులో దుండగులు సరుకులు ఎత్తుకెళ్లారు.. పోలీసునంటూ ఏకంగా కిరాణా దుకాణం యజమానిని బెదిరించాడు ఓ దొంగ. తాను టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐనంటూ.. తనకు సరుకులు ఇవ్వాలని కిరాణా దుకాణం యజమానిపై రెచ్చిపోయాడు. సుమారు రూ. 3 వేలు విలువ చేసే సరుకులను తీసుకొని డబ్బులు చెల్లించకుండా అక్కడ నుంచి ఉడయించాడు. ఈ సంఘటన అనంతపురం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు-చేసుకుంది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలలో నమోదు అయ్యాయి. అనంతపురం నగరంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. పాతూరులో రాత్రి 9 గంటల సమయంలో కిరాణా దుకాణానికి వచ్చిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తాను టూటౌన్ సీఐని అంటూ సరుకులు ఇవ్వాలని కిరాణా దుకాణం దారుడిని బెదిరించాడు. దుకాణదారుడు కళ్యాణ్ చేసేదేమీ లేక... ఏమి కావాలి సార్ అంటూ తాను అడిగిన సరుకులు అన్ని ఇచ్చేశాడు. సరుకులకు డబ్బులు ఇవ్వాలని కోరగా పోలీసులనే డబ్బులు అడుగుతావా ఇచ్చేది లేదు ఏమి చేసుకుంటావో చేసుకోపో... అంటూ సరుకులను మొత్తం కారులో తీసుకొని వెళ్ళిపోయాడు. దీనిని గమనించిన దుకాణదారుడు కారు నెంబరు తెలుసుకొని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారించిన పోలీసులు కనగానపల్లి మండలానికి చెందిన లక్ష్మీనారాయణగా గుర్తించి పట్టుకొచ్చారు. ఇతనిపై కర్ణాటక ఇతర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయినట్లు- విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ రాజేంద్రనాథ్ తెలిపారు.

## సమాజంలోని అసమానతలపై పోరాడిన మహానీయుడు మహాత్మా బసవేశ్వర



నాచారం, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) : వీరశైవుల ఆరాధ్య గురువు మహాత్మా బసవేశ్వర 892వ జయంతి పురస్కరించుకొని మీర్పేట్ - హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని మహాత్మా బసవేశ్వర విగ్రహం వద్ద కాప్రా వీరశైవులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్టాండింగ్ కమిటీ మెంబర్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అతిథులుగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 11వ శతాబ్దంలో సమాజంలోని అసమానతల పై పోరాడిన మహానీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షులు పేట జ్ఞానేశ్వర్, కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం, కోశాధికారి కత్తి శివానంద, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ళ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ లైబ్రరీ చైర్మన్



డోర్నకల్/మరిపెడ, ఏప్రిల్ 30(నినాదం న్యూస్): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్యతండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,జరుపుల కాలు నాయక్ బి పద్మావతి దంపతుల ద్వితీయ కుమార్తె సంగీత బి.నవీన్‌నాయక్ వివాహానికి వారి స్వగ్రామంలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,వారి వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామదుగు అచ్యుత్ రావు,గుగులోత్ వెంకన్న, నా రెడ్డి సుదర్శన్ రెడ్డి,దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శారద రవీందర్, వెంకన్న, హుస్సేన్, మక్షుద్,శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఎస్ రామకృష్ణారావుకు సన్మానం



వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్): తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ను బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. బుదవారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సుదీర్ఘకాలం విశేష సేవలందించిన రామకృష్ణారావు ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, తనకున్న అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి సలహాదారు బడేసాబ్, సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ గాలిగల్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అప్రమత్తంగా ఉండాలి

- ఏపీఎం లక్ష్మి



కోదాడ (అనంతగిరి),ఏప్రిల్ 30 (నినాదం న్యూస్): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మారుతున్న వాతావరణ దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మి అన్నారు బుధవారం అనంతగిరి మండల కేంద్రంలో ఐకెపి ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వర్షానికి ధాన్యం తడవకుండా తార్పల్లిన్ పట్టాలు అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వరి ధాన్యాన్ని నాణ్యతతో కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు ధాన్యం తేమ శాతం లేకుండా చూసుకోవాలని రైతులకు పలు సూచనలు అందించారు. ఆమె వెంట సీసీ యేసు, సుజాత, కరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



అల్వాల్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్): అల్వాల్ అంబేద్కర్ నగర్ కాలనీలో అణగారిన కులాలపౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ డివీఎంసీ మెంబర్ దళిత రత్న అవార్డు గ్రహీత శరణ్ గిరి, దుంపల అల్వాల్ డిప్యూటీ తాసిల్దార్ పృథ్వి , అల్వాల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేవతి, అల్వాల్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశం పాల్గొన్నారు

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి






- తెలంగాణ ఫోర్ విల్లర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు
- దాడిలో మరణించిన వారికి నివాళులర్పిస్తూ ఈసిఐఎల్ చౌరస్తాలో కొవొత్తుల ప్రదర్శన

మేడ్చల్ మల్కాజిగిరి,ఏప్రిల్30,(నినాదం న్యూస్): కాశ్మీర్ ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. మంగళ వారం రాత్రి కుషాయిగూడ ఈసీఐఎల్ చౌరస్తాలో ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ కొవొత్తుల ప్రదర్శన చేశారు. అసోసియేషన్ అధ్యక్ష్యుడు పసుల వెంకటేష్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరిపిత ఉగ్రవాదం పై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన దేశ ప్రజలకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ రియాజ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ బాబు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి రంగ శ్రీనివాస్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ దొంతుల బాలరాజు, సభ్యులు యాదయ్య, అచ్చుత రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి అవాంతరాలు లేకుండ యాసంగి కొనుగోళ్లు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు దిశ నిర్దేశాలు చేసిన మంత్రులు




మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్30,(నినాదం న్యూస్): యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఎర్రమంజిల్ కాలనీ పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యాలయంనుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్గదర్శకం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖా రూపొందించిన విధి విధానాలను విస్తరిస్తున్న పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ ధాన్యం కొనుగోళ్లు సునిశితమైన అంశం, ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎటువంటి అవాంతరాలు కలుగ కుండా చూసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రానున్న 15-20 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉదృతంగా ఉంటాయి, ఈ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గోడౌన్ లు అందుబాటులో లేని చోట అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాలి అన్నారు. 54.89 లక్షల ఎకరాల్లో రబీ సాగు 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా 70.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు అందుబాటులో సరిపడా గన్నీ బ్యాగులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామన్నారు. 2021-22 ను పోల్చి చూస్తే ఈ రబీ సీజన్ లో అదనంగా 1,772 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్నాలకు సత్వరమే బోనస్ చెల్లింపులు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమచేయాలని మంత్రి తెలిపారు. ఈ కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, సిపిఓ శేఖర్, పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాలలో టి వి ఆర్ విద్యాసంస్థల విద్యార్థుల విజయదుందుబి






- బి సింధు ప్రశాంతి 586, సిహెచ్ తనుశ్రీ 585 మార్కులతో ర్యాంకులు సొంతం




కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో టి వి ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ లోని మా టివిఆర్ మోడల్ హై స్కూల్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలను సొంతం చేసుకోవడంతో పలువురు విద్యాభిమానులు పాఠశాల యాజమాన్యం అధ్యాపకుల పనితీరును అభినందించారు. టివిఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు విద్యాబోధనలో అధునాతన మెలకువలతో బోధించడం వల్లనే అద్భుత ఫలితాలు సొంతం చేసుకోగలిగారని పలువురు ప్రశంసిస్తున్నారు. టి విఆర్ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులను పాఠ్యాంశాలలోని బోధనను అందించడంతోపాటు అన్ని పోటీ పరీక్షలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచే విధంగా పాఠశాల అధ్యాపక బృందం ఎంతో నేర్పుతో బోధిస్తుండడం ఈ విద్యాసంస్థల ప్రత్యేకతగా పలువురు పేర్కొన్నారు. అపురూప కాలనీలోని టీవిఆర్ విద్యా సంస్థ 10వ తరగతి విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాల సాధనతో పాఠశాల యాజమాన్యంతో పాటు పాఠ్యాంశాలను బోధించిన జ్ఞాపక బృందం పాఠశాల ఆవరణలో టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2025 మార్చి నెలలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షలకు తమ పాఠశాల నుంచి 154 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100% విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించుటకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. వార్షిక పరీక్షలకు హాజరైన 154 మంది విద్యార్థులలో 500కు పైగా 67 మంది విద్యార్థిని విద్యార్థులు మార్కులు సాధించి విజయకేతనం ఎగరవేశారన్నారు. ఈ ఫలితాలలో 1.బి సింధు ప్రశాంతి 600 మార్కులకు గాను 586 సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని, .సిహెచ్ తనుశ్రీ 585 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలువగా, మురళీధర్ 584 మార్కులతో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారన్నారు.ఎస్ మని దీపిక 582 సాధించి నాలుగో స్థానంలో నిలువగా, సిహెచ్ జాహ్నవి రెడ్డి, ఎన్ తేజ వంతులు 581 మార్కుల చొప్పున సాధించి ఐదవ స్థానంలో నిలిచారని వంశీ రెడ్డి వివరించారు. పరీక్షలు రాసిన 151 మంది విద్యార్థులలో 61 మంది విద్యార్థిని విద్యార్థులు 500 నుండి 579 మార్కులు సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ విద్యాబోధన అందించి అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాబోయే కాలంలో మరింత అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ముందస్తు ప్రణాళికలతో విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి వివరించారు. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి, కొరస్పాండెంట్ అరుణకుమారి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి లు 100% ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ అభినందించి ఆశీర్వదించారు. తమ పాఠశాల విద్యార్థులను అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుటకు సహకరించిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## ప్రయివేటు జోలికొస్తే ప్రభుత్వ అధికారులైనా ఊరుకోను

- 'ఖని'ప్రైవేటు వైద్యులంతా మంచివారు
- అతితక్కువ ఫీజుతో వైద్యమందిస్తున్నారు
- తనిఖీల పేరుతో వేదింపులు సరికాదు



గోదావరిఖని,ఏప్రిల్ 30(నినాదం): ప్రయివేటు ఆసుపత్రుల జోలికొస్తే ప్రభుత్వ అధికారులైనా ఊరుకోనని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు.స్థానిక ఓ ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యం,డిఎంహెచ్ ఓ మధ్య ఏర్పడ్డ వివాదం నేపథ్యంలో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ప్రయివేటు ఆసుపత్రుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోందన్నారు. ఆసుపత్రుల మీద దాడులు,అధికారుల తనిఖీలే దీనికి కారణమన్నారు. ఇటీవల స్థానికంగా జరిగిన ఘటన విధినిర్వహణలా కాకుండా సదరు ఆసుపత్రిపై కక్షసాధింపులా ఉందన్నారు.ఇకపై ప్రయివేటు ఆసుపత్రులకు తన పూర్తిసహకారముంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో స్థానిక ఐఎంఏ అధ్యక్షులు క్యాస శ్రీనివాస్,మాజీ మేయర్,డా బంగి అనిల్ కుమార్,నాగిరెడ్డి,లక్ష్మీవాణి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



మహేశ్వరం, ఏప్రిల్ 30(నినాదం న్యూస్): కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం గోర్ల కుంట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు వాంకుడావాత్ రక్కి హన్మ నాయక్ కుమారుడు సంతోష్ నాయక్ స్నేహతో వివాహం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి పై గల డీఎంకే ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా వివాహం నిర్వహించారు. వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధారావత్ రవీందర్ నాయక్, భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల జంగయ్య, భాస్కర్ రెడ్డి, వెంకటేష్, ఆసిఫ్ అలీ, మార్కెట్ కమిటీ నరేష్ నాయక్, పార్టీ అధ్యక్షులు భీఢ్య నాయక్, చందోజి, రామావత్ లక్ష్మణ్ నాయక్, హైకోర్టు అడ్వకేట్ నరేష్ , తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బి. డేవిడ్, సీనియర్ నాయకులు మొబైల్ పైలెట్ నాగేష్ నాయక్, భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్, పార్టీ సీనియర్ నాయకులు ఈ వేడుకల్లో .పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని వారి బంధువులు కుటుంబ సభ్యులు మిత్రులతో హాజరై నూతన వధూవరులను ఆశ్వీరదించారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- పోస్టర్ విడుదలలో రమేష్ బాబు, కృష్ణంరాజు



కొడంగల్, ఏప్రిల్, 30 (నినాదం న్యూస్): బొంరాస్ పేట్ మండలం లోని ఏర్పుమళ్ళ గ్రామంలో మే 4వ తేదీన జరిగే డా"బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ అధికసంఖ్యలో తరలిరావాలనీ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేష్ బాబు,యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు లు అన్నారు. ఈసందర్భంగా కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో సర్కిల్ ఇనిస్పెక్టర్ శ్రీధర్ రెడ్డి చేతుల మీద పోస్టర్ విడుదల చేశారు. ఈకార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం నాయకులు అంజిలప్ప, కవి రచయిత మాసాని వెంకటయ్య,ఈశ్వర్, ఇస్వప్ప, గోపాల్, విశ్వనాథం పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మళ్ళిఖార్జున్



కొడంగల్ ఏప్రిల్ 30 (నినాదం న్యూస్): కొడంగల్ నియోజకవర్గం లో మేడి చెట్టు తండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడబండ తండకు చెందిన బాలునాయక్ కి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మళ్ళికార్జున్ అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి ఆదేశాలతో బాలు నాయక్ కి రూపాయలు 50000 రూపాయల చెక్కు ను అందజేసినట్లు ఆయన తెలిపారు.సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఆసరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు నాయక్,కావలి రాములు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిర్విరామంగా అందించిన సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు

**-18 మంది ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన ప్రస్థానం కార్యక్రమంలో కలెక్టర్**




**ఖమ్మం, ఏప్రిల్30( నినాదం న్యూస్):** దశాబ్దాల కాలంగా ప్రజలకు నిర్విరామంగా వివిధ దశలలో సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లో ఏప్రిల్ నెలలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవి విరమణ పొందుతున్న 18 మంది ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ప్రస్థానం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఏప్రిల్ నెలలో ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా పని చేస్తున్న డాక్టర్ జి. పద్మావతి, ఎస్.ఆర్. అండ్ బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ లో సీనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న కే. దమయంతి, ఈఈ ఆర్అండ్బీ సత్తుపల్లి కార్యాలయంలో అసిస్టెంట్ టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న జి. వేంకటేశ్వర్ రావు, వైద్యారోగ్య శాఖలో మంచుకొండ పిహెచ్సి నందు ల్యాబ్ టెక్నికల్ గ్రేడ్ 2 అధికారిగా పనిచేస్తున్న మహమ్మద్ ఖాజా మునీరుద్దిన్, పెద్దగోపతి పిహెచ్సి నందు ఎంపిహెచ్ఎస్గా పనిచేస్తున్న పారుపల్లి సుజాత, వైరా ఏరియా ఆసుపత్రి నందు జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఏ. శ్యామ్ లాల్, ఖమ్మం జిల్లా ఆసుపత్రి నందు నర్సింగ్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్న ఎన్. అంతోనమ్మ, పంచాయతీరాజ్ శాఖలో ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ నందు సేవక్ గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ గని, ముదిగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఓఎస్గా పనిచేస్తున్న మహమ్మద్ యూసఫ్, ఎన్కూరు ఎంపీడీవోగా పని చేస్తున్న ఎస్.రమేష్ , మధిర ఎంపీపీ కార్యాలయంలో స్వీపర్గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, సత్తుపల్లి తహసిల్దార్గా పని చేస్తున్న యోగేశ్వర రావు, ఎస్సీ అభివృద్ధి శాఖలోని సత్తుపల్లి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిగా పని చేస్తున్న పి. లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ. సోమశేఖర శర్మ, గిరిజన శాఖలో ఉసిరికాయలపల్లి ఏహెచ్ఎస్ లో ఎస్ఏ పనిచేస్తున్న ఎస్. నాగేశ్వర్ రావు, తిరుమలాయపాలెంలో కుక్ గా పని చేస్తున్న బానోత్ బాబి, పశుసంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్ గా పని చేస్తున్న డాక్టర్ కే.వెంకట నారాయణ, సంక్షేమ శాఖలో సత్తుపల్లి సిడిపిఓగా పనిచేస్తున్న కనకదుర్గ పదవి విరమణ పొందుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల ప్రస్థానం వివరాలను ఆరా తీశారు. ఉద్యోగం రాక ముందు ఏం చేశారు, ఉద్యోగం ఎలా వచ్చింది? ఎక్కడెక్కడ చేశారు, విధి నిర్వహణలో సాధించిన ఘనతలు, మంచి జ్ఞాపకాలు, కుటుంబ నేపథ్యం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియ జేశారు. పదవి విరమణ పొందుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో మంచి మార్పు తీసుకుని వచ్చారని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేశారని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో ప్రతి పిల్లవాడికినాణ్యమైన విద్య, భోజనం, అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పిల్లల తల్లి దండ్రులకు జవాబుదారీతనంతో ఉంటూ విప్లవాత్మకమైన మార్పు ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకొని వచ్చేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ బాగా పని చేశారని కలెక్టర్ ప్రశంసించారు.

నేడు పదవి విరమణ పొందుతున్న ప్రతి ఉద్యోగి గత 25 నుంచి 30 సంవత్సరాలుగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవలు అందించారని, నిర్విరామంగా పని చేసిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రతి ఉద్యోగికి పదవి విరమణ లభిస్తుందని, ప్రస్తుతం పరిపాలనలో మనకు గట్టి పునాది ఉందంటే, మన పూర్వీకులు చేసిన కష్ట ఫలితమని అన్నారు. ప్రతి నెలా పదవి విరమణ పొందే సిబ్బందికి మన జిల్లాలో ఘనంగా వీడ్కోలు పలకడంతో పాటు వారి అనుభవాలను ముందు తరాల సిబ్బందికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.పదవి విరమణ పొందుతున్న లిడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యాక్టర్ జి. పద్మావతి మాట్లాడుతూ ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలోనే చదువుకొని అదే కళాశాలకు ప్రిన్సిపాల్ గా పదవి విరమణ పొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్గా తనకు జిల్లా కలెక్టర్లు సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. పదవి విరమణ పొందిన తర్వాత కూడా కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని అన్నారు. పదవి విరమణ పొందుతున్న లిజిల్లా విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సోమశేఖర శర్మ మాట్లాడుతూ, సాధారణ ఉపాధ్యాయుని గా తన కెరియర్ ప్రారంభించానని, జూనియర్, సీనియర్ లెక్చరర్గా చేసి, జిల్లా విద్యా శాఖ అధికారిగా పనిచేశానన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పని చేయడం జరిగిందని, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు, డిప్యూటేషన్ వంటివి పకడ్బందీగా చేపట్టామని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో విద్యా శాఖలో అనేక మంచి కార్యక్రమాలు తీసుకున్నామని, పేద విద్యార్థులకు ఆంగ్ల భాష పరిజ్ఞానం అందేలా ప్రత్యేక ల్యాబ్స్ ఏర్పాటు, నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు కిచెన్ గార్డెన్స్ల పెంపుదల, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచేందుకు జిల్లా అధికారులచే తనిఖీ చేయడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పదవి విరమణ తర్వాత విద్యా శాఖకు అవసరమైనప్పుడు తన సహకారం అందజేస్తానని తెలిపారు.పదవి విరమణ పొందుతున్న సత్తుపల్లి తహసిల్దార్ యోగేశ్వర్ రావు మాట్లాడుతూ 1987లో మొదటిసారి ఉద్యోగంలో జాయిన్ అయ్యానని, 2008లో రివార్డు తీసుకున్నానని అన్నారు. పదవి విరమణ పొందుతున్న వైరా ఆసుపత్రి జూనియర్ అసిస్టెంట్ ఏ.శ్యామ్ లాల్ మాట్లాడుతూ, 1981లో ఉద్యోగంలో చేరానని, 45 సంవత్సరాల సర్వీస్ చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చాలా కష్ట పడేవారని, ఆ రోజులలో ప్రభుత్వ వైద్యం మాత్రమే అందుబాటులో ఉండేదని, అధికంగాకేసులు వచ్చినప్పటికీ విసుగు చెందకుండా మంచి సేవలు అందించే వారని, వారితో కలిసి పని చేయడం సంతోషంగా ఉందని అన్నారు. డిసిహెచ్ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సజావుగా పనులు జరిగాయని, ఉద్యోగు లను ప్రోత్సహిస్తూ చేసే పనికి ఎప్పటి కప్పుడు ప్రశంసిస్తూ ఉత్సాహంగా పనిచేసేలా చేశారని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ పదవి విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిడి సోషల్ వెల్ఫేర్ కె. సత్యనారాయణ, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ, సీనియర్ అసిస్టెంట్ వెంకన్న, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి

**సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి**



**కోదాడ (అనంతగిరి),ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** మేడే ను విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతు ... మండల పరిధిలో ని శాంతినగర్ గ్రామం నుండి అనంతగిరి మండల కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో దేశంలోని ప్రజల మధ్య కులాల, మతాల పేరుతో విభజించి మత విద్వేషాలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో చదువుకున్నా విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడి కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారన్నారని,ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ నిరుద్యోగుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు నిర్వహించి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోట్లుగా విభజించి కార్మికులకు నష్టం చేకూరే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి మున్సిపాలిటీ,పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐఐ సౌకర్యం కల్పించి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మే 1న జరిగే మేడేలో కార్మికులందరూ పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

## ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి : కలెక్టర్, ఇలా త్రిపాఠి




**చింతపల్లి, ఏప్రిల్ 30(నినాదం న్యూస్ ) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం తో పాటు మండలంలోని తీదేడు గ్రామంలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని, గోదాములను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రతిరోజు దాన్యం తేమ శాతాన్ని పరిశీలించి నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం యొక్క వివరాలను మిల్లర్లు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం మిల్లర్లు మే నెల వరకు చెల్లించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందన్నారు..సహకార సంఘం అధికారులు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు విషయం లో జాప్యం చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జల్దా హరీష్,తాసిల్దార్ రమా కాంత్ శర్మ, ఏ డి ఏ శ్రీలక్ష్మి, ఎంపీడీవో సుజాత,మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి, సీఈఓ రాజశేఖర్ రెడ్డి ఏఈఓ మౌనిక, గ్రామ కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు పోరాట ఫలితమే అంగన్వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవుల నిర్ణయం

**రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు**

**సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ**



**డోర్నకల్/మరిపెడ ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** ఐసిడిఎస్ డైరెక్టర్ ఆఫీసులో డైరెక్టర్ కాంతివేస్లీ సంబంధిత అధికారులు అంగన్వాడీ యూనియన్లతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు యూనియన్ నుండి రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క పాల్గొన్నారు.ఈ సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ఇస్తున్నామని తెలియజేశారు.ఇతర సేవలు అందించటం కోసం అంగన్వాడి ఉద్యోగులందరూ కృషి చేయాలని అన్నారు. ఈ నిర్ణయం వెలువడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి సిఐటియు తరపున కృతజ్ఞతలు తెలియజేశాము.సిఐటియు సంఘం ఆధ్వర్యంలో మే నెలంతా సెలవులు ఇవ్వాలని నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించాము.మార్చ్ 4 న ప్రజావాణి ముట్టడి చేశాము.మార్చి 17,18 తేదీల్లో 48 గంటల ధర్నా నిర్వహించాము.ఏప్రిల్ 24 న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ ఆఫీస్ ల ముందు ధర్నాలు నిర్వహించాము.నిన్న ఏప్రిల్ 29న ములుగు జిల్లాలో మంత్రి క్యాంపు ఆఫీసు ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాము.ఈ ధర్నా ఫలితంగానే ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ మీటింగ్ నిర్వహించి మే నెలంతా సెలవులు ఇస్తూ నిర్ణయం చేయాల్సి వచ్చింది.ఇది సీఐటీయూ పోరాట ఫలితం.అట్లాగే రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.ఐసిడిఎస్ 50 సంవత్సరాల చరిత్రలో ఈ ప్రభుత్వం ఆధ్వర్యంలో మే నెలంతా సెలవులు నిర్ణయం చేసినందుకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాము. ఇదే స్ఫూర్తితో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలకు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ మినీ టీచర్స్ అందరు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాము.అంగన్వాడి యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ,జిల్లా ప్రధాన కార్యదర్శి దార స్నేహ బిందు కోరారు...

## కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్**



**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** కేంద్ర కేబినెట్ త్వరలోనే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు రెండు సంవత్సరాలుగా జన గణనలో బిసి గణను చేపట్టాలని బిసిటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని, ఇప్పటికైనా బిసిలకు జన గణన తరువాత జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యో గాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## టీవో సత్యనారాయణ శేష జీవితం ఆనందంగా గడపాలి



**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** బుధవారం రోజున కరీంనగర్ జెడ్పీ ఆఫీస్లో సన్మాన కార్యక్రమం జరిగింది. కరీంనగర్ జెడ్పిలో టివోగా పని చేస్తున్నా సత్యనారాయణ రిటైర్మెంట్ అయినారు. ఈ రిటైర్మెంట్ ప్రోగ్రాం కి అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బుర్ర నాగరాజు గౌడ్ సత్యనారాయణ దంపతుల ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టిఓ సత్యనారాయణ రిటైర్మెంట్ జీవితం సుఖ సంతోషాలతో శేష జీవితం ఆనందంగా గడపాలని చెప్పి కోరడం జరిగింది.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కోరం కనకయ్య, మల్లి బాబు యాదవ్



**ఖమ్మం, ఏప్రిల్30( నినాదం న్యూస్):** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దినేని రమేష్ కుమారుడు డా. మద్దినేని పవన్ కృష్ణ గత సంవత్సరం ఇదే రోజున రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారికి స్మృతిగా బుధవారం జరిగిన సంవత్సరం కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని పవన్ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మరియు గరిడేపల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీను ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. ఈరోజు జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో ప్రాణాలు కోల్పోయి ఆ కుటుంబాలకు తీరని లోటు మిగిల్చారని తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో షేక్ పతే మహమ్మద్,గింజల నర్సిరెడ్డి, దమ్మాలపాటి సత్యం జన్నారపు లింగయ్య, నల్లపునేని వినోద రావు యలమద్ది నరసింహారావు వల్లం కొండ బ్రహ్మం, మాగం వెంకటేశ్వర్లు, గుజ్జర్లపూడి రాంబాబు మాలోత్ బావ్ సింగ్, గుజ్జర్లపూడి రాంబాబు, అంబడిపూడి వెంకటేశ్వర్లు పాటి చిన్న లక్ష్మయ్య, ధనియాకుల హనుమంతరావు, దొడ్డ వేణు, వెంకటేశ్వర్లు, అనురాధ, నరసింహారావు అప్పయ్య ఉపేందర్, బట్టు నాను బట్టు రమేష్, తుమ్మ భాస్కర్, గోపి రాణి రాజేష్ రాము తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు.

# సంచలనాత్మక ఫలితాలకు నిర్వచనం అల్ఫోర్స్






- **పదో తరగతి 2025 ఫలితాల్లో అగ్రగామి అల్ఫోర్స్**
- **ఫలితం ఏదైనా అగ్రస్థానం అల్ఫోర్స్ దే**
- **బి.సాత్విక్ 589,మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచాడు**
- **డా వి. నరేందర్ రెడ్డి అల్ఫోర్స్ విద్య సంస్థల ఛైర్మన్**

**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** సంచలనాత్మక ఫలితాలకు నిర్వచనం అల్ఫోర్స్ విద్యా సంస్థలని అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కు చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష ఏదైనా ఫలితం ఏదైనా అగ్రస్థానం అల్ఫోరేనని మరోసారి నిరూపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు వార్షిక ప్రణాళిక ప్రారంభంలోనే పలు సూచనలను ఇవ్వడం జరుగుతుందని ఆ సూచనలను కఠినంగా అమలుపరిచి విద్యార్థుల్లో విజయ రహస్యాన్ని పెంపొందిస్తామని వారు తెలిపారు.ఈ క్రమంలో బుధవారం రోజున విడుదల చేసిన యస్ యస్.సి ఫలితాలలో పాఠశాలలకు చెందినటువంటి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులతో ఘన విజయం సాధించారని తెలుపుతూ బి. సాత్విక్ 589, ఎ. విష్ణుప్రియ, కె.శివరాణి, 588, కె. ఐశ్వర్య 587, యన్.సాత్విక్, ఎ. అన్విత్ 586,వి. అక్షర, జి. సహస్ర, సిహెచ్ ఆశ్రయ, టి. చరన్కుమార్ వి. అక్షర 585, టి. అక్షర, జి.శ్రీమేదా, వి.శివచరణ్, పి. గణేశ్, యన్. మధుశాలిని, కె. వినయ్ 584, ఎన్. నేహా, టి. నిత్య, జి. అఖిలా రెడ్డి, కె. ప్రణయ్, పి.అఖిల్ రావు 583, జి.సహజ 582, డి. విశ్వతేజ, కె. శోభన, కె.ఆలియా, యం.హర్షి, జి. ఐశ్వర్య, టి. కిషోర్ 581, యం. శృతకీర్తి, యం.డి. ముఖీత్, అర్. మౌ నిమా, కె.సహస్ర రెడ్డి, వి. బృహతి, ఎ.రంజిత్ రెడ్డి, కె. సుకృతి 580 మరియు తదితర విద్యా ర్థులు అత్యుత్తమ మార్కులతో ఘణవిజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు.1140 విద్యార్థులకు గాను 861 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని 35 మంది విద్యార్థులు 580 మార్కులకు పైగా, 110 మంది విద్యార్థులు 570 మార్కులకు పైగా 341 మంది విద్యార్థులు 550 మార్కు లకు పైగా సాధించారని చెప్పారు.రాష్ట్ర స్థాయి లో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు గాను విద్యార్థులను, అల్ఫోర్స్ విద్యా సంస్థలను అగ్రభాగాన నిలిపినందుకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులం దరికీ పుష్ప గుచ్ఛాలతో పాటు స్కోరు కార్డ్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది. తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు





**భీమదేవరపల్లి ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10 ఫలితాల్లో సత్తా చాటారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని వంగర బాలికల గురుకుల పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించి, 566 మార్కులతో కే సింధు మండల టాపర్ గా నిలిచింది, ముల్కనూర్ లోని తెలంగాణ మోడల్ స్కూల్ 100% ఉత్తీర్ణత డి అక్షయ అనే విద్యార్థి 556 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో ఉంది. గుండవరం భాస్కర్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 96. 22 శాతం ఉత్తీర్ణత సాధించి ఈ పాఠశాల విద్యార్థి ఆశ్రిత సాయి 547 మార్కులు సాధించి తృతీయ స్థానంలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 352 మంది కాగా వారిలో 343 మంది విద్యార్థులు సాధించగా 9 మంది ఫెయిల య్యా రు. మండల వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం 97.44 గా ఉన్నట్లు మండల విద్యాధికారి సునీత రాణి తెలిపారు.

# కగార్ ఆపరేషన్ వెంటనే నిలుపుదల చేయండి

- **కర్రిగుట్టపై దాడులు ఆపండి**
- **ఖనిజ సంపదను దోచుకునేందుకే గిరిజనులపై దాడులు**
- **దండకారణ్యంలో మానవ హక్కుల ఉల్లంఘన**
- **జాతీయ ఆదివాసి అధ్యక్షుడు చందా లింగయ్య దొర**



**మణుగూరు ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కగార్ ఆపరేషన్ పేరుతో ఛత్తీస్గడ్ రాష్ట్రందండకారణ్యం లో జరుగుతున్న మారణ హెూమాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఆదివాసి జాతీయ జేఏసీ అధ్యక్షులు చందా లింగయ్య దొర స్పష్టం చేశారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ........... మావోయిస్టుల పేరుతో కర్రిగుట్టపై దాడులు చేస్తూ అమాయక గిరిజనులను పొట్టన పెట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మావోయిస్టులను అణిచివేసేందుకు 30 వేల మంది సైనిక బలగాలను రంగంలోకి దింపి చత్తీస్గడ్ దండకారణ్యం లో మారణ హెూమం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఖనిజ సంపద నోదోచుకునేందుకు మావోయిస్టుల పేరుతో గిరిజనులపై ఉక్కు పాదం మోపుతూ భయానక వాతావరణ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశ సరిహద్దు ప్రాంతాల్లో ఉండవలసిన కేంద్ర బలగాలను దండకారణంలో దింపి మారణ హెూమం సృష్టించి మానవ హక్కుల ఉల్లంఘన పాల్పడుతున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కర్రిగుట్ట ప్రాంతంలో గడిచిన 10 రోజుల నుంచి 30 వేల మంది సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలను రంగంలోకి దింపి అమాయక గిరిజనులను పెట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పది రోజుల నుంచి మావోయిస్టు పార్టీ అగ్రనేతలు శాంతి చర్చలకు పిలుపునిచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నక్సలైట్లుతో శాంతి చర్చలు జరుపుకుండా అమాయక ఆదివాసి గిరిజనులను కాల్చి చంపడం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో ఉన్న ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు అంబానీ ,అదాని కంపెనీ లకుకేంద్ర ప్రభుత్వము ఒప్పందం చేసుకొని అడ్డుగా ఉన్న మావోయిస్టులను, అమాయక గిరిజనులను కాల్చి చంపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలో ఒక మనిషిని ఒక మనిషి కాల్చి చంపే అధికారం ఎక్కడ ఉందని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. గత పది రోజుల నుంచి కర్రిగుట్టలో జరుగుతున్న మారనహెూమాన్ని సృష్టించి గిరిజనులను భయాందోళనకి గురిచేస్తున్నారని ఆయన అన్నారు. 15 రోజుల నుంచి ఆదివాసి గిరిజనులు నిత్యవసర వస్తువులు కొనుక్కునేందుకు కూడా బయటికి రాకుండా ఆంక్షలు విధించి భయానికి వాతావరణం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నక్సలైట్లు ను అణిచివేసే పేరుతో దండకారణ్యంలో స్పెషల్ జోన్ ఆపరేషన్ ఆపరేషన్ గెరిల్లా ఆర్మీ లైబ్రేషన్ ఆపరేషన్ గ్రీన్ హంట్, కగార్ఆపరేషన్ లాంటివి కేంద్ర భద్రత బలగాలతో దాడులు చేపిస్తూ భయానికి వాతావరణ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. అలాగే మైదాన ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో అనేక ప్రాజెక్టులు నిర్మించి పోలవరం మేడిగడ్డ కాలేశ్వరం బి టి పి ఎస్ బి పి యల్ సింగరేణి సంస్థల లాంటి ప్రాజెక్టులు నిర్మించి లక్షలాదిమంది ఆదివాసులను నిర్వాసితులను చేయటం జరిగిందని ఆయన ఆరోపించారు. దండకారణ్యంలో నీళ్లు నిధులు ఖనిజ మైనింగ్ సంపద అటవీ సంపదను దేశంలో పేరు మోసిన అదాని,అంబానీ లాంటి వాళ్ళు వ్యాపారస్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్ని మావోయిస్టు దాడులు పేరుతో అమాయక గిరిజనులను పొట్టన పెట్టుకున్నట్లు ఆయన ఆరోపించారు. ఇప్పటికే చత్తీస్గడ్ మధ్యప్రదేశ్ ఝూర[illegible]ండ్ తెలంగాణ మహారాష్ట్ర తదిత రాష్ట్రాల్లో వేల సంఖ్యలో గిరిజనులను కాల్చి చంపి మావోయిస్టు సభ్యులుగా ఆరోపణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాంతి చర్చలకు సుముఖంగా ఉన్న మావోయిస్టులపై దాడులు పేరుతో గగనతలములపై దాడులు చేస్తూ భయానక వాతావరణ సృష్టిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. దేశ సరిహద్దు ప్రాంతంలో జరగాల్సిన గగనతల దాడులు సొంత దేశస్తులైన గిరిజనులపై దాడులు చేస్తూ అమాయకు లైన ఆదివాసి గిరిజనులను పెట్టుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి ఆదివాసి గిరిజనులు బుద్ధి చెప్పనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కనీసం సంపదను దోచుకునేందుకు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులను తన్ని తరిమి వేసే కుట్ర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నట్లు ఆయన ఆరోపించారు. భారతదేశ ప్రజాస్వామ్య రక్షణ కోసం అందులో ఆదివాసుల రక్షణ జీవన మరణ పరిస్థితుల నుండి కాపాడాలని అని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, న్యాయవాదులు న్యాయస్థానాలు ముందుకు వచ్చి మరణ హెూమాన్ని నిలుపుదల చేస్తూ గిరిజనులను కాపాడాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి తుడుం దెబ్బ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వట్టం నారాయణ, ఆదివాసి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ జిల్లా గిరిజన నాయకులు గొగ్గలి ఆర్కే దొర తదితరులు పాల్గొన్నారు.

# సూరారం సిరి ఫ్యూచర్ కిడ్స్ పదవ తరగతి ఫలితాలలో ప్రభంజనం

- 100% ఉత్తీర్ణత-567 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించిన దీపిక



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం ఓం జెండా వద్ద ఉన్న సిరి ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 100% ఉత్తీర్ణత తో పాటు ఎం. దీపిక అనే విద్యార్థి 567 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు. ఎస్ హెచ్ రోసి 551 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. మొత్తం 45 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా 100% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పలువురిచే ప్రశంసలు అందుకున్నారు . ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం తమ పాఠశాల ప్రత్యేకతగా అభివర్ణించారు. తమ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉన్నత స్థానములో నిలిచే విద్యార్థులతో సమానంగా పోటీపడేలా ప్రోత్సహించడం తమ సంస్థ నైజంగా వివరించారు. రానున్న కాలంలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించుటకు హితోదికంగా కృషి చేస్తామని ఆయన వివరించారు.

# అమ్మవారి కృపతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** అక్షయ తృతీయ పండుగను పురస్కరించుకొని 126 - జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ లోని సమయపురం మారెమ్మ మహాలక్ష్మి దేవాలయంలో నిర్వహించిన 18వ వార్షికోత్సవ ప్రత్యేక పూజలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు శశిధర్ ముదిరాజ్, మెట్ల శ్రీను, బండ మహేందర్, జయకృష్ణ, ముంతాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, వెంకటేష్, ప్రభాకర్, నాగరాజు, త్రివేణి, ఆలయ ధర్మకర్త బి.రామకృష్ణ, చందు, రవి, తిరుమల్ రెడ్డి, శివ్ రాజ్, రవి చారి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలోని సమస్యలను పరిష్కరిస్తా..

- కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్



**అల్వాల్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కాలనీలలో నేల కొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాయల్ ఇన్ క్లేవ్, లో సమస్యలపై బుధవారం కాలనీ వాసులు కార్పొరేటర్ కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో నేల కొని ఉన్న సమస్యలను వీలైనంత తొందరగా నిధులు మంజలు చేయించి పనులు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూప, మల్లేశ్వరి, గీత, వైష్ణవి, అనూష, శ్రీకృష్ణ, మంజుల, అనిత, వివేక్ పాల్గొన్నారు.

# ఆదర్శంగా నిలుస్తున్న జవహర్‌నగర్ ఆటో యూనియన్ సభ్యులు

- గుంతలను పూడుస్తూ స్ఫూర్తి నింపుతూ..



**జవహర్‌నగర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీ నుంచి సాయిబాబా కమాన్ కు వెళ్లే దారిలో భారీ గుంతలతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆలోచించకుండా నిత్యం ప్రమాదాలను చూస్తూ చలించి పోయిన శ్రీ సాయి ఆటో యూనియన్ సభ్యులు భారీ గుంతలను తమ స్వంత ఖర్చుతో పూడ్చారు. ప్రమాదాలను అరికట్టడానికి ఆటో యూనియన్ సభ్యులు చేసిన సేవాస్ఫూర్తికి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రమాదాలను అరికట్టడానికి ఆటో యూనియన్ సభ్యులు చేసిన సేవాస్ఫూర్తిని ప్రజలు మెచ్చుకుంటున్నారు. ప్రమాదాలను చూస్తూ పోకుండా మన వంతు సహాయం చేయాలని ప్రజలు చైతన్యంతోనే కాలనీలు అభివృద్ధి సాధిస్తాయని ఆటో యూనియన్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ నాయకులు నరేందర్ యాదవ్, కార్తీక్ రెడ్డి, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో నారాయణ స్కూల్ ప్రభంజనం



**అల్వాల్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** పదవ తరగతి ఫలితాలలో నారాయణ ఆల్వాల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 100% ఉత్తీర్ణత సాధించారు గరిష్ట మార్కులు 586/600. కె నైకేక సాధించింది విద్యార్థులందరూ ఏ1 గ్రేడ్. 10 మంది విద్యార్థులు సాధించారు. ఈ విజయోత్సవ లో ఏజీఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపల్ ఉమా, అకాడమిక్ డీన్ శైలజ, టెన్త్ ఇంచార్జ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉపాధ్యాయుని విద్యార్థిని విద్యార్థులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికే భూభారతి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** రైతు సమస్యల పరిష్కారానికే భూభారతి తీసుకు వచ్చినట్లు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు, జిల్లెడ్ చౌదరి గూడెం మండలాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులలో స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ధరణి రైతు పట్ల ఒక భూతంలా మారి రైతులకు ఇబ్బందులను, సమస్యలు తీసుకు వచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం ధరణిని తొలగించి దాని స్థానంలో భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని, ప్రతి ఒక్క రైతుకు కొత్త చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క రైతు సంఘాలతో, రెవెన్యూ మేధావులతో చర్చించి, ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుని కులాకంషంగా చర్చించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్, ఆర్డీవో సరిత, తహసిల్దార్లు, రైతులు, రైతు సంఘాల నాయకులు తదితరులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ వయస్సుకు మాత్రమే, ప్రజాసేవకు కాదు





- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం సర్కిల్ కార్యాలయం లో విధులు నిర్వహించిన శానిటేషన్ జవాన్ గజేందర్ బాబు పదవీ విరమణ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవీ విరమణ అనేది వయస్సుకు మాత్రమే,ప్రజాసేవకు కాదని అన్నారు. గజేందర్ బాబు గత నలభై ఏళ్లుగా తన సేవలను ప్రజలకు అందిస్తూ కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నారు. ఇలాంటి ఉద్యోగి సేవలు పదవీ విరమణ తర్వాత కూడా ప్రజలకు అవసరమని, వారు ఆయురారోగ్యాలతో సంపూర్ణ జీవితం కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహా, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు చుట్టం.. భూ భారతి చట్టం


- రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించిన పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ




**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విశ్వాసం కల్పించే విధంగా, వారి భూములకు రక్షణ కవచంలా ఉండేలా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని, ఈ భూ భారతి చట్టం రైతులకు చుట్టమని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జిహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేష్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలతో కలిసి ప్రసంగించారు. ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ చేస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తుందని తెలియచేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టం 2025లో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయని, భూమి అనేది ఒక రైతు జీవితానికి చాలా పెద్ద ఆధారమని, ముఖ్యంగా భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైనదని పేర్కొన్నారు. ఇకపై భూవివాదాలకు స్థానం లేకుండా భద్రమైన భూమి హక్కులు అందరికీ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలియచేసారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, ఈ చట్టంతో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలు సైతం భూ భారతిలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. జూన్ నెల నుంచి తహసీల్దార్లు మండలంలోని ప్రతీ గ్రామంలో భూ భారతి సదస్సులు నిర్వహించి రైతులకు భూ సమస్యలపై అవగాహన కల్పించి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. రైతులు తమ భూములను ఆన్ లైన్లో చూసుకునే అవకాశం ఉంటుందని, గతంలో ఏవైనా భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని భూ భారతితో 90శాతం తహసీల్దార్ వద్దే పరిష్కారం అవుతాయని తెలిపారు. లేదంటే ఆర్డీవో, కలెక్టర్లకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ ఐ చంద్రారెడ్డి, ఆర్ ఐ శ్రీనివాస్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోకాపేటలో బసవ భవన్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు

- పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** హైదరాబాద్ నడిబొడ్డున ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఏటా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని, లింగాయత్ జాతి గౌరవాన్ని మరింత పెంచేలా.. లింగాయత్‌ల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు, కోకాపేటలో బసవ భవన్ ఏర్పాటు కోసం విలువైన స్థలం కేటాయించి రూ.10 కోట్ల నిధులను సమకూర్చడం జరిగిందని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం శ్రీ మహాత్మా బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా హోప్ ఫౌండేషన్ ఛైర్మెన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులు అర్పించిన, అనంతరం 200 మంది మహిళ సోదరిమణులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలతో కలిసి చీరలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మహాత్మ శ్రీ బస్వేశ్వర 892 వ జయంతి శుభాకాంక్షలు తెలియచేసారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో బస్వేశ్వరుడి జయంతి సందర్భంగా పేద మహిళలకు చీరలను అందచేయడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు. విద్య, సమాజం, సమానత్వం గురించి పోరాటం చేసిన మహనీయుడు, సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుడని అన్నారు. అపూర్వ ప్రజాస్వామ్య వాది బసవేశ్వరుడు. పాల్కురి సోమనాథుడు తన ఆరాధ్య దైవమైన బస్వేశరునిపై బసవ పురాణం రాశారని, ఆయన గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. లింగాయత ధర్మకర్త సృష్టి కర్త మహాత్మ బస్వేశ్వరుడు విశ్వ గురువు. మహా మానవతా వాది, సంఘ సంస్కర్త, కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థను రూపుమాపడనికి క్రీ.శే. 12 వ శతాబ్దంలో నే పునుకున్న మొదటి సాంఘిక విప్లవకారుడు అని తెలియచేసారు. అదేవిధంగా స్త్రీ, పురుష అసమానతలు తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది అని, దళితులకు ఆలయ ప్రవేశం కలిపించిన ప్రగతి శీలి అని, మొట్టమొదట కులాంతర వివాహం చేసిన గొప్ప సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు బసవన్న జీవితంను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో నడవాలని, యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం ఆయన జీవితం అని, బసవన్న ఆశయల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ, నరేందర్ బల్లా, పాత్రికేయ మిత్రుడు పుట్టా వినయ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పరిధిలో రాణించిన విద్యా కుసుమాలు

- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ



**జవహర్‌నగర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి విద్యార్థుల ఫలితాల జాబితాలో జవహర్ నగర్ విద్యా కుసుమాలు ఓ వెలుగు వెలిగాయి. కార్పొరేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అజాముద్దీన్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో మొత్తం 139 విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 93 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పాఠశాల మొత్తం మీద 66.9 శాతం ఉత్తీర్ణత సాధించారు .న్యూ దేవేందర్ నగర్ విద్యార్థికి పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధికంగా గౌస్/600 538 మార్కులు సాధించి ఈ పాఠశాలకు వన్నె తెచ్చారని తెలిపారు. కాగా బాలాజీ నగర్ ఉన్నత పాఠశాలలో కే. ఉష( 600/ 528) గెలిలియో డేవిడ్ (600 / 525) జీ. రూప (600 / 513) సింధు వర్షిని (600 / 511) అన్ను ప్రతాప్ సింగ్ (600/ 509) మొత్తం119 మంది విద్యార్థులు పాస్ అవ్వగా 75% ఉత్తీర్ణతగా నమోదయిందని ప్రిన్సిపల్ నరసింహ తెలిపారు. ఈ మేరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తారీకు వరకు జరగనున్నాయని ప్రభుత్వ పాఠశాల ల ప్రిన్సిపల్స్ పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు అర్హత ప్రమాణాలు కలిగి ఉండి ప్రభుత్వ ఉపాధ్యాయ కోర్సును చేసిన నిపుణులైన ఆధ్యాపకులు ఉంటారని వారి మార్గదర్శకత్వంలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పెండింగ్ పనులను పూర్తి చేయండి

- జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్



**కాప్రా, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కాప్రా డివిజన్ పరిధిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఆయన కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో కలిసి కాప్రా డివిజన్ లో బుధవారం పర్యటించారు. భాస్కర్ రావ్ నగర్ లో అంతర్గత రోడ్ల ఏర్పాటు,సైనిక్ పురి పార్క్ లో తాయిలెట్ల నిర్మాణం, హైటెన్షన్ లైన్ రోడ్ లో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ కోరారు. కందిగూడ, శ్రీచక్ర కాలనీ, ఎన్ ఆర్ ఐ కాలనీ లలో అంతర్గత రోడ్లు, షిరిడి కాలానీలో అంతర్గత సి సి రోడ్ల నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. సి యస్ నగర్ లో పూర్తయిన పార్క్ సుందరీకరణ పనులన మల్లికార్జున నగర్ లోని పూర్తయిన అంతర్గత సి సి రోడ్ల నిర్మాణము పనులను జోనల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున నగర్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోని తమ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణము చేపట్టిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని, జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని ఘనంగా సన్మానించి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమీషనర్ జగన్ , ఈఈ శ్రీ నాగేందర్ నాయక్ , డిఈబాలకృష్ణ పాల్గొన్నారు.


# పరశురాముని జయంతి వేళ ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్టపై గల పరశు రాముడి దేవాలయంలో నిర్వహించిన పరశురాముడి జయంతి వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పరశురామ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరశురాముడి కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న కమిటీ హాల్ కు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు శశిధర్ ముదిరాజ్, మెట్ల శ్రీను, బండ మహేందర్, జయకృష్ణ, ముంతాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు రాం గోపాల్ సింగ్, సునీల్ సింగ్, సౌరభ్ సింగ్, రాజేష్ సింగ్, ముకేశ్ సింగ్, మోహన్ సింగ్, ఐపి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో వైద్య నిబంధనలు పాటించని క్లినిక్‌లు

- చర్యలు చేపట్టిన వైద్య అధికారులు
- శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షాదాన్ క్లినిక్‌లు సీజ్
- నిర్వాహకులపై క్రిమినల్ కేసులు



**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్30,(నినాదం న్యూస్):** తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు అనధికార వైద్యులపై రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే అందులో బాగంగా మెడికల్ కౌన్సిల్ గైడ్‌లైన్స్ ప్రకారం నిబంధనల విరుద్ధంగా ఎలాంటి మెడికల్ అర్హతల లేకుండా అలోపాథిక్ వైద్యం నిర్వహిస్తున్న వ్యక్తులపై మేడ్చల్ జిల్లా వైద్య అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి క్రిమినల్ పై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. అర్హత వ్యక్తులు నడుపుతున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్స్‌ను సీజ్ చేయాలనే ఆదేశాల మేరకు మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షాదన్ క్లినిక్లను అధికారుల బృందం సీజ్ చేసింది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి అక్రమంగా వైద్యం నిర్వహిస్తున్న ఈ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో మల్కాజిగిరి డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శోభ రాణి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ఉప జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. వినోద్, డిపిఎంఓ జోసెఫ్, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- పారదర్శకంగా నే ప్రభుత్వ పథకాలు అమలు
- సంక్షేమ పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతిపక్షాల చర్యలు
- మీడియా సమావేశంలో టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి

**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలతోపాటు సంక్షేమ పథకాల అమలులో ఇచ్చిన మాట తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హుజురాబాద్ నియోజకవర్గం లో గతంలో పనిచేసిన ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, అప్పుడు ఎమ్మెల్సీగా పనిచేసి ఇప్పుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్న పాడి కౌశిక్ రెడ్డి 10 సంవత్సరాలలో కనీసం 10 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి గ్రామానికి కొన్ని ఇండ్లను మొదటి విడతగా మంజూరు చేసి వారికి అందిస్తుండగా కొంతమంది బిజెపి బిఆర్ఎస్ నాయకులు మహిళలను రెచ్చగొడుతూ వారిని మానసికంగా దెబ్బతీస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం అడ్డుకుంటున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం సిరిసేడు గ్రామంలో 17 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని అవి కూడా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కానీ కొంతమంది మహిళలను మభ్యపెట్టి గ్రామాలలో అలజడి సృష్టిస్తూ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చే విధంగా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నియోజకవర్గం మొత్తం మీద కూడా కనీసం 17 మందికి ఇండ్లను అందించలేదని అలాంటిది ప్రతి గ్రామంలో మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి లబ్ధిదారులకు అందిస్తుండగా కావాలని దుష్ప్రచారం చేస్తూ లబ్ధిదారులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుకుంటూ భారం ఎక్కువైనప్పటికీ ఇచ్చిన మాట తప్ప కూడదు అనే సంకల్పంతో హామీలను అమలు చేస్తూ ప్రజల మెచ్చే విధంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఆయన సందర్భంగా గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రైతులకు రెండు లక్షలలోపు రుణమాఫీ నాలుగు ఎకరాల లోపు రైతులకు రైతుబంధు నిరుపేదలకు రేషన్ ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తూ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసుకుంటూ పోతుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు



ప్రసాదించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు గ్రామాలలో అలర్ట్ గా ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపాలని ప్రతిపక్షాల ప్రశ్నలకు ధీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## పిచ్చి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు


### పరిస్థితి విషమం వరంగల్ కు తరలింపు



**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన చెందిన రామంచ రాజు వనిత దంపతుల కుమారుడు అయాన్. ఇంట్లో ఆడుకుం టుండగా ఇంట్లోకి వీధి కుక్కలు ఒకేసారి చొరబడి ఒక కుక్క .తొడ పైభాగం తీవ్రంగా కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్లోని ఎంజిఎంకు బాలుని తరలించారు. గతంలో ఇదే మాదిరిగా వీధి కుక్కలు గ్రామంలోని పలు వురిని గాయపరిచి నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా ఉదా సీన వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

### - ఎస్సారెస్పీ ఈఈ శశిభూషణ్



**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, విరమణ అనంతరం కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శశి భూషణ్ అన్నారు. ఎస్సారెస్పీ హుజురాబాద్ సబ్ డివిజన్-2 పరిధిలో ఉమెన్ మజ్దూర్ గా పనిచేసిన పర్వీన్ ఏప్రిల్ 30న పదవి విరమణ పొందారు. కాగా బుధవారం పర్వీన్ ఆత్మీయ వీడుకోలు సమావేశాన్ని కెసి క్యాంపు లోని డిఈ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఈ శశిభూషణ్ మాట్లాడుతూ.. విశ్రాంత జీవితంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదవి విరమణ కేవలం వృత్తికే కానీ వ్యక్తిత్వానికి, మనసుకు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ లు వెంకట రామ వరప్రసాద్, రాము, రవీందర్, డీఏఓ నాగయ్య, ఏఈ రతీశ్, సహచర ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**కరీంనగర్ ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కొత్తపెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్వామి గౌడ్ అన్నారు కొత్తపెల్లి, కమాన్ పూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసినారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఇందుకు సహకరించిన మంత్రి పోన్నం ప్రభాకర్ కి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## పది ఫలితాల్లో సత్తా చాటిన న్యూ మిలీనియం విద్యార్థులు

### 100% ఉత్తీర్ణత మా లక్ష్యం..

### మిలీనియం స్కూల్స్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి



**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు, న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన మేకల రాంచరణ్ 600 మార్కులకు గాను 559 మార్కులు సాధించి పాఠశాల టాపర్ గా నిలిచారు, ఈ సందర్భంగా న్యూ మిలీనియం విద్యాసంస్థల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, న్యూ మిలీనియం స్కూల్స్ స్థాపించినప్పటి నుండి ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ర్యాంకులు సాధించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు విహార యాత్రలు క్రీడా పోటీలు క్విజ్ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడం జరుగుతుందని జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయబడిన న్యూ మిలీనియం విద్యాసంస్థలు కార్పొరేట్ సంస్థలతో పోటీ పడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ ముందుకు వెళుతుందని వెల్లడించారు. తల్లిదండ్రుల సహాయ సహకారాలతో న్యూ మిలీనియం విద్యాసంస్థలను మరింత ముందుకు తీసుకొని వెళ్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు సాధించిన విజయం పట్ల తల్లిదండ్రుల తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## రహదారి కోసం యువకుడి ఆమరణ నిరాహార దీక్ష

- అధికారుల హామీతో దీక్ష విరమించిన సిలివేరు శ్రీకాంత్
- మద్దతు తెలిపిన పలువురు
- న్యాయం జరగకపోతే మళ్లీ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తా




**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల 8వ వార్డు లోని సర్వే నంబర్ 793/ఎ/2, 793/బి లో గల స్మశాన వాటిక దారి స్థలము కబ్జా విషయమై ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్. గత కొద్దిరోజులుగా మోతుల గూడెం గ్రామంలో ఉన్న స్మశాన వాటికకు వెళ్లే రహదారిని కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మించారని వెంటనే దానిని తొలగించాలంటూ అధికారుల చుట్టూ తిరిగిన వారు స్పందించకపోవడంతో మంగళవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం దగ్గర ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్. శ్రీకాంత్ చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపిన సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ, పోడేటి రామస్వామి, కొండ్లె పాపయ్య, మంద సాంబయ్య, పరిమెల కిషోర్ వివిధ సామాజిక, ఉద్యమ, కుల సంఘాల ప్రతినిధులు. విషయం తెలుసుకున్న అధికారులు రహదారి విషయంలో అధికారులతో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శ్రీకాంత్ నిరాహార దీక్షను విరమించుకున్నారు.

ఈ సందర్భంగా సిలివేరు శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఎం.పీ.ఆర్ గార్డెన్ సమీపాన ఉన్న హిందూ స్మశాన వాటికకు సంబంధించి ప్రజా ప్రయోజనార్థం ఉపయోగించే లక్షలాది రూపాయల విలువైన దారిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసిన స్థలాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినను సంబంధిత సమస్య విషయంలో ఎలాంటి చర్యలు లేనందున ఈరోజు స్థానికతహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరిగిందని తెలిపారు.

ఇట్టి దీక్ష విషయమై జిల్లా ఉన్నత అధికారుల ఆదేశానుసారం స్థానిక తహసిల్దార్ జి. రమేష్ బాబు స్థానిక పట్టణ సి.ఐ వరంగంటి రవిలు తమ సిబ్బందితో దీక్ష శిబిరం వద్దకు చేరుకొని సంబంధిత సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కుం టామని హామీ ఇస్తూ దీక్షను విరమింప చేశా రని తెలిపారు. న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆయన మరోసారి స్పష్టం చేశారు. తనకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని శ్రీకాంత్ అన్నారు.

## పది ఫలితాల్లో పారమిత విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

### ఫలితాలలో 577 మార్కులతో టాపర్‌గా రామోజుల సాయిూశ్వర్ నిలిచాడు



**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి వార్షిక ఫలితాల్లో స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ ఫలితాలు కేవలం పారమితకు సంబంధించిన ఒకే పాఠశాలవి. ఈ ఫలితాలలో 577 మార్కులతో రామోజుల సాయిూశ్వర్, 573 మార్కులతో గంగిల సాన్విత్ రెడ్డి , 571 మార్కులతో ఉమ్మెంతుల మనస్విని, 570 మార్కులతో అగస్త్య మహావీర అత్యధిక మార్కులు సాధించారు. 550 ఆపైన మార్కులతో 39 మంది విద్యార్థులు, 500 మార్కులు ఆపైన 131 మంది విద్యార్థులు ఫలితాలు సాధించగా, 100% ఉత్తీర్ణతో పారమిత విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. బాలాజీ తెలిపారు. పారమిత విద్యాసంస్థలలో నైపుణ్యాలకు పెద్దపీట వేసి ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా విద్యార్థులను అన్నిరంగాలలో తీర్చిదిద్దడం జరుగుతుంది. ఈ పద్దతిలో ఎక్కడా కూడా అధిక మార్కులు సాధించడానికి విద్యార్థులను బట్టి విధానానికి ప్రోత్సహించడం జరగదు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డా ఇ. ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేష్, ప్రాచీ, వినోదరావ్, వి.యు.ఎం. ప్రసాద్, టి.ఎస్వి. రమణ, హన్మంత రావు ప్రధానో పాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయకర్త శ్రీనాథ్ ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలకు ఉత్తమ సహకారాన్నందించిన తల్లి తండ్రులకు చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

## "పది" ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన శ్రీ కాకతీయ విద్యాసంస్థలు

- పరీక్ష ఏదైనా ఫలితాలు శ్రీ కాకతీయకే సొంతం
- విద్యార్థులను అభినందించిన శ్రీ కాకతీయ
- విద్యాసంస్థల చైర్మన్ ఆవిర్నేని సుధాకర్ రావు




**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి తన ప్రభంజనాన్ని కొనసాగించిన జమ్మికుంటలోని కాకతీయ విద్యా సంస్థలు. పరీక్ష ఏదైనా ఫలితాలు కాకతీయ విద్యా సంస్థలకు సాధ్యం. బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించిన మారబోయిన అద్వైత శ్రీ తన సత్తాను చాటుకుంది. ఇవే కాకుండా 589, 587, 586, 584, 583, 582 మార్కులు సాధించి ఎంతో మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. కాకతీయ విద్యాసంస్థలలో ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లాలో తన ఉనికిని కొనసాగిస్తూ వస్తుంది. బుధవారం వెలుబడిన పదో తరగతి పరీక్షల పరీక్షలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల అధినేత ఆవిర్నేని సుధాకర్ రావు మాట్లాడుతూ, పరీక్ష ఏదైనా ఫలితం కాకతీయ సొంతం అని ఆయన అన్నారు, మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు అధ్యాపక బృందానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి కాకతీయ విద్యా సంస్థల పేరును నిలబెట్టాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఫలితాల సాధనలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని రాబోయే రోజుల్లో ప్రతి విద్యార్థి ఇదే ఉత్సాహంతో చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పేదింట్లో వెలసిన విద్యా కుసుమాలు

### పది ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ

**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** చదువుకు పేదరికం అడ్డు కాదు. కన్న తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ వారి బిడ్డలను ఉన్నతంగా చదివేయాలనే దృఢ సంకల్పంతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుండగా వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు ఈ విద్యార్థినీలు. జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన నసీరుద్దీన్ అశ్వియా దంపతుల కుమార్తె సుమయనుర్జాన్. చిన్నతనం నుండి చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినిని తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందిస్తూ వారు చేస్తున్న చిరు వ్యాపారాన్ని సైతం మరిచిపోయి జమ్మికుంట పట్టణంలోని మైనారిటీ స్కూల్లో చదివించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో 561 మార్కులు సాధించి మండల స్థాయి మార్కులతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అదే విధంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన రవి పూల దంపతుల కుమార్తె గిరివేని స్పందన కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తుంది. తండ్రి హమాలి పని చేస్తున్నప్పటికీ తనను కలలను సాకారం చేయాలని ఉద్దేశంతో చదువులో మంచి ప్రతిభను కనబరుస్తూ అందరిచేత మనలను పొందింది. అంతేకాకుండా మండల స్థాయిలో పదవ తరగతి ఫలితాలలో 557 మార్కులు సాధించి తన తండ్రి కలలు కన్నా కలను సాకారం చేసేందుకు మరింత పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసిస్తానని పేర్కొంది. ఈ పేదింటిలో విరిసిన విద్యా కుసుమాలకు కార్పొరేట్ స్థాయిలో ఉన్న విద్యావంతులు చేయూతన అందించి వారి కలలను సాకారం చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులను మండల విద్యాధికారిని హేమలత అభినందించారు.



## అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయండి

- లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి
- ఆర్డీవోకు వినతి పత్రం అందించిన

### మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్.



**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అర్హులైన నిరుపేదలకు అందిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఇండ్లను మంజూరు చేయాలని జమ్మికుంట మాజీ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ హుజురాబాద్ ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ,,, ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి న్యాయంగా వారికి ఇండ్లను కేటాయించాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ గ్రామాలలో కొన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేసారని ఈ ప్రభుత్వం వాటిని గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు వాటిని కూడా కేటాయిస్తే ఉపయోగకరం గా ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్న ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని అందరికీ ఇండ్లను మంజూరు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలులో రాజకీయ జోక్యం లేకుండా పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సాంస్కృతికోత్సవ వేడుకలు




**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్):** జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ పీ.జి కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ అధ్యక్షతన ఘనంగా కళాశాల సాంస్కృతికోత్సవ వేడుకలు జరిగాయి. కళాశాల విద్యాసంవత్సరం 2024-25 ముగింపును పురస్కరించుకొని కళాశాల సాంస్కృతికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. శ్రమించినప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతామన్నారు. తృతీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు వచ్చే సంవత్సరంలో పీ.జి , బీ.ఈడి వంటి ఉన్నత కోర్సులు చదవాలన్నారు. అలాగే అర్హత ఉన్న ఉద్యోగాల కోసం పోటీపడాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ ఆట, పాటలతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపాల్ డా.ఎస్. ఓదెలు కుమార్, డా. రాజేంద్రం, డా. గణేష్, డా.శ్యామల, డా. మాధవి, కిరణ్ కుమార్, ఉమాకిరణ్, రాజకుమార్, మమత, డా. రవి, ఎల్. రవిందర్, శ్రీనివాస్ రెడ్డి, సుష్మ, రవి ప్రకాశ్ రావు, డా. శ్రీనివాష్, కె. శ్రీనివాస్, రమేష్, ప్రశాంత్, సాయికుమార్, శ్రీకాంత్, అరుణ్ రాజ్, అనూష, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూక మధురమ్మ ఆత్మ శైవైక్యం కావాలి

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన పింగళి రమేష్



**జమ్మికుంట, ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నూక జగదీశ్వర్ శ్రీనివాస్ లా మాతృమూర్తి నూక మధురమ్మ మంగళవారం ఆకస్మిక మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె అంత్యక్రియలు బుధవారం విలాసాగర్ గ్రామంలో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ హుజురాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్ మధురమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఆకస్మిక మృతి బాధాకరమని ఎప్పుడు నవ్వుతూ పలకరించే ఆమె మా మధ్య లేకపోవడం బాధాకరమని ఆమె ఎక్కడున్నా ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మధురమ్మ మృతి వార్త తెలుసుకున్న హుజురాబాద్ పట్టణ వర్తక సంఘం వైశ్య సంఘం నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు.

## స్వదేశీ రైఫిల్ షూటింగ్ అకాడమీ ప్రారంభం

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని భగత్ నగర్ లో నేడు స్వదేశీ రైఫిల్ షూటింగ్ అకాడమీని నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, ఒలంపిక్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందెల్లి మహిపాల్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్రావు, దిండిగాల మహేష్ తో కలిసి షూటింగ్ అకాడమీ ప్రారంభించారు. షూటింగ్ లో అత్యుత్తమ శిక్షణను పిల్లలకు అందించి, వారు దేశానికి పథకాలు తెచ్చే విధంగా వారిని తీర్చిదిద్దేటట్టు కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. త్వరలో రైఫిల్ షూటింగ్‌కు సంబంధించిన పోటీలను కరీంనగర్లో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు మరియు షూటింగ్ అకాడమీ శిక్షకులు, పలువురు బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ

**కరీంనగర్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో బొక్కల రేణుక జయరాం పెళ్లిరోజు సందర్భంగా బొమ్మకల్ సెంట్రల్ లైటింగ్ ఇటుక బట్టి వద్ద వలస కూలీలకు అవసరార్థులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ జోన్ చైర్ పర్సన్ లయన్ చింతల కిషన్ పటేల్, ఎంజేఫ్, క్లబ్ సెక్రెటరీ లయన్ బట్టు రాజేందర్, చింతల శివాని మహేష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# తులసి ఆకులతో వ్యాధులను తగ్గించుకోవచ్చు..

సీజన్లు మారినప్పుడు సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. కొందరు జ్వరంతో కూడా బాధపడుతుంటారు. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే ఇలాంటి చిన్నపాటి అనారోగ్య సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్త పడవచ్చు. కరోనా సమయంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై కోవిడ్ మహమ్మారి ఎలాంటి ప్రభావం చూపించిందో అందరికీ తెలిసిందే. కనుక ఎప్పుడైనా సరే ఇమ్యూనిటీ పవర్ అధికంగా ఉంటే రోగాలకు ఎలాంటి భయం చెందాల్సిన పనిలేదు. ఈ క్రమంలోనే రోగ నిరోధక శక్తిని పెంచే ఒక కషాయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. దీన్ని తయారు చేయడం చాలా సులభం. మన వంట ఇంట్లో లభించే పదార్థాలతోనే సహజసిద్ధంగా ఈ కషాయాన్ని తయారు చేసి తరచూ తాగవచ్చు. దీంతో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. ఇక ఆ కషాయం ఎలా తయారు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**తయారీ ఇలా..**

నాలుగు గ్లాసుల నీటిలో అర టీస్పూన్ పసుపు, ఒక చిన్న దాల్చిన చెక్క ముక్క, నాలుగైదు తులసి ఆకులు, కొన్ని మిరియాలు, 2 లవంగాలు, కొద్దిగా వాము, యాలకులు వేసి ఆ నీటిని స్టవ్‌పై పెట్టి బాగా మరిగించాలి. నీరు 2 గ్లాసులు అయ్యే వరకు మరిగిస్తే చిక్కని కషాయం రెడీ అవుతుంది. దీన్ని రోజుకు ఒక కప్పు మోతాదులో తాగాలి. ఈ కషాయం చేయడం చాలా సులభం. ఒకసారి తయారు చేసి 4 రోజుల వరకు నిల్వ చేసి దాన్ని రోజూ కాస్త వేడి చేస్తూ తాగవచ్చు. ఇందులో వాడే పదార్థాలు అన్నీ సహజసిద్ధమైనవే. కనుక ఈ కషాయాన్ని తాగితే మనకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. ఈ కషాయాన్ని తాగితే అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది.

**రోగ నిరోధక శక్తికి..**

తులసి కషాయాన్ని తాగడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా శరీరం పోరాటం చేస్తుంది. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ సమస్యల నుంచి బాధపడుతున్నవారు ఇంగ్లిష్ మెడిసిన్లను వాడే బదులు ఈ కషాయాన్ని తయారు చేసి రోజుకు 2 సార్లు తాగితే ఫలితం ఉంటుంది. తులసి కషాయాన్ని సేవిస్తుంటే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. శ్వాస మార్గాల్లో ఉండే అడ్డంకి పోయి గాలి సరిగ్గా ఆడుతుంది. ఊపిరితిత్తుల వాపు తగ్గుతుంది. ఈ కషాయంలో విటమిన్లు ఎ, సి, కె అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

**జీర్ణ సమస్యలకు..**

తులసి కషాయాన్ని తాగడం వల్ల జీర్ణ వ్యవస్థకు సైతం ఎంతో మేలు జరుగుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. తులసి కషాయాన్ని తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

నినాదం అవని 10

# వెక్కిళ్లు తగ్గాలంటే ఏం చేయాలి..

మనకు వెక్కిళ్లు అనేవి సహజంగానే అప్పుడప్పుడు వస్తుంటాయి. సాధారణంగా భోజనం చేసే సమయంలో వెక్కిళ్లు రావడాన్ని మనం గమనించవచ్చు. కొందరు వేగంగా భోజనం చేసినప్పుడు లేదా భోజనం చేస్తూ ఎక్కువగా మాట్లాడుతున్నా, నీళ్లను టైముకు తాగకపోయినా కూడా వెక్కిళ్లు వస్తుంటాయి. ఇవి వచ్చేందుకు ప్రత్యేకంగా కారణాలు అంటూ ఏమీ ఉండవు. కానీ కొన్ని సార్లు వెక్కిళ్లు వస్తే వాటంతట అవే పోతాయి. కొన్ని సార్లు మాత్రం 48 గంటలకు పైగానే ఉంటాయి. శీతల పానీయాలను తాగేవారికి, మద్యం ఎక్కువగా సేవించే వారికి, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నవారికి, ఉష్ణోగ్రత సడెన్‌గా మారినప్పుడు, గాలిని బాగా పీల్చుకున్నప్పుడు, కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తింటే వెక్కిళ్లు వస్తుంటాయి.

**కారణాలు ఇవే..**

వెక్కిళ్లు వచ్చినప్పుడు సాధారణంగా చాలా మంది నీళ్లను తాగుతారు. కొన్ని సార్లు 48 గంటలు గడిచినా వెక్కిళ్లు తగ్గవు. అలాంటి సందర్భాల్లో కచ్చితంగా డాక్టర్‌ను సంప్రదించాలి. లేదంటే నాడీ మండల



వ్యవస్థపై ప్రభావం పడుతుంది. నాడులు డ్యామేజ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. కొందరికి గొంతులోకి వెంట్రుకలు లేదా ఇతర వస్తువులు వెళ్లినప్పుడు వెక్కిళ్లు వస్తాయి. ట్యూమర్లు, కొవ్వు కణతులు ఉన్నా, తీవ్రమైన గ్యాస్ సమస్య ఉన్నా, గొంతులో గర గర, నొప్పి, మంట ఉన్నా వెక్కిళ్లు వస్తుంటాయి. డయాబెటిస్ ఉన్నవారిలో, ఎలక్ట్రోలైట్స్ అసమతుల్యత ఏర్పడినప్పుడు, కిడ్నీ వ్యాధులు ఉన్నవారిలోనూ వెక్కిళ్లు సాధారణంగా తరచూ వస్తూనే ఉంటాయి.

**ఈ చిట్కాలను పాటించాలి..**

వెక్కిళ్లు వచ్చినప్పుడు కొందరు వెంట వెంటనే నీళ్లను తాగుతారు. ఇలా తాగితే వెక్కిళ్లు తగ్గవు సరికదా ఇంకా ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. వెక్కిళ్లు వచ్చినప్పుడు నీళ్లను చిన్న సిప్‌లా తాగి లోపలి నుంచి వచ్చే గ్యాస్‌ను వెంటనే నోటి ద్వారా త్రేన్పు రూపంలో బయటకు తీయాలి. దీంతో వెక్కిళ్లు వెంటనే తగ్గిపోతాయి. అంతేకానీ నీళ్లను వెంట వెంటనే తాగకూడదు. అలాగే ఒక పేపర్ బ్యాగ్‌ను తీసుకుని మీ నోటి చుట్టూ దాన్ని బిగించి అందులోకి గాలిని వదులుతూ పీలుస్తూ ఉండాలి. ఇలా చేస్తున్నా కూడా వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. వెక్కిళ్లు వచ్చినవారు వెంట వెంటనే శ్వాస తీసుకోకూడదు. నెమ్మదిగా గాలి పీల్చి వదులుతూ ఉండాలి. 1 నుంచి 5 వరకు లెక్క పెడుతూ గాలి పీల్చాలి. మళ్లీ అలాగే లెక్క పెడుతూ గాలిని వదలాలి. ఇలా చేస్తున్నా కూడా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

**48 గంటలకు మించితే..**

నేలపై కూర్చుని మీ మోకాళ్లను ఛాతి వరకు తేవాలి. అందుకు అవసరం అయితే కాస్త ముందుకు వంగాలి. ఇలా చేస్తున్నా కూడా వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. అలాగే చల్లని నీళ్లను తాగితే వేగస్ నాడి యాక్టివేట్ అవుతుంది. ఇది వెక్కిళ్లు తగ్గేలా చేస్తుంది. గొంతులో ఐస్ నీళ్లను పోసి పుక్కిలిస్తున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది. వెక్కిళ్లు బాగా వస్తున్నప్పుడు చక్కెర కూడా పనిచేస్తుంది. నోట్లో కాస్త చక్కెర వేసుకుని తింటున్నా కూడా వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. నిమ్మరసాన్ని చప్పరిస్తుంటే గొంతులో ఉండే నాడులు ఉత్తేజితం అవుతాయి. ఇవి వెక్కిళ్లను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. పావు టీస్పూన్ వెనిగర్‌ను తీసుకుని చప్పరిస్తున్నా కూడా వెక్కిళ్లను తగ్గించుకోవచ్చు. వెక్కిళ్లు మనకు వచ్చే అతి సాధారణ సమస్యే అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో ఇవి ప్రాణాంతకం అవుతాయి. కనుక 48 గంటలకు మించి ఇవి ఉంటే మాత్రం కచ్చితంగా డాక్టర్‌ను కలవాల్సి ఉంటుంది.

# రోడ్డు పక్కన ఈ పండ్లు కనిపిస్తే.. విడిచిపెట్టకుండా తినండి

విదేశాల నుంచి వచ్చే పండ్ల కన్నా మన దగ్గర స్థానికంగా లభించే కొన్ని రకాల పండ్లలోనే పోషకాలు అధికంగా ఉంటాయి. కానీ అలాంటి పండ్ల గురించి చాలా మందికి తెలియదు. అలాంటి పండ్లలో లసోరా పండ్లు కూడా ఒకటి. ఇవి చూసేందుకు అంత ఆకర్షణీయంగా ఉండవు. కానీ ఇవి అందించే ప్రయోజనాలు మాత్రం అమోఘమనే చెప్పాలి. లసోరా పండ్లనే గ్లూ బెర్రీ లేదా ఇండియన్ చెర్రీ అని కూడా పిలుస్తారు. ఈ పండ్లను అనేక ఆయుర్వేద ఔషధాల తయారీలో ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. మనకు రహదారుల పక్కన చెట్లకు ఈ కాయలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. కానీ ఇవి ఔషధ గుణాలను కలిగి ఉంటాయన్న విషయం చాలా మందికి తెలియదు. లసోరా పండ్లలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్‌ను ఈ పండ్లు కలిగి ఉంటాయి. కనుక ఈ పండ్లను తింటే అనేక లాభాలను పొందవచ్చు.

**కంటి సమస్యలకు..**

లసోరా పండ్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఈ పండ్లను తింటుంటే అన్ని



రకాల కంటి సమస్యలు తగ్గిపోతాయి. లసోరా పండ్లలో విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే చర్మం కాంతివంతంగా ఉండేలా చేస్తుంది. లసోరా పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. లసోరా పండ్లలో ఉండే క్యాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..**

ఈ పండ్లలో ఫాస్ఫరస్, జింక్, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు త్వరగా అతుక్కునేలా చేస్తాయి. విరిగిన ఎముకలతో బాధపడుతున్న వారు తరచూ ఈ పండ్లను తింటే ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. ఎముకలకు బలం కలుగుతుంది. లసోరా పండ్లలో ప్రోటీన్లు సైతం ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంతోపాటు కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే ఫైబర్ జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. ముఖ్యంగా మలబద్దకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. లసోరా పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా చూస్తాయి. కణజాలం దెబ్బ తినకుండా రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

**షుగర్ లెవల్స్‌కు..**

లసోరా పండ్లను తింటే దగ్గు, గొంతు నొప్పి, గొంతులో గరగర, మంట వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల వాపులను తగ్గిస్తాయి. దీంతో ఆస్తమా నుంచి బయట పడవచ్చు. లసోరా పండ్లలో యాంటీ హైపర్ టెన్సివ్ గుణాలు ఉంటాయి. అంటే ఈ పండ్లను తింటుంటే బీపీ నియంత్రణలో ఉంటుందన్నమాట. లసోరా పండ్లు షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించగలవు. ఈ పండ్లలో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉంటాయి. తరచూ ఈ పండ్లను తింటుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేస్తాయి. లసోరా పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను శుభ్రం చేస్తాయి. లివర్‌లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు పోయేలా చేస్తాయి. దీంతో లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా ఈ పండ్లను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక ఈ పండ్లు మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

నినాదం మార్కెట్ NINADAM MARKET

# బ్యాంకు కస్టమర్లకు అలర్ట్..

**మే 1 నుంచి ఏటీఎం ఛార్జీల బాదుడు.. ఎంతంటే..**

ఏటీఎం నెట్‌వర్క్ కోసం ఇతరులపై ఎక్కువగా ఆధారపడే బ్యాంకులపై ఏటీఎం ఛార్జీల పెరుగుదల ఇప్పుడు ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. నాన్-హోమ్ బ్యాంక్ ఏటీఎంల నుండి డబ్బు తీసుకోవడానికి లేదా బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి వినియోగదారులు ఇప్పుడు మరిన్ని ఛార్జీలు చెల్లించాల్సి.. కార్డు ఉంటే, మీకు అవసరమైన చోట నగదు తీసుకోవచ్చు. కానీ మే 1 నుండి మీరు %ాువీ% నుండి డబ్బు తీసుకోవడానికి లేదా బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి మునుపటి కంటే ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనను ఆర్‌బిఐ ఆమోదించిన తర్వాత, ఇతర బ్యాంకుల ఎటిఎంల నుండి డబ్బును ఉపసంహరించుకోవడం ఇప్పుడు ఖరీదైనదిగా మారుతుంది. మే 1, 2025 నుండి, మీరు వేరే బ్యాంకు %ాువీ% నుండి ఒక నిర్దిష్ట పరిమితి తర్వాత డబ్బు తీసుకుంటే రూ. 17 చెల్లించడానికి బదులుగా, మీరు ఇప్పుడు రూ. 19 చెల్లించాలి. బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి ఛార్జీని కూడా రూ. 7 నుండి రూ. 9 కి పెంచారు. బ్యాంక్ తన కస్టమర్లకు మెట్రో నగరాల్లోని ఇతర ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీలు, నాన్-మెట్రోలలో 3 ఉచిత లావాదేవీల పరిమితిని ఇస్తుంది. ఇది కాకుండా మీరు లావాదేవీపై ఈ పెరిగిన ఛార్జీని చెల్లించాలి. ఏటీఎం నెట్‌వర్క్ కోసం ఇతరులపై ఎక్కువగా ఆధారపడే బ్యాంకులపై ఏటీఎం ఛార్జీల పెరుగుదల ఇప్పుడు ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. నాన్-హోమ్ బ్యాంక్ ఏటీఎంల నుండి డబ్బు తీసుకోవడానికి లేదా బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి వినియోగదారులు ఇప్పుడు మరిన్ని ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అటువంటి పరిస్థితిలో ఈ పెరిగిన ఛార్జీ తర్వాత ఏటీఎంలను ఎక్కువగా ఉపయోగించే వ్యక్తులు అదనపు ఛార్జీని నివారించడానికి వారి హోమ్ బ్రాంచ్ ఏటీఎంను ఉపయోగించడం మంచిది. లేదా డిజిటల్ చెల్లింపు ఎంపికను ఉపయోగించాలి. ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్ల సంఖ్యను పెంచాలని అన్ని బ్యాంకులు, వైట్-లేబుల్ ఏటీఎం ఆపరేటర్లను ఆర్‌బీఐ ఆదేశించింది. దీని కింద 75 శాతం %ాువీ%లలో సెప్టెంబర్ 30, 2025 నాటికి కనీసం ఒక రూ.100, రూ.200 నోట్ల క్యాసెట్ ఉండాలి. దీని తర్వాత మార్చి 31, 2026 నాటికి 90 శాతం ఏటీఎంలలో ఈ సౌకర్యం అందుబాటులోకి రావాలి. ఆదేశం తర్వాత రూ.500 నోట్లకు బదులుగా రూ.100 లేదా రూ.200 నోట్లు ఎక్కువగా అవసరమయ్యే వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పుడు వారు ఈ నోట్లను ఏటీఎం నుండి సులభంగా తీసుకోవచ్చు.



# వినియోగదారులకు షాకిచ్చిన అమూల్.. పాల ధరలు పెంపు!

పాడి రైతుల నుండి ముడి పాల సేకరణ ఖర్చు పెరగడం వల్ల ధరల పెరుగుదలకు కారణమని మదర్ డెయిరీ పేర్కొంది. గత కొన్ని నెలలుగా పాల కొనుగోలుకు అధిక ధరలు చెల్లించినప్పటికీ, తాము ధరలను పెంచలేదని మదర్ డెయిరీ.. మదర్ డెయిరీ తర్వాత ఇప్పుడు అమూల్ కూడా పాల ధరను రూ.2 పెంచింది. మంగళవారం రాత్రి ముందుగా మదర్ డెయిరీ పాల ధరను రూ.2 పెంచింది. ఇది ఏప్రిల్ 30 బుధవారం నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. అమూల్ పాల కొత్త ధర మే 1 గురువారం నుండి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో మదర్ డెయిరీ టోన్డ్ (బల్క్ వెండ్) పాల ధర లీటరుకు రూ.54 నుంచి రూ.56కి పెరుగుతుంది. ఫుల్ క్రీమ్ మిల్క్ ధర లీటరుకు రూ.68 నుంచి రూ.69కి పెరుగుతుంది. దీనితో పాటు టోన్డ్ మిల్క్ (పౌచ్) ధరను లీటరుకు రూ.56 నుండి రూ.57కి పెంచారు. డబుల్ టోన్డ్ పాల ధర లీటరుకు రూ.49 నుంచి రూ.51కి పెరిగింది. ఆవు పాల ధర లీటరుకు రూ.57 నుంచి రూ.59కి పెరిగింది.

**గత కొన్ని నెలల్లో ధర 4 నుండి 5 రూపాయలు పెరిగింది:**




మదర్ డెయిరీ అధికారి మాట్లాడుతూ.. సేకరణ ఖర్చు నిరంతరం పెరుగుతోంది. గత కొన్ని నెలలుగా ధరలు లీటరుకు 4-5 రూపాయలు పెరిగాయి. మదర్ డెయిరీ తన సొంత అవుట్‌లెట్‌లు, సాధారణ వాణిజ్యం, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఢిల్లీ-ఎన్‌సిఆర్ మార్కెట్‌లో రోజుకు దాదాపు 35 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుంది. రైతుల జీవనోపాధికి మద్దతు ఇస్తూనే వినియోగదారులకు నాణ్యమైన పాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు. పాడి రైతుల నుండి ముడి పాల సేకరణ ఖర్చు పెరగడం వల్ల ధరల పెరుగుదలకు కారణమని మదర్ డెయిరీ పేర్కొంది. గత కొన్ని నెలలుగా పాల కొనుగోలుకు అధిక ధరలు చెల్లించినప్పటికీ, తాము ధరలను పెంచలేదని మదర్ డెయిరీ తెలిపింది. దీనికి తోడు దేశవ్యాప్తంగా వేడి కారణంగా పాల ఉత్పత్తి మరింత ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# పీఎఫ్ ఖాతాదారులకు గుడ్‌న్యూస్

ఖాతా బదిలీ మరింత సులభం

భారతదేశంలో జనాభాకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారికి రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) పథకాన్ని అమలు చేస్తుంది. మన దేశంలో కోట్లల్లో పీఎఫ్ ఖాతాదారులు ఉన్నారు. మన దేశంలో ఉద్యోగస్తుల్లో చాలా మందికి పీఎఫ్ ఖాతా ఉంటుంది. అయితే అనుకోని సందర్భంలో ఉద్యోగం మానేసి వేరే ఉద్యోగంలో చేరాలంటే ఈ పీఎఫ్ ఖాతా బదిలీ పెద్ద ప్రహసనంగా మారుతుంది. ముఖ్యంగా గతంలో ఉద్యోగం చేసే కంపెనీ పీఎఫ్ ఖాతా బదిలీలో అలసత్వం చూపించడంతో సగటు ఉద్యోగి చాలా ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి కష్టాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ మార్పుపై ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతా బదిలీని సులభతరం చేసింది. ఇకపై యజమాని ధ్రువీకరణ లేకుండానే పీఎఫ్ ఖాతా బదిలీ చేసుకునే అవకాశం ఇచ్చింది. ఈపీఎఫ్ఓ అప్‌డేటెడ్ ఫారమ్-13 ద్వారా బదిలీ క్లెయిమ్‌లకు యజమాని ఆమోద అవసరాన్ని




తొలగించిందని ఈపీఎఫ్ఓ అధికారులు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను బదిలీ చేయడంలో రెండు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) కార్యాలయాలు పాల్గొన్నాయి. పీఎఫ్ మొత్తాన్ని బదిలీ చేసిన సోర్స్ ఆఫీస్, డెస్టినేషన్ ఆఫీస్ రెండింటి ద్వారా పీఎఫ్ ఖాతా బదిలీ చేయాల్సి వచ్చేది. అయితే ఇక నుంచి బదిలీదారు (మూలం) కార్యాలయంలో బదిలీ క్లెయిమ్ ఆమోదించాక మునుపటి ఖాతా ఆటోమెటిక్‌గా బదిలీదారు (గమ్యస్థానం) కార్యాలయంలో సభ్యుని ప్రస్తుత ఖాతాకు తక్షణమే బదిలీ అవుతుందని ఈపీఎఫ్ఓ అధికారులు చెబుతున్నారు. ఈ అప్‌డేటెడ్ సిస్టమ్ పన్ను విధించదగిన పీఎఫ్ వడ్డీపై టీడీఎస్‌కు సంబంధించిన కచ్చితమైన గణనను సులభతరం చేస్తుందని పేర్కొంటున్నారు. అలాగే పీఎఫ్ ఖాతాలోని పన్ను విధించదగిన, పన్ను విధించబడని భాగాల విభజన చేసుకోవచ్చని వివరిస్తున్నారు. ఈ అప్‌డేట్ వల్ల 25 కోట్ల మంది సభ్యులు లాభపడతారని, ఇక నుంచి ఖాతా బదిలీ ప్రక్రియ మొత్తం బదిలీ వేగవంతం అవుతుందని పేర్కొంటున్నారు. సభ్యుల ఖాతాలకు నిధులను సకాలంలో జమ చేయడానికి సభ్యుల ఐడీ, అందుబాటులో ఉన్న ఇతర సభ్యుల సమాచారం ఆధారంగా యూఏఎన్ లను బల్క్ జనరేట్ చేసే సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. ఆ మేరకు ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించి ఎఫ్ఓ ఇంటర్‌ఫేస్ ద్వారా ఫీల్డ్ ఆఫీసులకు అందుబాటులో ఉంచారు. అలాంటి సందర్భాల్లో యూఏఎన్‌లను బల్క్ జనరేట్ చేయడానికి, ఈపీఎఫ్ఓ ??అప్లికేషన్‌లో ఆధార్ అవసరం లేకుండా గత సంచితాలను లెక్కించడానికి వీలు కల్పిస్తుంది. అయితే పీఎఫ్ నిల్వలను రక్షించడానికి రిస్క్ తగ్గింపు చర్యగా అలాంటి అన్ని యూఏఎన్‌లను స్తంభింపచేసిన స్థితిలో ఉంచుతారు. అలాగే ఆధార్‌ను సీడింగ్ చేసిన తర్వాత మాత్రమే వాటిని అమలులోకి తెస్తారు. ఈ చర్యలన్నీ సభ్యులకు సేవలను గణనీయంగా మెరుగుపరుస్తాయని, దీర్ఘకాలిక ఫిర్యాదులను తగ్గిస్తాయని ఈపీఎఫ్ఓ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ధాన్యం కొనుగోలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**పెద్దపల్లి, ఏప్రిల్ 30(నినాదం):** యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి, జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని,వీరికి 2 వేల 289 కోట్లు మద్దతు ధర కింద చెల్లించామని, యాసంగి పంట కింద ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 8.8 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లించడం జరుగుతుందని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఎక్కడ రావద్దని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు.
రైతుల దగ్గర నుంచి మద్దతు ధర పై ధాన్యం కొనుగోలు చేయడం ప్రాధాన్యతగా అత్యవసర పరిస్థితుల్లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు దానం కేటాయింపు చేయడానికి అనుమతులు కూడా కలెక్టర్లకు జారీ చేస్తున్నామని తెలిపారు.హార్వెస్టర్ల తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పంట కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు.రైస్ మిల్లర్లు తాలు,తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ శ్రీకాంత్, డీఎస్ఓ రాజేందర్, డి.ఆర్డి.ఓ కాలిందిని,సంబంధిత అధికారులు,

## పది ఫలితాల్లో మైనార్టీ గురుకుల బాలుర 3 విద్యార్థుల ప్రభంజనం

- ప్రిన్సిపల్ పోరండ్ల చంద్రమోహన్



**సుల్తానాబాద్, ఎప్రిల్ 30(నినాదం న్యూస్):** పదవ తరగతి ఫలితాలలో సుల్తానాబాద్ మండ లం దుబ్బపల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాల కరీంనగర్ బాలురు 3 విద్యార్థులు వంద శాతం ఉ త్తీర్ణత సాధించి విజయకేతనం ఎగరవేశాలని పా ఠశాల ప్రిన్సిపల్ పోరండ్ల చంద్రమోహన్ సంతో షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎం. నాగతేజ 5 63/600, ఎండీ. ఆసిఫ్ 541/600, బి. పవన్ కు మార్ 524/600, యు. అక్షయ్ 517/600 మా ర్కులు సాధించారు.ఎం. నాగతేజ 563 మార్కు లతో కరీంనగర్ జిల్లా మైనారిటీ గురుకులలో ప్రథ మంగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రి న్సిపాల్ పోరాండ్ల చంద్రమోహన్ హర్షం వ్యక్తం చే స్తూ విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభి నందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపా ల్, ఉపాధ్యాయ బృందాన్ని కరీంనగర్ డిఎండ బ్ల్యు ఓ పవన్ కుమార్, కరీంనగర్ మైనారిటీ గురు కులాల ఆర్సిఎల్ సురేష్ అభినందించారు.

## పది ఫలితాల్లో కాకతీయ హైస్కూల్ ప్రభంజనం



**మంథని ఏప్రిల్ 30( నినాదం న్యూస్):** మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ లో గత మార్చి నెలలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. పాఠశాలలో మొత్తము 42 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హాజరైన విద్యార్థులలో 100% ఫలితాలు సాధించారు. ఈ ఫలితాలలో దుర్గం త్రేక్ష 600/ 579 మార్కులు సాధించి మండలంలోని టాపర్ గా నిలిచింది. అదేవిధంగా పాఠశాలలో భానిని సిరి వర్షిని 567 మార్కులు సాధించి పాఠశాలలో రెండవ ర్యాంకు సాధించింది. పాఠశాల ఫలితాల్లో 500 కు పైగా 22 మంది విద్యార్థులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన దుర్గం తెక్ష, భానిని శ్రీ వర్షిని పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి అభినందించారు. గతంలో చెప్పినట్లుగా గత నాలుగు సంవత్సరాల నుంచి మంథని మండలంలో కాకతీయ పాఠశాల టాపర్ గా నిలుస్తూ అత్యధిక మార్కులు సాధించి విద్యార్థిని విద్యార్థులను పోషకులకు సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి, పావనీ అభినందించారు. అనంతరం టపాసులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు జరిపారు.

## పదిలో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ప్రభంజనం




**పెద్దపల్లి, ఏప్రిల్ 30(నినాదం) :** పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉప్పు వైష్ణవి-572,బొజ్జ అక్షర -557, బొంకూరి విష్ణు - 542, మారం శ్రావ్య - 542, శిఫానా అంజుమ్-537,చింతల లక్ష్మి శ్రీ -535,గంట సందీప్-534, గాండ్ల అనురాగ్-512,కంచి శివ సాయి - 504 మార్కులు సాధించిడమే కాకుండా 100% ఉత్తీర్ణత సాధించినట్లు గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, ఒక పటిష్టమైన ప్రణాళికతో, నిరంతరం వివిధ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం మూలంగానే బుదవారం అద్భుత ఫలితాలను సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను, నిరంతరం విద్యార్థుల పురోగతిని పర్యవేక్షిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు రజియుద్దీన్, మహేష్, సృజన, రిజ్వాన్, లింగేశ్వర్ పాల్గొన్నారు.

## ఆడపిల్లల ఆత్మ రక్షణ కై కరాటే ఆయుధం

- కలువల జయ ప్రసన్న
- కరాటేలో ప్రతిభను చాటి బ్లాక్ బెల్ట్ సాధించిన జయప్రసన్న



**సుల్తానాబాద్, ఏప్రిల్ 30 ( నినాదం న్యూస్ ):** ఆడపిల్లల ఆత్మ రక్షణ కొరకు కరాటే ఆయుధం అని కలువల జయ ప్రసన్న ఆడపిల్లల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్ లోని కలువల జయ ప్రసన్న ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సి హెచ్ మదన్ కుమార్ నుండి బ్లా క్ బెల్ట్ సెకండ్ డన్ ను అందుకు న్నారు. మంకీ ఫస్ట్ కింగ్ఫూ సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీ ఇం డియా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదు లోని నా గోల్ లో గత నాలుగు రోజులు గా ఫౌండర్ అండ్ చీఫ్ ఎగ్జామినర్ నింజా డీ డిగ్రీ అధ్యక్షతన కింగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీ నిర్వహించారు. ఈ పోటీలో తెలంగాణ మహా రాష్ట్ర ల నుండి 30 మం ది బ్లాక్ బెల్ట్ మాస్టర్లు హాజరయ్యారు స్పారింగ్ ప టాస్ కర్రే సాము నాంచాక్ తల్వార్ విభాగాల్లో వి న్యాసాలు సాధించిన హోస్ట ళ్లకు వివిధ హోదాలో బెల్టులు ప్రధానం కాగా బుధవారం సాయి ప్రసన్న కు బ్లాక్ బెల్ట్ ప్రధానం చేశారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల పై రోజు రోజు కు ఎన్నో అకృత్యాలు జరుగుతున్నాయన్నారు. వాటి నుండి మనల మనం కాపాడుకునే విదంగా కరాటే మనకు దోహదంచేస్తుందన్నారు. అందుకే ఆడ పి ల్లలను తల్లి తండ్రులు కరాటే క్లాసులకు పంపిం చాలని కోరారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

- జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్య క్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్
- కనుకుల,తొగర్రాయి ఎక్స్ రోడ్ వద్ద చలివేంద్రాలు ప్రారంభించిన తాళ్లపల్లి






**సుల్తానాబాద్, ఎప్రిల్ 30(నినాదం న్యూస్):** ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ప్రారం భించామని పెద్దపల్లి జిల్లా బిసి సం క్షేమ సంఘం అధ్య క్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ అన్నారు. బు ధవారం సుల్తానాబాద్ మం డలం కనుకుల, తొగ ర్రాయి ఎక్స్ రోడ్ వద్ద చలివేంద్రాలు ప్రారంభించా డు.అనంతరం ఆయన మాట్లాడుతూ, వేసవి కా లం ముదురుతున్న ఎండలతో కనుకుల, రాముని పల్లి, మంచిరామి, తొగర్రాయి గ్రామాల ప్రజల దా హార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు దోహదపడ తాయని అన్నారు.అలాగే తాళ్ళపల్లి ఆగయ్య ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉం టాయి అనీ అపద ఉన్నచోట తాళ్ళ పల్లి మనోజ్ గౌడ్ తప్పకుండా విద్య ,ఉపాధి, వై ద్య,క్రీడా పరమైన అవసరాలకు తప్పకుండా ముం దు ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు జిల్లా అధ్యక్షులు పాల రామా రావు, వాసు,రామచంద్ర రెడ్డి,కర్రే కుమార్,తిరుప తి రెడ్డి,కుమార్ బాబు, మైలారం నారాయణ, ఇ ల్లందుల శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్,కోట కుమార్ రెడ్డి,బోగసాయి,సతీష్,కోతిరెడ్డి రాంరెడ్డి, బిఆర్ఎ స్ యూత్ ఇంచార్జి రా జు, అంజయ్య, శ్రీనివాస్, ఓర్రే అజయ్,తుమ్మ రాజేశం,ఉప్పు సది, శశి, క్యా దాసి ప్రణయ్, ప్రజలు పాల్గొ న్నారు.

## దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

- దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్



**మంథని ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో కాళేశ్వరం నుండి 100 డబ్బులతో హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని మంథని నియోజకవర్గ దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంథని నియోజకవర్గ కోఆర్డినేటర్ గద్దెల శంకర్ తో కలిసి ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో రెండవ విడత దళిత బంధు 1100 మందికి మంజూరు చేసి కలెక్టర్ ఎంపిక చేశారన్నారు. ఎంపికైన దళితులకు గత ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసి కలెక్టర్ అకౌంట్లో జమ చేశారని వీటిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ద్వారా హుజురాబాద్ మిగతా జిల్లాల్లో రెండో విడత కింద ఫేజింగ్లో ఉన్న అమౌంట్ ను లబ్ధిదారులకు జమ చేయాలని జీవో జారీ చేసినప్పటికీ మంథని నియోజకవర్గంలో దళితులకు దళిత బంధు నిధులు విడుదల చేయడం లేదని వారు ఆరోపించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించామని పార్టీలకతీతంగా దళితులను లక్షాధికారులను చేసేందుకు దళిత బంధు నిధులు విడుదల చేయాలని వారు కోరారు. రెండో విడత లబ్ధిదారులుగా సెలెక్ట్ అయినా లబ్ధిదారులకు స్థానిక సంస్థల ఎన్నికలలోపు నిధులు విడుదల చేయాలని ఈ ప్రక్రియలు వేగవంతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండో విడత లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఈడి అకౌంట్లో ఉన్న డబ్బులను మా అకౌంట్లో వెంటనే వేయాలని ప్రభుత్వానికి దళిత బంధు లబ్ధిదారుల పక్షాణ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లేని పక్షంలో కాళేశ్వరం నుండి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి ఉపాధ్యక్షులు ఆర్ల స్వామి, డివిజన్ నాయకులు పోయిల తిరుపతి, డివిజన్ నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, జూల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 96.89 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత

**- జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి**

**పెద్దపల్లి, ఏప్రిల్30 (నినాదం):** బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పెద్దపల్లి జిల్లాకు చెందిన 96.89 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
10 వ తరగతి లో మొత్తం 7 వేల 387 మంది విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలో హాజరు కాగా 7 వేల 157 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, 108 పాఠశాలల్లో 100 శాతం పాస్ పర్సంటేజ్ నమోదయిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పది ఫలితాలలో కృష్ణవేణి స్కూల్ ప్రభంజనం



**మంథని టౌన్ ఏప్రిల్ 30 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మంథని పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 100శాతం ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించింది. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థి నీ, విద్యార్థులు లక్ష్మీ సూర్య 576/600, ఇ . ధనూష్ 572/600, జి. చైత్ర 565/600, ఐ. చేస్రజ్ఞ 560/600, వి. మహిత 555/600 మార్కులతో మంథని పట్టణంలో ఒక నూతన చరిత్రను సృష్టించారు. ఈ ఫలితాలలో ఈ పాఠశాల కు చెందిన 22 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా ఫలితాలను సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. అలాగే అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ,ఇందుకు సహకరించిన విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


## కుల వ్యవస్థను నిర్మూలించిన మహనీయుడు బసవేశ్వరుడు



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 30(నినాదం న్యూస్):** సమాజంలో కుల వ్యవస్థను వ్యతిరేకించి ఆధ్యాత్మికతను ప్రేరేపించిన మహనీయుడు బసవేశ్వర అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై విశ్వగురు బసవేశ్వరుని చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12వ శతాబ్దపు సాధువు, సామాజిక సంస్కర్త, బసవేశ్వరుడు పుట్టినరోజును బసవ జయంతిగా జరుపుకుంటున్నామని, బసవేశ్వరుడు కుల వ్యవస్థను వ్యతిరేకించడమే కాకుండా పనిని ఆరాధించమని, ఏమీ ఆశించకుండా సమాజానికి సేవ చేయాలని తెలపడం జరిగిందని, అనుభవ మంటపం అనే ఆధ్యాత్మిక వేదికను స్థాపించి సమానత్వం, సామాజిక న్యాయం అందరికీ అందేలా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మే 8 లోపు ఆడిట్ నిర్వహణకు దరఖాస్తులు సమర్పించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ




**పెద్దపల్లి, ఏప్రిల్30 (నినాదం) :** జిల్లాలోని మున్సిపల్ రికార్డుల ఆడిట్ నిర్వహణకు ఆసక్తి గల ఆడిటర్లు మే 8 లోపు దరఖాస్తులు సమర్పించాలని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఉన్న రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి ,సుల్తానాబాద్,మంథని మున్సిపాలిటీ లలోని ఏరియా లెవెల్ ఫెడరేషన్,టౌన్ లెవెల్ ఫెడరేషన్ కు సంబంధించిన రికార్డులను,ఆడిట్ చేయడానికి ఆసక్తి అర్హత అనుభవం కలిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆడిటర్లు పూర్తి వివరాలతో పాటు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆడిట్ నిర్వహణకు ఆసక్తి అర్హత కలిగిన ఆడిటర్లు తమ దరఖాస్తులను పథక సంచాలకులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ వారి కార్యాలయంలో మే 08 లోపు సమర్పించాలని,ఇతర వివరాలకు చరవాణి నెంబర్ 6304894940 నందు సంప్రదించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పదిలో మెరిసిన ప్రభుత్వ ఉద్యోగులు

**కోదాడ(అనంతగిరి), ఏప్రిల్30 (నినాదం న్యూస్):** విద్యార్థుల జీవితాల్లో తొలి అడుగు పదోతరగతి చాల కీలకపాత్ర వహిస్తుంది. మొదటి మెట్టే సరిగా పడితే భవిష్యత్లో శుభారంభం చేసినట్టే. ఇందుకు తగ్గట్లుగా శనివారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్కు దీటుగా పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి మన్నలు అందుకున్నారు. కోదాడ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 485 మంది గాను 441 మంది పాసయ్యారు. 90.9,3% ఉత్తీర్ణత సాధించారు. కోదాడ పీఎంశ్రీ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థిని రేఖ శ్రీ 571, కోదాడ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని పి వర్షిత 570 మార్కులు, కోదాడ మండలంలో మొదటి రెండవ స్థానంలో నిలిచారు. 571 మార్కులతో రేఖ శ్రీ ప్రభుత్వ పాఠశాల విభాగంలో సూర్యాపేట జిల్లా టాపర్ గా నిలిచింది. అనంతగిరి మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 249 మంది విద్యార్థులకు గాను 236 మంది పాసయ్యారు. 94.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. బిసి గురుకుల వెల్ఫేర్ పాఠశాలకు చెందిన సిహెచ్ శ్రావ్య 571, రోహిణి 561,శాంతినగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కావ్య 551, మార్కులు సాధించారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



- జిల్లా ఎస్పీడివి శ్రీనివాసరావు ఐపీఎస్

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 30(నినాదం న్యూస్) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి ఏప్రిల్ 30 వ తేదీ నుండి మే 31 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపీఎస్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, రాస్తారోకో, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు.

# తెలంగాణ ఎస్ఎస్సీ-2025 ఫలితాల్లో
# భాష్యం హైదరాబాద్ విజయభేరి



**హైదరాబాద్, ఏప్రిల్ 30(నినాదం న్యూస్) :** తెలంగాణ ఎస్ఎస్సీ-2025 ఫలితాలలో భాష్యం విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. బుధవారం విడుదలైన ఫలితాలలో ఒక్క భాష్యం హైదరాబాద్ నుండే మా విద్యార్థి బి.సూర్యరిషి 600కి 593 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జె.ఆదిత్య 592, ఎన్.లాస్యశ్రీ 592, ఇ. రక్షిత్ 591, ఆర్. కిరణ్ కుమార్ 591, పి. ఉత్కర్షిడ్డి 591, వై. నమ్రతసాయి 590, పి.బాలు 590, కె. అభిజ్ఞ 590 మార్కులు సాధించారు. 580 ఆ పైగా మార్కులను 103 మంది, 570 ఆ పైగా 278, 550 ఆ పైగా 708, 500 ఆ పైగా 1669 మంది విద్యార్థులు సాధించారు. మ్యాథ్స్ 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 1034, సైన్స్లో 90 ఆపైగా సాధించిన విద్యార్థులు 802 మంది అని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ భాష్యం జెడ్ఓ శిరీష మాట్లాడుతూ తెలంగాణ ఎస్ఎస్సి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు రికార్డు సృష్టించారన్నారు. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇలాంటి అద్భుత విజయాలు సాధించడం జరిగిందన్నారు. విద్యా విధానంలో సమగ్ర ప్రణాళికలతో భాష్యం జైత్రయాత్ర ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్లు అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీఈఓ చైతన్య, హైదరాబాద్ భాష్యం జోనల్ హెడ్ బి. అంకమ్మరావు, మార్కండేయులు, నగేష్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.




# పది ఫలితాల చరిత్ర.. కృష్ణవేణిదే ఘనత

- **డైరెక్టర్ మంజులశ్రీనివాస్ రెడ్డి**

**గోదావరిఖని, ఏప్రిల్30 (నినాదం):** ఏ ఫలితాల్లోనైనా చరిత్రను తిరగరాయటం కేవలం కృష్ణవేణికే సాధ్యమని స్థానిక కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్ రెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల సందర్భంగా బుధవారం పాఠశాల బాధ్యులు ఓ ప్రకటన జారీచేసారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి విద్యా సంస్థలు రామ గుండం పారిశ్రామిక ప్రాంతం లోనే ప్రభంజనం సృష్టిం చాయని లేఖలో పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. విద్యార్థులు సాధించిన మార్కులు క్రిందివిధంగా తెలిపారు. 600లకు గాను 578,571,568,568 లతో పాటు 20 మంది 550, 78 మంది500 నుండి-549, 53 మంది 450 నుండి499, 19 మంది విద్యార్థులు 400 నుండి449 వరకు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల చదువు కోసం అహర్నిశలు శ్రమించిన విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి,రామకృష్ణ, సత్యనారాయణ , శైలజ ఉపాధ్యాయ బృందం ను సైతం అభినందించారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత


బి.శ్రీనిలయ 578


జి.కార్తీక 571


బి.శ్రీనిలయ 578

NINADAM CINEMA

## జైలర్-2లో రజనీతో బాలయ్య

### - కోలీవుడ్‌లో తాజా చర్చ



జనీకాంత్ జైలర్ సినిమాలో అనేకమంది స్టార్ నటులు తారసపడతారు. మోహన్ లాల్ వంటి దిగ్గజ నటులు ఇందులో కనిపిస్తారు. ఇప్పుడు జైలర్-2 తెరకెక్కుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కూడా నటించబోతున్నారన్న వార్త బాలయ్య అభిమానుల్లో జోష్ నింపింది. రజనీకాంత్ ,బాలకృష్ణ కలిసి తెరపై సందడి చేయబోతున్నారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జైలర్2' మూవీ షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం నందమూరి బాలకృష్ణను చిత్ర బృందం సంప్రదించిందట. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు- తమిళ చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లో వచ్చిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'జైలర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. నెల్సన్ టేకింగ్, ఎలివేషన్స్‌కు తోడు రజనీకాంత్ స్టైలిష్ నటన సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చింది. ఆ మూవీ కొనసాగింపుగా 'జైలర్2' రూపొందుతోంది. తొలి భాగంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీష్రాఫ్ వంటి నటీనటులు సినిమాను మలుపుతిప్పే అతిథి పాత్రల్లో మెరిశారు. ఇప్పుడు అలాంటి పాత్రనే బాలకృష్ణ పోషించబోతున్నారని టాక్. జైలర్'లోనూ బాలకృష్ణను తీసుకుందామని తాను అనుకున్నట్లు నెల్సన్ ఓ సందర్భంలో చెప్పారు. అయితే, బాలకృష్ణకు ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ పాత్రను తీర్చిదిద్దలేకపోవడంతో ముందుకు వెళ్లలేదని అన్నారు. ఇప్పుడు నెల్సన్ ఆ పని పూర్తి చేసినట్లు తెలుస్తోంది.



## ప్రాధాన్యం ఉన్న పాత్రల కోసం చూస్తున్న నివేదా

కథలో తన ప్రాధాన్యత ఉంటేనే సినిమా చేస్తోంది మలయాళ కుట్టీ నివేదా థామస్. తెలుగులో చేసినవీ తక్కువ సినిమాలే అయినా గుర్తించిపోయే రోల్స్ చేసింది. నాని జెంటిల్ మెన్‌తో కెరీర్ స్టార్ట్ చేసిన నివేదా నిన్నుకోరి, జై లవకుశతో హ్యాట్రిక్ హిట్ అందుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అయ్యింది. గ్లామర్ పాత్రలకు నో చెబుతూ కథ నచ్చితేనే ప్రాజెక్ట్ యాక్సెప్ట్ చేస్తూ యునిక్ ఐడెంటిటీ-ని సొంతం చేసుకుంది. పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, నాని లాంటి స్టార్లతో జోడీ కట్టింది నివేదా థామస్. కానీ శాకినీ డాకిని తర్వాత ఆచితూచి సినిమాలు చేస్తోంది. లాస్ట్ ఇయర్ 35 చిన్న కథ కాదు అంటూ ఓ సగటు మహిళ పాత్రలో మెస్మరైజ్ చేసేసింది బ్యూటీ. ఇద్దరు పిల్లలు తల్లిగా డీ గ్లామర్ పాత్రల్లో మెరిసింది. ఈ సినిమా వచ్చి దాదాపు 8 నెలలు కావొస్తున్నా కొత్త మూవీ ఎనౌన్స్ చేయలేదు. అయితే విజయ్ సేతుపతితో టాలీవుడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఓ మూవీని ఎ÷-లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కోసంఈ కేరళ కుట్టీ-ని తీసుకున్నారని వార్తలు వచ్చాయి. కానీ అదేం లేదని పూరి టీ-ం క్లారిటీ- ఇచ్చింది. సో ప్రస్తుతం నివేదా చేతిలో సినిమాలేవీ లేవనే చెప్పాలి. ఒకప్పుడు స్టార్ హీరోలతో సినిమాలు చేసి ఇప్పుడు ఒక్క సినిమా కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇదిలా ఉం-టె- 35 సినిమా కోసం బరువు పెరిగిన నివేదా ప్రస్తుతం బరువు తగ్గే పనిలో ఉంది అందుకే సినిమాలు చేయట్లేదు అనే టాక్ కూడా వినిపిస్తోంది.

## రజనీ సార్.. సలహాలు పాటిస్తున్నా

### - విక్టరీ వెంకటేశ్ ఆసక్తికర వ్యాఖ్య



విక్టరీ వెంకటేశ్ ఇప్పుడు ఫుల్ స్వింగ్ లో ఉన్నాడు. మొన్ననే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మంచి హిట్ కొట్టాడు. దాని తర్వాత త్రివిక్రమ్ తో సినిమా చేస్తారనే ప్రచారం ఉంది. అయితే తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేను మొదటి నుంచి ఆధ్యాత్మికతను ఎక్కువగా పాటిస్తాను. తమిళ స్టార్ హీరో రజినీకాంత్ కూడా ఇలాగే ఆధ్యాత్మికతను ఎక్కువగా పాటిస్తుంటారు. నేను సినిమాల్లోకి వచ్చిన మొదట్లో రజినీకాంత్ తో ఎక్కువగా మాట్లాడేవాడిని. ఆయన మా నాన్న గారితో కూడా సినిమాలు చేశారు. నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఆయన నాకు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ టైమ్ లో మన పోస్టర్లు కట్టారా.. కటౌట్లు- పెట్టారా అనేవి ఆలోచించొద్దు. మన ముఖం పోస్టర్లలో సరిగ్గా కనిపిస్తుందా అనేది కూడా పట్టించుకోవద్దు. మంచి సినిమాలు చేయు. అవే నిన్ను జనాల్లోకి తీసుకెళ్తాయని చెప్పారు. అందుకే నేను అప్పటి నుంచి పబ్లిసిటీ- గురించి పెద్దగా పట్టించుకోను. ఈ పోస్టర్లు, కటౌట్ల జోలికి వెళ్లను. కేవలం మంచి సినిమాలు చేయాలని మాత్రమే ఆలోచిస్తుంటాను. అదే నన్ను సక్సెస్ చేసిందని అనుకుంటున్నాను' అంటూ చెప్పుకొచ్చారు వెంకటేశ్. ఆయన చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## నిర్మాతగా వైవిధ్యమైన కథలు ఎంచుకుంటా

### శుభం సినిమాతో నిర్మాతగా మారిన సమంత

నటిగా వైవిధ్యమైన పాత్రలతో అలరించిన సమంత నిర్మాతగానూ తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి సినిమా 'శుభం' మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఒకే రకమైన చిత్రాలకు పరిమితం కావాలని నేను అనుకోవడం లేదు. ఎన్నో కథలు వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒక మహిళగా నాకు ఎలాంటి చిత్రాలు నచ్చుతాయో అలాంటి వాటిని నిర్మించాలని భావిస్తున్నా. రొటీ-న్‌కు భిన్నమైన కథలను రూపొందిస్తానని తెలిపారు. 'శుభం' సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకుంటుందని నమ్మకం ఉందన్నారు. సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల 'శుభం'ని తెరకెక్కించారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. వినోదం నిండిన హారర్ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు ట్రైలర్ ఆధారంగా అర్థమవుతోంది. ఓ ఊర్లోని మహిళలంతా ఒక సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లు-గా ప్రవర్తించడం.. వాళ్ల బారి నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆ ఊర్లోని మగవాళ్లంతా అష్టకష్టాలు పడటం.. ఆఖర్లో సమంత మాతాజీగా ప్రత్యేక పాత్రలో కనిపించడం - ట్రైలర్‌లో ఆకర్షణగా నిలిచాయి. అయితే నటిగా కంటే నిర్మాతగానే ఎక్కువ విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు. రిస్క్ తీసుకుంటేనే జీవితంలో ముందుకు సాగుతామన్నారు. రిస్క్ తీసుకోకుండా అభివృద్ధిని ఆశించలేం. నాకు సవాళ్లను ఎదుర్కోవడం ఇష్టం. ఎన్నోసార్లు రిస్క్ తీసుకున్నాను. 15 సంవత్సరాల నా కెరీర్‌లో కథల గురించి తెలుసుకున్నాను. ఆ అనుభవంతోనే నిర్మాతగా మారాను. నాకు మంచి టీమ్ దొరికింది. సినిమాలో భాగమైనప్పుడు నటిగా కంటే నిర్మాతగా ఎక్కువ బాధ్యతలు ఉంటాయని అర్థమైంది. ఎన్నో విషయాలను పరిశీలించాలి. నేను ఈ సినిమా షూటింగ్ సమయంలో ప్రొడ్యూసర్‌గా ఎన్నో విషయాల గురించి సమగ్రంగా తెలుసుకున్నాను. ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని భావిస్తున్నట్లు చెప్పారు.

## నాని హిట్ మూవీకి టిక్కెట్ల రేట్లు పెంపు



నేచురల్ స్టార్ నాని నటించిన హిట్-3 మే1 న గురువారం రిలీజ్ కాబోతోంది. శైలేష్ కొలను డైరెక్షన్ లో వస్తున్న మూడో సినిమా. ఇప్పటికే వచ్చిన రెండు పార్టులు మంచి హిట్ అయ్యాయి. అందుకే మూడో పార్ట్ మీద అంచనాలు పెరుగుతున్నాయి. పైగా ఎన్నడూ లేనంతగా ఇందులో వైలెంటిక్ పాత్రలో నటిస్తున్నాడు నాని. ఇప్పటికే వచ్చిన టీజర్, ట్రైలర్ అంచనాలను పెంచేశాయి. మూవీ కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ టికెట్ల రేట్లు పెంచిన తర్వాతనే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయాలని మూవీ టీమ్ ప్లాన్ చేస్తోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం మూవీ టీమ్ కు గుడ్ న్యూస్ చెప్పింది. టికెట్ల రేట్లను పెంచుతూ జీవో విడుదల చేసింది. సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్ లలో రూ.75 వరకు పెంచుకునేందుకు పర్మిషన్ ఇచ్చింది. జీఎస్టీతో కలిపి ఈ ధరలను పెంచింది. విడుదలైన తేదీ నుంచి వారం వరకు ఈ ధరలు ఉంటాయి. మామూలు ధరలకే టికెట్లు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

s Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741